
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
29-8-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 208 పేజీలు: 12 వెల: 6.50

నోబెల్ కోసం ట్రంప్ స్వయంగా లాబీయింగ్!
కీవ్‌పై 598 డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా
9



## రాష్ట్రానికి 10,350 మె.ట యూరియా దిగుమతి

### రైతాంగానికి శుభవార్త తెలిపిన మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ, ఆగస్ట్ 28, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర రైతాంగానికి వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోక శుభవార్త తెలిపారు. రాష్ట్రానికి 10,350 మెట్రిక్ టన్నుల యూరియా గంగవరం పోర్టుకు చేరుకుంటున్నదని మంత్రి అచ్చెన్న తెలిపారు. యూరియా సరఫరా విషయంపై కేంద్ర వ్యవసాయ ఎరువుల రసాయనిక మంత్రితో మాట్లాడటంతో యుద్ధప్రతిపాదికన రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు సత్వరమే సానుకూలంగా స్పందించి రాబోయే సెప్టెంబర్ నెల 6 వ తేదీనాడు రావలసిన యూరియా సరుకును వారం ముందుగానే రాష్ట్రానికి సరఫరా చేసినందుకు కేంద్రానికి మంత్రి అచ్చెన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో త్వరితగతిన యూరియా రాష్ట్రానికి చేరుకుంటుందని అన్నారు. ఇండియన్ పొటాష్ లిమిటెడ్ (ఐపియల్) కంపెనీ ద్వారా ఈ ఎరువులను గంగవరం పోర్టులో దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధప్రాంతాల్లోని వ్యవసాయ పంటల సాగుపరిస్థితి, వాటిదశలను బట్టి యూరియా అవసరాలను శాస్త్రీయంగా బేరీజు చేసుకుంటూ, ప్రణాళిక బద్ధంగా అత్యంత అవసరం ఉన్న ప్రాంతాలకు, తక్షణ పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే ,వ్యవసాయ అధికారుల పూర్తి పర్యవేక్షణలో రైతులకు యూరియాను సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ కమీషనర్ డిల్లీ రావుకు మంత్రి ఆదేశించారు. సెప్టెంబర్‌నెల మొదటి వారంలో కాకినాడ పోర్ట్‌కు సుమారు మరొక 25000 మెట్రిక్ టన్నుల యూరియాకు తక్కువ కాకుండా సరఫరాకు కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి తెలిపారు. రైతులు యూరియా సరఫరా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ఖరీఫ్ సీజన్‌కి యూరియా పుష్కలంగా లభిస్తుందని హామీ ఇచ్చారు, రైతులు వారి పంట తక్షణ అవసరాలకు మాత్రమే యూరియాను కొనుగోలు చేయాలని, వచ్చే రబీ సీజన్‌కు ముందుస్తు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదని రైతులను మంత్రి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర

>>2


గురువారం ఎన్టీఆర్ జిల్లాలోని కాసరబాద్ రోడ్డులో క్యాజ్‌వేపై ప్రవహిస్తున్న నల్లవాగు

# తెరిపిలేని జడివాన

### ప్రకాశం బ్యారేజ్ వద్ద కొనసాగుతున్న వరద ఉధృతి, మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

### పలు ప్రాంతాలకు రాకపోకలు బంద్

### వణికిపోతున్న మన్యం, కోనసీమ జిల్లాలు

### విరిగిపడుతున్న కొండ చరియలతో జనం బెంబేలు

**విజయవాడ,ఆగస్టు28,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గత రెండురోజులుగా మోస్తారు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల పంట పొలాల్లో నీరు నిలిచి ఉంది. గురువారం ఉదయం వరకు పలు ప్రాంతాల్లో వానలు కురిసాయి. దీంతో ఎన్టీఆర్ జిల్లాలో కృష్ణకు ఉప నదులైన మున్నేరు. పాలేరు, కీసర పొంగి ప్రవాహసిస్తున్నాయి.

>>2


గురువారం ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉధృతి దృశ్యం



## ట్రంప్ సుంకాలకు భారత్ కౌంటర్

### అమెరికా తిరోగమన విధానాలపై 40 దేశాల్లో ప్రచారం

### ఎగుమతులు పెంచేందుకు ప్రత్యేక చర్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు నిన్నటి నుంచి అమల్లోకి వచ్చిన వేళ భారత్ కౌంటర్ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ అదనపు టారిఫ్‌లు, జరిమానాలతో తక్షణం ప్రభావితమయ్యే రంగాలను రక్షించుకునేందుకు మోదీ సర్కార్ చర్యలు చేపట్టింది. ఇప్పటికే జీఎస్టీలోస ంస్కరణలు తెచ్చి పన్నుల రంగాన్ని కొంతమేర సరళీకృతంచేసి కేవలం రెండు శ్లాబులు మాత్రమే అమలులోకి తెస్తోంది. అలాగే భారత్ జౌళి వస్తువులు, దుస్తులు, జెమ్స్, ఆభరణాలు వంటి ఎగుమతులపై 40 దేశాల్లో ప్రత్యేక ప్రోగ్రామ్‌లు నిర్వహించ బోతున్నట్టు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఇంగ్లాండ్, రష్యా, బెల్జియం,

>>2

# అర్హులందరికి ఫ్యామిలీ కార్డులు

### త్వరలో జనాభా విధానం, స్కీంల రీడిజైన్

### కుటుంబాల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

### ఆధార్ కార్డు తరహాలో ఫ్యామిలీ కార్డు వినియోగం: సిఎం చంద్రబాబు


గురువారం సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రతీ కుటుంబ సంక్షేమం, కనీస అవసరాలు తెలుసుకునేలా క్షేత్రస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్ట పరచాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో ఫ్యామ్లీ బెనిఫిట్ మానిటరింగ్ వ్యవస్థపై సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.." రాష్ట్రంలో అన్ని సంక్షేమ పథకాలను సంతృప్తి స్థాయిలో అందించాలి. అర్హులైన ప్రతి ఒక్కరిని గుర్తించాలి. ప్రతి కుటుంబానికి ఒక ఫ్యామిలీ స్కోరు కేటాయించాలి. ఆయా కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న ప్రయోజనాలపై పారదర్శకంగా ఉండాలి. దీని కోసం ఫ్యామిలీ కార్డును తీసుకురండి. ప్రతి కుటుంబానికి ఆ ఫ్యామిలీ కార్డు అందించాలి. ప్రభుత్వ పథకాలను ఆ ఫ్యామిలీ కార్డులో పొందుపర్చడంతో పాటు..పూర్తివివరాలు ఆ కార్డులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేకాకుండా... కుటుంబంలో ఎంత మంది ఉంటే.. వారందరికీ ఆ కార్డును ఇస్తే.. ఆధార్ కార్డు తరహాలో వారి అవసరాలకు ఉపయోగించుకుంటారు. ఆ కుటుంబాలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలి." అని సీఎం సూచించారు. క్షేత్ర స్థాయిలో వివిధ అంశాలకు సంబంధించిన సమాచారం ప్రభుత్వం వద్ద పూర్తి స్థాయిలో ఉండాలి. ప్రతి శాఖకు సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించుకోవాలి.. వాటిని అనుసంధానం చేసుకోవాలి. అప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలం. పదే పదే డేటా గురించి, డేటా అనుసంధానం గురించి మాట్లాడ్డానికి బలమైన కారణం ఉంది. క్షేత్ర స్థాయికి సంబంధించిన పక్కా సమాచారం ప్రభుత్వం వద్ద ఉంటే.. దానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవచ్చు. ఇప్పుడు సోషల్ రీఇంజినీరింగ్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. బీసీ, ఎస్సీల్లో ఉన్న కొన్ని కులాలు చాలా వెనుకబడి ఉన్నాయి. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వారికి లబ్ది అందడం లేదు. ఓసీల్లో కూడా ఇంకా ఆర్థికంగా వెనుకబడి వారున్నారు. వారి అవసరాలను గుర్తించాలి. అలాంటి వారిని గుర్తించాలన్నా... వారి వెనుకబాటుతనాన్ని రూపుమాపాలన్నా.. సమాచారం అవసరం. రాజకీయంగా పార్టీ యంత్రాంగం నుంచి నేను చేయాల్సింది చేస్తున్నాను. వారిని ఆర్థికంగా, సామాజికంగా ఆదుకోవాలంటే ప్రభుత్వ యంత్రాంగం సమర్థవంతంగా పని చేయాలి. దాని కోసమే సమాచారాన్ని అనుసంధానించే అంశం మీద ఫోకస్ పెట్టాలని చెబుతున్నాను." అని చంద్రబాబు వెల్లడించారు.

"ప్రజలే ఆస్తి. వారి ద్వారానే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి. జనాభా పెరిగితే... సంపద పెరిగే రోజులు వచ్చాయి. ఇది కొనసాగాలంటే.. చక్కటి కుటుంబ వ్యవస్థ ఉండాలి. కలిసి ఉంటే కలదు సుఖం అనే మన సంస్కృతిని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రభుత్వ పథకాల కోసం కుటుంబాలు విడిపోయే పరిస్థితి కొన్ని చోట్ల కనిపిస్తోంది. అలా జరగడం బాధాకరం. ప్రతి కుటుంబ సంతోషాన్ని కోరుకుంటున్న ప్రభుత్వమిది. పథకాల కోసం కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే పరిస్థితిని తప్పించాలని భావిస్తున్నాం. ఉమ్మడి కుటుంబాలు ఉంటే.. పథకాలు రావనే ఆందోళన లేకుండా ఉండేందుకు అవసరమైతే ప్రభుత్వ సంక్షేమ పథకాలను రీడిజైన్ చేస్తాం. లబ్దిదారులకు మరింత మేలు చేకూర్చ డంతో పాటు.. కుటుంబాలు విడిపోకుండా చూస్తాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు రూ.4.9 కోట్ల ప్రోత్సాహకాలు

**విజయవాడ,ఆగస్టు28,ప్రభాతవార్తప్రతినిధి:** గత వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిన రూ. 4.9కోట్ల క్రీడాప్రోత్సాహకాలను కూటమి ప్రభుత్వం విడుదల చేసి ఏపీలోని క్రీడాకారులకు తీపికబురు చెప్పిందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా రూ. 4కోట్ల 9లక్షల 2వేలు బకాయిలను విడుదల చేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు. దీనివల్ల ఏపీలో 43మంది అంతర్జాతీయ క్రీడాకారులకు లబ్ధి చేకూరిందని, తద్వారా వారు క్రీడల్లో మరింత రాణిచ్చేందుకు ఈ ప్రోత్సాహకాలు ఉపయోగపడతాయని వివరించారు. క్రీడలు, క్రీడాకారుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకుందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రీడాకారులందరూ సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాప్రోత్సాహకాలు విడుదల చేసిన సీఎం

>>2


గురువారం జమ్మూలో భారీ వర్షాలకు తావి వంతెన సమీపంలో కొట్టుకుపోయిన రోడ్డు

## కరిగిపోతున్న ఉత్తరాది

### హిమాచల్, జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్, యుపి రాష్ట్రాల్లో వరద విలయం

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** ఉత్తరభారతదేశాన్ని వరదలు వర్షాలు వణికించేస్తున్నాయి. జమ్ముకాశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు ఈ వరదల భయం మరింతగా ఉంది. కొండచరియలు విరిగిపడుతుండటంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోతుండటంతోపాటు పురాతన ఇళ్లకూలి నివాసితులు కూడా చనిపోతున్నారు. రావి, బియాస్ నదులు భీకరరూపకం చూపిస్తున్నాయి. నిర్దేశిత నీటిమట్టాలను అధిగమించి మరీ ప్రవహిస్తుండటంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మ్ముకాశ్మీర్‌లోని వైష్ణో దేవియాత్ర మార్గంలో

>>2


సచివాలయంలో గురువారం జరిగిన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

## రూ.53,922 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపిబి ఆమోదం

### ఏరోస్పేస్, ఐటి, ఇంధనం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో భారీ పెట్టుబడులు: సిఎం చంద్రబాబు

### 83,437 మందికి ఉద్యోగావకాశాలు

### నవంబరు 15లోగా ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు

**విజయవాడ, ఆగస్టు 28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామిక ప్రాజెక్టులు ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. స్పీడ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో త్వరగా అనుమతులిస్తున్నామన్నారు. అదే తరహాలో ప్రాజెక్టుల గ్రౌండింగ్ కూడా అంతే వేగంగా జరిగేలా చూడాలని సీఎం ఆదేశించారు. సచివాలయంలో గురువారం సీఎం అధ్యక్షతన 10వ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశమైంది. రూ. 53922 కోట్ల మేర పెట్టుబడులు పెట్టే 30 ప్రాజెక్టులకు సీఎం ఆధ్వర్యంలోని ఎస్ఐపీబీ ఆమోదించింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 83,437 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ఏర్పాటు అవుతున్న ప్రాజెక్టుల పురోగతిపై ఇక నుంచి ప్రతీ నెలా సమీక్షిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుల్లో స్థితిగతులపై క్షేత్రస్థాయిలో మంత్రులు కూడా పరిశీలించాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటి వరకూ అనుమతులిచ్చిన ప్రాజెక్టుల వివరాలను, ఉత్పత్తి ప్రారంభించేందుకు ఎంత సమయం పట్టిందన్న అంశాలను విశ్లేషించాలని సీఎం సూచించారు. ఏ ప్రాజెక్టు అయినా ఆలస్యం అవుతుంటే సంబంధిత సంస్థల ప్రతినిధులతో మాట్లాడి పనులు వేగంగా పూర్తి చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని.. అధికారులు కూడా అదే వేగంతో పనిచేయాలని సూచించారు. మహీంద్రా ఈవీ వాహనాల ఉత్పత్తి ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేసేలా తానే స్వయంగా సంప్రదిస్తున్నానని..

>>2

## రూ.1,129 కోట్లతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

### యేడాదిలోగా భవన నిర్మాణం.. కేంద్రం నుంచి 80 % మేర సాయం

### శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా 284 భవనాలు: మంత్రి సత్యకుమార్



**విజయవాడ,ఆగస్టు28,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. ఈ క్రమంలో 4,472 గ్రామాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్ లకు భారీ వ్యయంతో సొంత భవనాల్ని నిర్మించాలని నిర్ణయించింది. ఈ నిర్మాణాల కోసం రూ.1129 కోట్లు వ్యయం చేయనుంది. 26 జిల్లాల్లో 10,032 విలేజ్ హెల్త్ క్లినిక్ లు వైద్య సేవల్ని అందిస్తున్నాయి. వీటిలో 1,086 విలేజ్ హెల్త్ క్లినిక్ లు( ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు) ప్రభుత్వ భవనాల్లో ఉన్నాయి. మిగిలిన వాటిలో ఎక్కువ భాగం అద్దె భవనాల్లో నడుస్తున్నందున ప్రజలకు వైద్య సేవలందించే క్రమంలో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులపై ఉన్నతస్థాయి అధికారులతో సమీక్షించిన వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ రూ.1129 కోట్ల వ్యయంతో 4,472 గ్రామాల్లో హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాలు నిర్మించడానికి ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా గత ప్రభుత్వం నిర్మాణ పనుల్ని చేపట్టి నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా అసంపూర్తిగా మిగిలిపోయిన 2,309 భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తారు. దీంతో పాటు మరో 2,163 నూతన భవన నిర్మాణ పనుల్ని పిఎంఅభిం(696 భవనాలు), 15వ ఆర్థిక సంఘం నిధులతో(1467 భవనాలు) చేపడతారు. హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాల ప్రాధాన్యత దృష్ట్యా ఈ నిర్మాణ పనుల్ని ఏడాదిలోపు పూర్తి చేయాలని, ఈమేరకు నిర్మాణ పనుల్ని చేపట్టనున్న పంచాయితీరాజ్ శాఖతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రి సూచించారు. మొత్తం 8,946 విలేజ్ హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా గత ప్రభుత్వం 3,105 భవనాల్ని మాత్రమే నిర్మించింది. ఎన్ఆర్ ఇజియస్, ఎన్ హెచ్ఎం నిధులతో మరో 2,309 భవన నిర్మాణ పనులు ప్రారంభించి అర్థాంతరంగా నిలిపివేసింది. ఇలా చేపట్టిన

>>2

## ఉల్లి రైతులకు నష్టం రానివ్వం

### -సిఎం చంద్రబాబు

**విజయవాడ ఆగస్టు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఇబ్బందుల్లో ఉన్న ఉల్లి రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రైతుల నుంచి ఉల్లిని తక్షణమే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. గురువారం నుంచే క్వింటాకు రూ.1200 చెల్లించి ఉల్లిని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో రైతుల నుంచి ఉల్లికొనుగోళ్లపై గురువారం

>>2

### తెలుగు రాష్ట్రాల రైల్వే ఆసుపత్రుల్లో

## సిబిఐ దాడులు

### అదుపులో ఇద్దరు రైల్వే ఉద్యోగులు.. మరో వ్యక్తి

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 28,ప్రభాతవార్త:** కేంద్ర అవినీతి నిరోధక సంస్థ సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సిబిఐ) తెలుగు రాష్ట్రాలతో ప్రమేయం ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకుని విజయవాడలోని సిబిఐ కోర్టులో హాజరు పరిచింది. విశాఖపట్నం సిబిఐ ఏసిబికి విశ్వసనీయ వర్గాల ద్వారా అందించిన సమాచారం మేరకు సిబిఐ ప్రత్యేక బృందం విజయవాడ డివిజనల్ ఆసుపత్రిలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న హస్మత్ అలీ, దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో సీనియర్ పాసింజర్ ట్రైన్ మేనేజర్(గార్డు)గా పనిచేస్తున్న శివనాగ ప్రసాద్‌లతో పాటు మరో ప్రైవేటు వ్యక్తిని అదుపులోకి తీసుకుంది. తనను మెడికల్ డీ-క్యాటగిరైజ్ చేసేందుకు లక్ష రూపాయలు, ముందుగా కుదుర్చుకున్న ఒప్పందంప్రకారం ముందుగా రూ.90వేలు నగదు, మరో రూ.10వేలను ఫోన్‌పే ద్వారా పంపాడు. ఈ సమయంలో నిందితులతోపాటు ఇద్దరుకూడా ఆర్థోడాక్టర్ శ్రీనివాస సత్యనారాయణతో సికింద్రాబాద్‌లోని రైల్వేసెంట్రల్ ఆసుపత్రి రూం. నెం.7లో విచారించారు. మెడికల్

>>2



అమృత్‌సర్‌లో గురువారం భారీ వరదలు పోటెత్తడంతో లోతట్టు ప్రాంత ప్రజలను తరలిస్తున్న సహాయక సిబ్బంది.

# రూ.1,129 కోట్లతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

>> 5,414 భవన నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.8.75 లక్షలు చొప్పున కేంద్రమిచ్చే ఎన్ఆర్ ఇజియస్ నిధులను వాడారు. 201920 నాటి రేట్ల ప్రకారం ఒక్కో భవనం నిర్మాణానికి రూ.20.80 లక్షలుగా అప్పట్లో నిర్ధారించారు. ఎన్ఆర్ ఇజియస్ నిధులకు అదనంగా ఒక్కో భవన నిర్మాణానికి ఎన్‌హెచ్ఎం పథకం కింద రూ. 12.05 లక్షలను కేటాయించగా ఇందులో కేంద్రం 60 శాతం వాటాను అందించింది. అయినా నిర్మాణ పనులు ఆలస్యమయ్యాయి. గ్రామ స్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించే ఉద్దేశంతో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల స్థాపనకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మున్నెన్నడూ లేనివిధంగా ప్రతి గ్రామంలో హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం ప్రారంభం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలో హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం భారీగా సాయమందించిందని మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.

గత ప్రభుత్వంలో చేపట్టిన నిర్మాణ పనులకు, ఇప్పుడు చేపట్టనున్న నిర్మాణ పనులకు అవసరమయ్యే మొత్తం ఖర్చులో 80 శాతాన్ని కేంద్రమే అందిస్తోందని మంత్రి తెలిపారు. హెల్త్ క్లినిక్ నిర్మాణాల కోసం ఎన్‌హెచ్ఎం మరియు పిఎంఅభిమ్ పథకాల కింద కేంద్రం 60 శాతం ఖర్చును భరిస్తుందని, దీంతోపాటు 100 శాతం గ్రాంటుగా లభించే 15వ ఆర్థిక సంఘం నిధులతో కూడా హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులను చేపడుతున్నామని మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వివరించారు. ఈ మేరకు ఇప్పటి వరకు చేపట్టిన నిర్మాణ పనులు, ఇప్పుడు ఆమోదించిన నిర్మాణ పనులకు మొత్తం రూ.2,254 కోట్లు ఖర్చవుతుందని, ఇందులో రూ.1,808 కోట్లు కేంద్ర సాయమని మంత్రి తెలిపారు.

దరిమిలా... రాష్ట్రంలో హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులకు అయ్యే మొత్తం ఖర్చులో 80 శాతం కేంద్రమే అందిస్తోందని మంత్రి విశదీకరించారు. రాష్ట్రంలో మరో 1,379 నూతన భవనాలను రూ.753 కోట్ల ఖర్చుతో నిర్మించాల్సి ఉందని, వీటిని 16వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. పూర్తి గ్రాంటుగా లభించే ఈ నిధులతో కలిపి రాష్ట్రంలో హెల్త్ క్లినిక్ భవనాలకు అయ్యే మొత్తం ఖర్చులో 85 శాతం కేంద్రమే ఇచ్చినట్లవుతుందని మంత్రి వివరించారు. ఈ భారీ సాయానికి ప్రధాన మంత్రి మోదీకి మంత్రి సత్యకుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు. రూ.1129 కోట్ల వ్యయంతో చేపట్టనున్న భవన నిర్మాణ పనుల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా 284 విలేజ్ హెల్త్ క్లినిక్ లకు సొంత భవనాలు ఏర్పడనున్నాయి. తరువాతి క్రమంలో నంద్యాల జిల్లాలో 272, ఏలూరు జిల్లాలో 263, కోనసీమ జిల్లాలో 242, కృష్ణా జిల్లాలో 240, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 239, చిత్తూరు జిల్లాలో 229, బాపట్ల జిల్లాలో 211, పార్వతీపురం మన్యం జిల్లాలో 205, ప్రకాశం మరియు నెల్లూరు జిల్లాల్లో 203 చొప్పున, అనకాపల్లి జిల్లాలో 200 నూతన భవనాలు ఏర్పడతాయి. గుర్తించిన అవసరాల మేరకు...రాయలసీమలోని తిరుపతి, కర్నూలు, అన్నమయ్య, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఒక్కోచోట 100కి పైగా నూతన భవనాల్ని నిర్మిస్తారు.

### తెలుగు రాష్ట్రాల రైల్వే ఆసుపత్రుల్లో
# సిబిఐ దాడులు

>> డీ-క్యాటగరైజేషన్ నిమిత్తం ఇద్దరు కూడా డాక్టర్ శ్రీనివాస సత్యనారాయణపై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు అభిజ్ఞ వర్గాల సమాచారం. ఈ వ్యవహారానికి హస్మత్‌అలీ బావమరిది షేక్ రసూల్(ప్రైవేటు వ్యక్తి) ఇతను రైల్వేడాక్టర్లకు, రైల్వే ఉద్యోగులకు మధ్య సిక్‌నెస్, అన్‌ఫిట్, డీ-క్యాటగరైజేషన్ వంటి లావాదేవీల వ్యాపాకాలకు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్లు సిబిఐ వర్గాలు తెలిపాయి.

# ఉల్లి రైతులకు నష్టం రానివ్వం

>> ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, మార్కెటింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. ఉల్లి రైతుల పరిస్థితి, ఉల్లి ధరలు ఏ మేరకు ఉన్నాయనే అంశంపై చంద్రబాబు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఉల్లి పంటకు సంబంధించిన క్రయ విక్రయాలపై అంశంపై చర్చించారు. ఉల్లి పంట దెబ్బ తిన్న కారణంగా.. మహారాష్ట్ర ఉల్లి పంట ఎక్కువగా ఉన్న కారణంగా ధరల విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు తెలిపారు. వచ్చే పది రోజుల్లో 5 వేల మెట్రిక్ టన్నుల ఉల్లి పంట వచ్చే అవకాశం ఉందని సీఎంకు అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.."ఉల్లి రైతులకు నష్టం వాటిల్లకూడదు. క్వింటా ఉల్లిని రూ. 1200 చొప్పున కొనుగోలు చేయండి. తక్షణం కొనుగోళ్లు ప్రారంభించాలి. మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ నుంచి నష్టాన్ని భరించాలి. కమ్యూనిటీ హాళ్లల్లో అద్దెకు తీసుకుని ఆరబెట్టాలి. ఆరబెట్టిన ఉల్లిని రైతు బజార్లకు పంపిణీ చేయాలి. ఉల్లికి రేటు వచ్చేంత వరకూ కమ్యూనిటీ హాళ్లల్లో నిల్వ చేసుకునేందుకు రైతులకు అవకాశం కల్పించాలి. రైతు నష్టపోకూడదు.. వినియోగదారుడు ఇబ్బంది పడకూడదు. అన్ని పంటల ధరల స్థిరీకరణ కోసం వేర్ హౌసింగ్ సదుపాయం కల్పించాలి." అని ముఖ్యమంత్రి అన్నారు.

**రైతు బజార్ల ఆధునీకరణకు చర్యలు**

రాష్ట్రంలోని రైతు బజార్ల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని సీఎం మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న రైతు బజార్ల సంఖ్యను పెంచాలని సూచించారు. వీటిని 150 నుంచి 200 వరకూ చేసేలా ప్రణాళిక చేయాలని అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ "రైతు బజార్లను నెక్స్ లెవల్ కు తీసుకెళ్లాలి. మార్కెట్ యార్డుల్లోని 23 ఎకరాల భూమిని వినియోగించుకుని కొత్తగా ఆధునిక రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలి. మార్కెట్ యార్డుల్లో వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ లను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు చేయండి. రైతులకు, వినియోగదారులకు ఉపయోగపడేలా మార్కెట్ యార్డు స్థలాలు వినియోగించాలి. ధరల నియంత్రణకు.. ద్రవ్యోల్బణం పెరగకుండా ఈ చర్యలు ఉపకరిస్తాయి." అని సీఎం అన్నారు.

## రాష్ట్రానికి 10,350 మె.ట యూరియా దిగుమతి

>> వ్యాప్తంగా ఎరువులను ఇతర రాష్ట్రాలకు, పక్కదారి మళ్ళకుండా,అధిక ధరలకు అమ్ముకుండా, నిఘా ఎన్ఫోర్స్మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేసి, కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీల ఆధ్వర్యంలో వ్యవసాయ, పోలీసు,విజిలెన్స్, రెవెన్యూ,పరిశ్రమల అధికారులతో సంయుక్త టీమ్‌లను ఏర్పరిచి తనిఖీలను చేస్తున్నామని తెలిపారు.

### ట్రంప్ సుంకాలకు
# భారత్ కౌంటర్

>> యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఆస్ట్రేలియా, జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్, నెదర్లాండ్స్, పోలండ్, కెనడా, మెక్సికో తదితర దేశాల్లో భారత్ ప్రత్యేక ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహించబోతోంది. ఈ దేశాల్లో మన ఉత్పత్తులకు మార్కెట్‌ను మరింత విస్తరించేలా ఈ ప్రోగ్రామ్‌లు ఉండనున్నాయి. మన వస్తువుల నాణ్యత, సుస్థిరత గురించి ఆయా దేశాలకు చాటిచెప్పేలా ఈ ప్రోగ్రామ్స్ డిజైన్ చేస్తున్నారు. సరికొత్త టెక్స్‌టైల్ ఉత్పత్తులతో ఆయా మార్కెట్లలో మన దేశం ప్రధాన పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఈ కార్యాచరణ ప్రతిపాదించారు. ప్రస్తుతం భారత్ 220 దేశాలకు ఎగుమతులు చేస్తోంది. ఇందులో ఈ ప్రతిపాదిత 40 దేశాలు కీలకమైనవి. ఈ దేశాలన్నీ కలిపి ఏటా 590 బిలియన్ డాలర్లకు పైగా విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో ఈ యూరోప్ దేశాల్లో మార్కెట్ షేర్ పెంచుకుంటే అది మన పరిశ్రమలకు విస్తృత అవకాశాలు కల్పించనుందని మార్కెట్ నిపుణులు భావిస్తున్నారు. మార్కెట్ మ్యాపింగ్, డిమాండ్ ఎక్కువగా ఉండే ఉత్పత్తులను గుర్తించడం, సూరత్, పానిపట్, తిరుపూర్, బదోహి వంటి ప్రాంతాల్లో పేరొందిన స్వదేశీ ఉత్పత్తులకు ఈ 40 దేశాల్లో ప్రచారం కల్పించడం వంటి కార్యక్రమాలు చేపట్టేందుకు ఇప్పుడు కేంద్రం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్లు, వాణిజ్య మేళాలు, అమ్మకం కొనుగోలుదారులతో సమావేశాలు, యునిఫైడ్ బ్రాండ్ ఇండియా విజన్ కింద ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించబోతోంది భారత్. తద్వారా భారత వాణిజ్య రంగాన్ని రక్షించుకోవాలని చూస్తోంది.

## వారం - వర్జ్యం

29-08-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
షష్ఠి రా.8.22
స్వాతి ఉ.11.38
వర్జ్యం : సా.5.56-7.44
దు.ఉ.8.25-9.15, 2) మ.12.35-1.25
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పత్రాలపై సంతకాలు చేయనప్పుడు జాగ్రత్తలు పాటించండి.

**వృషభం:** కారణం లేని చికాకులు ఉంటాయి. ఆర్థికంగా పొదుపు పాటించలేకపోతారు.

**మిథునం:** నూతన వ్యక్తులు పరిచయమై మారు సహాయం అందిస్తారు. వాహనయోగం.

**కర్కాటకం :** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తిచేస్తారు. ఆర్థికపరిస్థితి అనుకూలం.

**సింహం:** ఇంటాబయటా మీదే పై చేయిగా నిలుస్తుంది. ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**కన్య :** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. సోదరుల కలయిక.

**తుల :** నిదానమే ప్రధానమని నానుడిని గుర్తుపెట్టుకొని ఒకటి రెండుసార్లు ఆలోచించడం అన్నివిధాలా మంచిది.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. వివాహయత్నాలు ఫలిస్తాయి.

**ధనుస్సు:** ఉద్యోగావకాశాలు లభిస్తాయి. బాకీలు వసూలవుతాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మకరం:** బంధువులనుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. సేవా కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**కుంభం:** రాజకీయ, కళారంగాలలోని వారికి విదేశీపర్యటనలు ఉంటాయి. స్థలాలు కొనుగోలుచేస్తారు.

**మీనం :** భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎస్ఐపిబి ఆమోదం

>> దీనికి అనుగుణంగా అధికారులూ స్పందించాలని సీఎం అన్నారు.

**ఎఐపిలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలదే ప్రధాన భూమిక..**

వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైన ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలే కీలకమని.. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇవి ప్రధాన భూమిక పోషిస్తాయని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హార్టీకల్చర్ హబ్ గా రాయలసీమతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు పుష్కలంగా అవకాశాలున్నాయని అన్నారు. పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు అధికారులు ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు చేయాలని సీఎం సూచించారు. చిత్తూరు, అన్నమయ్య తదితర జిల్లాల్లో స్థానికంగా ఉన్న మ్యాంగో ప్రాసెసింగ్ పరిశ్రమల వల్లే రైతులకు ఎక్కువ ఇబ్బంది లేకుండా చూడగలిగామని అన్నారు. పొరుగున తమిళనాడు, కర్ణాటకలలో ఈ తరహా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు లేవన్నారు.

**బిజినెస్‌సెంటర్ల తరహాలో ఎంఎస్ఎంఇపార్కులతో ఎకోసిస్టం.**

రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు పూర్తి కావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇప్పటికే ప్రారంభించిన ప్రాంతాల్లో మినహా మిగతా నియోజకవర్గాల్లో 3 నెలల్లో ఈ పార్కులు అందుబాటులోకి రావాలన్నారు. ఈ పారిశ్రామిక పార్కులన్నీ బిజినెస్ సెంటర్లలా చేసి.. ఒక ఎకో సిస్టంను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. రైతులు, భూయజమానుల్ని కూడా ఈ పారిశ్రామిక పార్కుల్లో భాగస్వాములను చేయాలని సీఎం స్పష్టం చేశారు. తద్వారా వారికి ఆదాయం వచ్చేలా చేయాలని అన్నారు. అలాగే రాష్ట్రంలో మెగా, మీడియం స్థాయిలో పారిశ్రామిక పార్కులను నియోజకవర్గాల వారీగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ పారిశ్రామిక పార్కులకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లను అనుసంధానించటంతో పాటు వాటికి ప్రామాణిక మార్గదర్శకాలను నిర్దేశించాలన్నారు. పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో ఆర్టీఐహెచ్ ద్వారా జరిగే కార్యకలాపాలను సమీక్షించాలని సీఎం సూచించారు.

**10వ ఎస్ఐపిబి సమావేశంలో ఆమోదించిన ప్రాజెక్టులు..**

10వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన ప్రాజెక్టులు. చిత్తూరు జిల్లాలో మథర్ డెయిరీ లిమిటెడ్ రూ.427 కోట్లు పెట్టుబడులు, 180 మందికి ఉద్యోగాలు,ఏసీఈ ఇంటర్నేషనల్ లిమిటెడ్ రూ.786 కోట్ల పెట్టుబడులు, 1000 మందికి ఉద్యోగాలు, అపోలో టైర్స్ రూ.1110 కోట్ల పెట్టుబుడులు, 500 మందికి ఉద్యోగాలు, తిరుపతిలో స్కైరూట్‌ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.400 కోట్ల పెట్టుబుడలు, 300 మందికి ఉద్యోగాలు, మడకశిలో హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1197 కోట్ల పెట్టుబడులు, 870 మందికి ఉద్యోగాలు, అనకాపల్లిలో వరాహ్ ఆక్వా ఫార్మ్స్ రూ.32 కోట్ల పెట్టుబడులు, 3,500 మందికి ఉద్యోగాలు, జె.కుమార్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ రూ.237 కోట్ల పెట్టుబడులు, 5000 మందికి ఉద్యోగాలు, చిత్తూరులో అలీప్ సంస్థ, రూ.45 కోట్ల పెట్టుబడులు, 2,500 మందికి ఉద్యోగాలు, నెల్లూరులో ఇఫ్కో కిసాన్ సెజ్ రూ. 870 కోట్ల పెట్టుబడులు, 25,000 మందికి ఉద్యోగాలు, కృష్ణపట్నంలో ధీరూభాయ్ అంబానీ గ్రీన్‌టెక్‌పార్క్ రూ. 1843 కోట్ల పెట్టుబడులు, 19,000 ఉద్యోగాలు, భోగాపురంలో ఎన్.కామ్ వైజాగ్ హోటల్ రూ.178 కోట్ల పెట్టుబడులు, 250 మందికి ఉద్యోగాలు,అమరావతిలో మంజీరా హాస్పిటాలిటీ, రూ.276 కోట్ల పెట్టుబడులు, 225 మందికి ఉద్యోగాలు,మంత్రాలయంలో శ్రీ వెంకటేశ్వర లాడ్జి రూ.96 కోట్ల పెట్టుబడులు, 300 మందికి ఉద్యోగాలు, కొలిమిగుండ్ల, నంద్యాల జిల్లాలో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) రూ.1500 కోట్ల పెట్టుబడులు, 950 మందికి ఉద్యోగాలు, రామగిరి, ముత్తవకుంట్ల, సత్యసాయి జిల్లా. సోలార్ ఎనర్జీ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా రూ.800 కోట్లు, 200 మందికి ఉద్యోగాలు, అనంతపురంలో సెరెంటికా రెన్యూవబుల్స్ ఆఫ్ ఇండియా రూ.2000 కోట్ల పెట్టుబడులు, 320 మందికి ఉద్యోగాలు, .కర్నూలు.లో సెరెంటికా రెన్యూవబుల్స్ ఆఫ్ ఇండియా రూ.2,400 కోట్ల పెట్టుబడులు, 380 మందికి ఉద్యోగాలు, కడప. హెక్సా ఎనర్జీ బీహెచ్ ఫైవ్ ప్రైవేట్ లిమిటెడ్, రూ.1,200 కోట్ల పెట్టుబడులు, 400 మందికి ఉద్యోగాలు, శ్రీ సత్యసాయి జిలా రెఫెక్స్ సోలార్ ఎస్పీవీ ఫైవ్ లిమిటెడ్, రూ.480 కోట్ల పెట్టుబడులు, 345 మందికి ఉద్యోగాలు, అనంతపురంలో బ్రైట్ ఫ్యూచర్ పవర్ లిమిటెడ్, రూ.3,286 కోట్ల పెట్టుబడులు, 440 మందికి ఉద్యోగాలు, పాడేరులో నవయుగ ఇంజనీరింగ్ లిమిటెడ్, రూ.15,455 కోట్ల పెట్టుబడులు, 8,400 మందికి ఉద్యోగాలు, నాయుడుపేటలో . చింతా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్, రూ.15,050 కోట్ల పెట్టుబడులు, 8,400 మందికి ఉద్యోగాలు, కడప.,కుప్పంలో సిర్మా ఎస్జీఎస్ టెక్నాలజీ రూ.1595 కోట్ల పెట్టుబడులు, 2,170 మందికి ఉద్యోగాలు,,. హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.586 కోట్ల పెట్టుబడులు, 613 మందికి ఉద్యోగాలు, బాలాజీ యాక్షన్ బిల్డ్ వెల్, రూ.485 కోట్ల పెట్టుబడులు, 500 ఉద్యోగాలు, అనకాపల్లి., అదాని విల్మర్ లిమిటెడ్, రూ. 578 కోట్లు, 285 మందికి ఉద్యోగాలు, నెల్లూరు జిల్లా.,. టైరోమెర్ టెక్నాలజీ లిమిటెడ్, రూ.85 కోట్లు పెట్టుబడులు, 120 మందికి ఉద్యోగాలు, చిత్తూరు.. ర్యామ్ శీ బయో ప్రైవేట్ లిమిటెడ్, రూ. 356 కోట్ల పెట్టుబడులు, 600 ఉద్యోగాలు, కడప జిల్లా., శ్రీ సర్వారాయా షుగర్స్ లిమిటెడ్, రూ.161 కోట్ల పెట్టుబడులు, 189 మందికి ఉద్యోగాలు, కోనసీమ.30. పట్టాభి ఆగ్రోఫుడ్స్, రూ.408 కోట్ల పెట్టుబడులు, 500 మందికి ఉద్యోగాలు, కాకినాడ. ప్రాజెక్టులు ఉన్నాయి.

# రూ.4.9 కోట్ల ప్రోత్సాహకాలు

>> చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డికి క్రీడాకారుల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కిదాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్, ధీరజ్ బొమ్మదేవర, షేక్ జాఫ్రిన్, షేక్ సాథియా ఆల్మస్, ఎ.అజయ్ కుమార్ రెడ్డి, డి.గ్రీష్మ, ఎం.సాహితి వర్షిని, ఏ శివనాగిరెడ్డి, రాయుడు అరుణ్ కుమార్, ఎ.సాయిసంహితి, కె.మోహన్ కిరణ్ కుమార్, కె.నారాయణ, కె.సంధ్య, ఎమ్.సత్యవతి, వి.రావణి, డి.వెంకటేశ్వర్, రియాజ్ సాబూ, గంపా ఆదిత్య వరుణ్, వి.మోనిక, నాగ జ్ఞానదివ్య, మొదలగు వారు ఉన్నారు.

**'ఆడుదాం ఆంధ్రా' పేరుతో 125 కోట్లు దోచేశారు**

గత ఐదేళ్ళ వైకాపా హయంలో క్రీడలను విస్మరించారని, ఆడుదాం ఆంధ్రా...పేరుతో రూ.125 కోట్లు దోచేశారని శాఫ్ చైర్మన్ రవినాయుడు ఆరోపించారు. ఆ నిధులు ఒక జిల్లాకు ఇస్తే చక్కటి మౌళిక సదుపాయాలు వచ్చేవన్నారు.విశాఖలో వీఎంఆర్‌డీఏతో కలిసి క్రీడా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.కరణం మల్లేశ్వరి సహకారంతో విశాఖలో వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. 2029 నేషనల్ గేమ్స్‌కు మన రాష్ట్రం ఆతిథ్యం ఇచ్చేలా బిడ్ వేస్తున్నామని,2027లో పారా అథ్లెట్ పోటీలకు విశాఖ ఆతిథ్యమిచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. క్రీడలకు 3 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రో కబడ్డీని ప్రోత్సహిస్తున్నామన్నారు.

# తెరిపిలేని జడివాన

>> వాగులు,వంకల నుంచి భారీ వర్ష నీరు ఉపనదులకు చేరుతుంది.దాంతో కీసర దగ్గర కంచెల గ్రామ శివారుల్లోనికి వరద నీరు చేరింది.భారీగా పంట నష్టం చేరింది,65వ జాతీయ రహదారికి దిగువ పంట చేలన్నీ నీట మునిగాయి.పునాస పంటలు పూర్తి నాశనమయ్యాయి,పెసర,కంది,మొక్కజొన్నకు భారీ నష్టం వాటిల్లింది.ఇక మున్నేరు,.వైరా కలిసే ప్రాంతంలో దాములూరు వద్ద క్యాజ్‌వే పూర్తిగా వరద నీటిలో మునిగింది.దాంతో ఎన్టీఆర్ జిల్లాకు తెలంగాణాకు చెందిన మధిర తదితర ప్రాంతాలకు రాకపోకలు బంద్ అయ్యాయి.నందిగామ శివారులో జాతీమరహదారి అనుసంధాన కాసరబాద రోడ్డులో చందాపురం వద్ద,అటు రామన్నపేట రోడ్డులో అడవి రావుల పాడు వద్ద క్యాజ్‌వేలు నీట మునిగాయి.దీంతో ఈ దారుల్లో రాకపోకలు నిలిచిపోయాయి.గురువారం ఉదయానికి కుడా వరద తగ్గుముఖం పట్టలేదు. విజయవాడలో ఉదయం నుంచి వర్షం కురుస్తోంది. భారీ వర్షం కాకపోయినా ఎడతెరిపి లేకుండా కురుస్తుండటం వల్ల జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. బెంజ్ సర్కిల్, నిర్మలా సెంటర్, ఆటోనగర్ 100 అడుగుల సెంటర్, విద్యాధరపురం ప్రాంతాల్లో రోడ్లు కాలువల్లా మారాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు లోతట్టు ప్రాంతాల్లో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తోడేస్తున్నారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రకాశం బ్యారేజీలో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వర్షం కారణంగా వినాయక ఉత్సవాల నిర్వాహణకు ఆటంకం ఏర్పడింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపి లేని వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వినాయక చవితి పండుగ నిర్వహణకు కూడా ఇబ్బందులు తప్పటం లేదు. అల్లూరి జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్నిచోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలు స్తంభించాయి. పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ ఇనుపతీగల వద్ద కొండచరియ విరిగిపడింది. అదృష్టవశాత్తు గ్రామానికి కొద్ది దూరంలో పడటంతో ప్రాణ నష్టం తప్పింది. కొండచరియలు విరిగి పడటం వల్ల గిన్నెలకొట్ట -ఇనుపతీగల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. హుకుంపేట మండల కేంద్రంలో ఓ భారీ వృక్షం పాఠశాలపై పడింది. సెలవు రోజు కావడంతో ప్రమాదం తప్పింది. మారేడుమిల్లి మండలం బొడ్లంక వద్ద పెళ్లిరేవు వాగు ఉదృతంగా ప్రవహిస్తోంది. దాదాపు 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెదబయలు మండలం కిమిడిపల్లి పంచాయతీ వద్ద గేదెగడ్డ పొంగి ప్రవహిస్తోంది. అనకాపల్లి జిల్లాలోని జీ కొత్తపల్లి తురువోలు మార్గంలో మిరాస గడ్డపై వంతెన కూలిపోయింది. కురుస్తన్న వర్షాలకు మిరాస గెడ్డలో వరద నీరు ఉదృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఒకవైపు వంతెన వరద ఉధృతికి కోతకు గురైంది. ఆ తర్వాత వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. వంతెన కూలిపోవడంతో ప్రజల రాకపోకలతో పాటు పొలాలకు, పశువుల పాకలకు వెళ్లడానికి రైతులకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. శ్రీశైలంలో స్థిరంగా వరద ప్రవాహం: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో మరో 2 గేట్లు ఎత్తారు. ప్రస్తుతం 8 గేట్ల ద్వారా నాగార్జున సాగర్ కు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో 2,84,436 క్యూసెక్కులు చేరుతోంది. శ్రీశైలం నుంచి 3,09,806 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ నుంచి 30,000 క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 26,867 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 8 స్పిల్ వే గేట్లను 10 అడుగులు ఎత్తి 2,17,624 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883.10 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 205.22 టీఎంసీలుగా కొనసాగుతోంది. అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఆలానే జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపిల్లిని వర్షాల కారణంగా జనజీవనానికి ఆటంకం ఏర్పడింది. చవితి ఉత్సవాలు వర్షాల్లో జరుపుకుంటున్నారు. వర్షాలు నేపథ్యంలో అమలాపురం కలెక్టరేట్‌తో సహా అమలాపురం, రామచంద్రపురం కొత్తపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.ఒడిశా తీరానికి ఆనుకుని వాయువ్య బంగాళాఖాతంలో తీవ్రఅల్పపీడనం కేంద్రీకృతమై ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. ఇది రాబోయే 24 గంటల్లో పశ్చిమవాయువ్య దిశగా ఒడిశా వైపు నెమ్మదిగా కదిలే అవకాశం ఉందని తెలిపారు.దీని ప్రభావంతో రేపు ..రాష్ట్రంలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం.. ఉందన్నారు. తీరం వెంబడి గంటకు 4060కిమీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, మత్స్యకారులు వేటకు వెళ్ళారాదని హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ ..మోస్తరు నుంచి భారీ వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు. సాయంత్రం 5 గంటల నాటికి మన్యం జిల్లా సీతంపేటలో 77మిమీ, కోనసీమ జిల్లా మలికిపురంలో 74.5మిమీ, భీమవరంలో 67.5మిమీ, విజయవాడ పశ్చిమలో 62.5మిమీ, విజయవాడ సెంట్రల్ లో 62మిమీ చొప్పున అధిక వర్షపాతం నమోదైందని ప్రఖర్ జైన్ వెల్లడించారు.ఎగువ,మనరాష్ట్రంలో కురుస్తున్న భారీవర్షాలతో వివిధ ప్రాజెక్టుల్లోని నీటిని దిగువకు విడుదల చేస్తున్నందున కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదీ పరివాహక లోతట్టు ప్రాంతప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు... పొంగిపొర్లే నదులు, కాలువలు,వాగులు దాటే ప్రయత్నం/స్నానాలు చేయడం లాంటివి చేయరాదన్నారు. ..వినాయక నిమజ్జనాల్లో నదులు/కాలువల వద్ద హెచ్చరిక బోర్డులను పాటిస్తూ అధికారులకు సహకరించాలని.. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ విజ్ఞప్తి చేశారు. వినాయక మండపాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు..బెజవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద వరద కొనసాగుతున్నది మధ్యాహ్నంలోపు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసారు,.ప్రస్తుత ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 3.62 లక్షల క్యూసెక్కులుగా ఉంది. దీంతో ప్రభావిత జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కృష్ణానది పరీవాహక ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు డాక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు.



విశాఖలో భారీ వర్షానికి రోడ్డుపై పడిపోయిన చెట్టు



విజయవాడలో డూండీ మహాగణపతి విగ్రహాన్ని దర్శించుకున్న అనంతరం ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

### గణనాథుని ఆశీస్సులతో రాష్ట్రం
# సుభిక్షంగా ఉండాలి
### అందరిలో ఐక్యాతా భావాన్ని పెంచే పండుగ వినాయక చవితి.
### రూ.30 కోట్లతో గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం: సిఎం చంద్రబాబు
### విజయవాడలో డూండీ మహాగణపతి విగ్రహాన్ని దర్శించుకున్న సిఎం

**విజయవాడ, ఆగస్టు 28, ప్రభాతవార్త ప్రతినిధి:** విఘ్నేశ్వరుని దివ్య ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో, రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఏపీ అభివృద్ధికి ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాలని గణపతిని ప్రార్థించానని చెప్పారు. విజయవాడ సితార సెంటర్‌లో డూండీ గణేశ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 72 అడుగుల డూండీ మహాగణపతిని ముఖ్యమంత్రి చంద్రబాబు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... దేశంలో ప్రజలంతా ఘనంగా జరుపుకునే అతిపెద్ద పండుగ వినాయకచవితి అని అన్నారు. గణేష్ చతుర్థి అంటే తనకు చాలా ఇష్టమని, చిన్నతనం నుంచి ఈ పండుగను బాగా చేసుకునే వాళ్లమని అన్నారు. డూండీ గణేశ్ సేవా సమితి నిర్వహించినట్టే తామూ ఉత్సవాలను ఘనంగా నిర్వహించే వారమని సీఎం అన్నారు.. రాష్ట్రంలో గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామన్నారు.గత ప్రభుత్వంలో గణేశ్ ఉత్సవాలు చేసుకోవాలంటే అన్నీ విఘ్నాలే. పండుగ చేసుకోవాలన్నా, మైక్ పెట్టాలన్నా సవాలక్ష ఆంక్షలు పెట్టారు. కానీ మన ప్రజా ప్రభుత్వంలో అలాంటి ఇబ్బందులు లేకుండా గణేశ్ మండపాలను ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీనివల్ల ప్రభుత్వంపై రూ.30 కోట్ల భారం పడుతుంది. అయినప్పటికీ భక్తుల సౌలభ్యం కోసం ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు.

# కరిగిపోతున్న ఉత్తరాది

>> కొడచరియలు విరిగిపడటంతో మృతులసంఖ్య వరదల కారణంగా 11 మంది చనిపోయారు.23 మంది గాయపడ్డారు జమ్ములో అయితే ఒక్కరోజులోనే 368 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయి 70 ఏళ్ల రికార్డులుబ్రేక్‌చేసింది. తావినది వంతెన కూలిపోవడంతో ఈ ప్రభావం జమ్మునగరంలో మరింతగా ఉంది. నదిలో ప్రవహిస్తున్న నీటి ఉధృతి కారణంగా వంతెన ఒక్కసారిగా కూలిపోయింది. చీనాబ్, తావి, జీలం, బసంతర్ వంటి నదులు పొంది ప్రవహిస్తున్నాయి. మాధోపూర్ వంతెనపైకి నీరుచేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పంజాబ్‌లో సాధారణం కంటే 1200శాతం వర్షపాతం ఎక్కువ నమోదయింది.

హరియాణాలో 700శాతం ఎక్కువ. హిమాచల్‌లో 550శాతం ఎక్కువ వర్షపాతం నమోదయింది. మరో రెండుమూడురోజులుఈ వర్షాలు తప్పవని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇక చండీగఢ్ కులు మనాలి జాతీయ రహదారిలో పలుచోట్ల రోడ్ల పైకి కొండచరియలు విరిగిపడ్డాయి. 50 కిలోమీటర్లమేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. రూ.50 కోట్ల విలువైన యాపిల్ పండ్ల వాహనాల్లో మురిగిపోటుండటంతో కుళ్లిపోతున్నాయని వ్యాపారులు, రైతులు వాపోతున్నారు.

29-08Pg3exHMNWJQEKCT ONG_29-08Pg3exHMNWJQEKCT.qxd 8/29/2025 12:14 AM Page 1





# వినాయకచవితి పూజల్లో జగన్

**విజయవాడ. ఆగస్టు28,ప్రభాత వార్తప్రతి నిధి:**వైసిపి అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి వినాయకచవితి పూజల్లో పాల్గొన్నారు.వైసిపి కేంద్ర కార్యాలయంలో నిన్న వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ అధినేత, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లంబోదరుడి తొలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. విఘ్నేషుడికి హారతి ఇచ్చి.. తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్ జగన్ షెడ్యూల్ ప్రకారం.. బుధవారం ఉదయం విజయవాడ రాణిగారితోట వద్ద జరిగే వినాయక పూజలో ఆయన పాల్గొనాల్సి ఉంది. అయితే భారీ వర్షాల కారణంగా ఆ పర్యటన రద్దు అయ్యింది. దీంతో తాడేపల్లి ఆఫీసులో జరిగే పూజలోనే ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకలకు ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, దేవినేని అవినాష్ సహా పార్టీ నేతలు హాజరయ్యారు.

# గోవిందుని వార్షిక బ్రహ్మోత్సవాలు



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగ వైకుంఠం తిరుమలగిరులు వడ్డీకాసుల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది జరగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల కార్యాచరణను తిరుమల తిరుపతి దేవస్థానం ఖరారుచేసింది. ఈ ఏడాది ఒక బ్రహ్మోత్సవం మాత్రమే నిర్వహిస్తారు. వాహనసేవలను ఆలయమాఢవీధుల్లో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడంపై, భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనసేవలవీక్షణకు సౌకర్యాల కల్పనపై అన్నమయ్యభవనంలో ఇప్పటికే టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి జిల్లా యంత్రాంగంతో కీలక సమావేశం నిర్వహించారు. ఆపదమొక్కులవాడు ..దేవ దేవుడు తిరుమలేశుని ఆలయంలో ఈ ఏడాది సెప్టెంబర్ 24వతేదీ నుంచి అక్టోబర్ 2వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ముహూర్తం ఖరారుచేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని బ్రహ్మోత్సవాలను వైభవంగా విజయవంతంగా నిర్వహించే ఏర్పాట్లు చేపడు తామన్నారు. ఈ ఏడాది కూడా పెద్దసంఖ్యలో

**- సెప్టెంబర్ 24న ధ్వజారోహణం**
**- తొలిరోజే ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు**

భక్తులు విచ్చేసే అవకాశముందని, ఇందుకు అనుగుణంగా పటిష్టంగా ఏర్పాట్లుచేయాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేయడం జరుగుతుంది. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు భక్తులు అశేష సంఖ్యలో విచ్చేసే అవకాశం ఉండటంతో విస్తృతంగా ఏర్పాట్లు చేపడతారు. సామాన్య భక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు రద్దుచశారు. ప్రోటోకాల్ విఐపిలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు మంజూరుచేస్తారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొదలయ్యే తిరుమలేశుని సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తొలిరోజు సెప్టెంబర్ 24వతేదీన ధ్వజా రోహణం రోజునే రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు రాష్ట్రప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. బ్రహ్మోత్సవాల్లో సెప్టెంబర్ 24వతేదీ రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహనం, సెప్టెంబర్ 28 గరుడసేవ, 31న స్వర్ణరథం, 1వతేదీ రథోత్సవం, 2న చక్రస్నానం జరుగుతాయి. పోలీసులతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రత కల్పించేలా చూడనున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో తిరుమలలో మాఢవీధుల్లో ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటుచేసి ,భక్తులకు అసౌకర్యం కలగకుండా చూస్తారు.

# తిరుమల సమాచారం

## ఆధ్యాత్మిక భావనతోనే స్వీయనియంత్రణ, క్రమశిక్షణ అలవడుతుంది :మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్



**తిరుమల,ఆగస్టు 28 ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికతతో ఉన్నతమైన విలువలు పెంపొందుతాయని, ఆధ్యాత్మిక భావనతోనే స్వీయనియంత్రణ, క్రమశిక్షణ అలవడుతుందని మహారాష్ట్రగవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ తెలిపారు. కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనంతో మనసు ఆధ్యాత్మికం వైపు మరింతగా దారిచూపుతుందన్నారు. స్వామివారి దర్శనం సకల శుభాలు కలుగజేస్తుందని ఆయన ప్రగాఢవిశ్వాసం వ్యక్తం చేశారు. రెండురోజుల తిరుమల పర్యటనలో భాగంగా గురువారం ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోపల తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనందనిలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అనంతరం టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట రాష్ట్రమంత్రి పి.నారాయణ, టిటిడి బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, పనబాకలక్ష్మి, పి.రామమూర్తి, రాజశేఖరగౌడ్, బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ తదితరులు ఉన్నారు. కాగా బుధవారం సాయంత్రం రాధాకృష్ణన్ శ్రీవారి ఉత్సవమూర్తులు మలయప్పస్వామి ఊరేగింపులో పాల్గొని స్వయంగా పల్లకీని మోశారు. పుష్కరిణి హారతిని వీక్షించారు.

## అందరికీ శుభాలు కలగాలి : ప్రముఖులు



**తిరుమల,ఆగస్ట్ 28ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని, సుఖ సంతోషాలతో ఉండాలని దేవుని ప్రార్ధించినట్లు మాజీకేంద్రమంత్రి, పిఎంకె పార్టీ అధినేత అన్బుమణి రాంధాస్ తెలిపారు. గురువారం ఉదయం ఆయన తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. రాందాస్ వెంట ఏపిరాష్ట్ర మంత్రి కొల్లురవీంద్ర, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, చిత్తూరుజిల్లా టిడిపి పార్లమెంట్ అధ్యక్షుడు సిఆర్‌రాజన్ తదితరులు ఉన్నారు.

## ఏడుకొండలస్వామికి యరవాడ పట్టుపంచలు



**తిరుమల,ఆగస్టు 28 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసుడు తిరుమల ఏడుకొండల వేంకటేశ్వర స్వామికి అనాదిగా గద్వాల్ యరవాడ పట్టుపంచలు సమర్పించే భాగ్యం కలగడం దేవుని పట్ల ఉన్న విశ్వాసం మరింత రెట్టింపవుతుందని గద్వాల్ సంస్థానం యువరాజు కృష్ణ ఆర్ భూపాల్ తెలిపారు. దేవదేవుని సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల ముందు ఆనవాయితీగా ఏటా గద్వాల్ యరవాట పట్టుపంచలు తీసుకువచ్చి సమర్పించడం సాంప్రదాయంగా వస్తోందన్నారు. గద్వాల్ సంస్థానం ,తిరుమల ఆలయం మధ్య అనుబంధం చాలాకాలం నుండి వారసత్వంగా వస్తోందన్నారు. శతాబ్దాల కాలంనుండి గద్వాల్ సంస్థానం స్థాపకుల పాలనలో యరవాడ జోడు పంచల జతను శ్రీవారికి బహుమానంగా పంపతున్నట్లు తెలిపారు. ఈవిశిష్ట వారసత్వాన్ని కొనసాగించడంలో మా సంస్థానం కార్మికుల బృందం సహకారం మరవలేనిదన్నారు. తిరుమలలో మన సాంస్కృతిక, ఆధ్యాత్మిక బంధాన్ని గౌరవించడమేగాక గద్వాల్ నేతకార్మికుల కళాత్మకత ,అంకితభావాన్ని మరింత తెలియజేసే అవకాశం కలుగుతుందన్నారు. మా నేత కార్మికులను ప్రోత్సహించడం, వారిని శక్తివంతంచేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వారిలో ఆనందం చూడటమే ప్రత్యేకమైన వారసత్వాన్ని కాపాడటానికి సహాయం చేస్తామన్నారు. శ్రీవారికి యరవాడ పట్టుపంచలు తీసుకుని గురువారం ఉదయం తిరుమలకు వచ్చిన ‍ద్వాల్ సంస్థానం యువరాజు కృష్ణ ఆర్ భూపాల్,కార్మిక నేతలతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. యరవాడ పంచలను ఆలయ అధికారులకు అందజేశారు. వీటిని శ్రీవేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుకు అలంకరిస్తారు. ఉదయం వీళ్ళు శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# హోదాను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్న బిఆర్‌నాయుడు

### - వైసిపి నేత భూమన విమర్శలు

**తిరుపతి,ఆగస్టు 28 ప్రభాతవార్తప్రతినిధి:** క్విడ్‌ప్రో క్రింద బిఆర్‌నాయుడుకి టిటిడి ఛైర్మన్ పదవి వచ్చిందని, ఆ హోదాను అడ్డుపెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారని వైసిపి ఉమ్మడిచిత్తూరుజిల్లా అధ్యక్షుడు ,టిటిడి మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ఆరోపించారు. వైసిపి నేతలపై నిరంతరం దూషణలకు దిగుతున్నారని అన్నారు. ఈ పదవి శాశ్వతం కాదనే విషయం బిఆర్‌నాయుడు గుర్తుంచుకోవాలని తెలిపారు. గురువారం ఉదయం పద్మావతిపురంలో భూమన మీడియాతో మాట్లాడారు.తప్పుడు ప్రచారాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఆయన మారాడన్నారు. నాపైచేసే ఆరోపణలకు సిబిఐ విచారణకైనా సిద్ధమని కరుణాకర్‌రెడ్డి సవాల్ మరోసారి సవాల్ విసిరారు. టిటిడి భూములను పర్యాటకశాఖకు ఎందుకు బదలాయిస్తున్నారని ప్రశ్నించారు. అత్యంత విలువైన భూములను ఎందుకు ఇస్తున్నారన్నారు. నా ప్రశ్నలకు బిఆర్‌నాయుడు నుండి సమాధానాలు రాలేదన్నారు.

# సీనియర్ మహిళా ఐఎఎస్‌పై భూమన విమర్శలు మంచిదికాదు

### - రాజశేఖర్‌రెడ్డి, వైసిపి వల్ల ఆమె నష్టపోయింది - తిరుపతిలో డాక్టర్ చింతామోహన్



**తిరుపతి,ఆగస్టు 28 ప్రభాతవార్తప్రతినిధి:** ఎంతో అనుభవం, పరిజ్ఞానం ఉన్న సీనియర్ మహిళ ఐఎఎస్ అధికారిణిపై వ్యక్తిగత ఆరోపణలు, విమర్శలు చేయడం భూమనకు మంచిదికాదని కాంగ్రెస్ పార్టీ మాజీ కేంద్రమంత్రి డాక్టర్ చింతామోహన్ అన్నారు. ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఆమె గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వంలో ఓ శాఖకు కార్యదర్శిగా పనిచేసిన సమయంలో వైఎస్ ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టడంతో జైలుకెళ్ళి మీ వల్ల నష్టపోయిందని చింతా తీవ్రంగా దుయ్యబట్టారు. ఆమె కులాంతర వివాహం చేసుకున్న గొప్ప ఐఎఎస్ అధికారిణి అన్నారు. గురువారం ఉదయం టిటిడి పరిపాలన భవనం వద్ద ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చింతా మాట్లాడుతూ ఐదేళ్ళు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేయాల్సిన ఆమె ఎంతో విలువైన అవకాశం కోల్పోయిందన్నారు. ఆమెపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తు న్నానన్నారు. టిటిడిలో పనిచేస్తున్న అర్చకులు, ఉద్యోగులకు అలిపిరి వద్ద ఒక్కొక్కరికి ఐదు సెంట్లు స్థలం ఇవ్వాలని 39రోజులు నిరసన తెలిపితే టిటిడి అధికారులు,కూటమి ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆకాశంలో తిరుగుతున్నాడని, భూమిపై ఉన్న మేము ఆయనకు కనిపించడంలేదన్నారు. చంద్రబాబునాయుడు మమ్మల్ని కాస్త చూడవయ్యా అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఊరిలో విమానాశ్రయాలు, సీపోర్టులు కడుతానని అంటున్నావని, తిరుపతిలో ఏం కడతావని చింతా ప్రశ్నించారు. అలిపిరి జూపార్కు రోడ్డులో ముంతాజ్‌కుగానీ, పర్యాటకశాఖకు గానీ భూమి ఇవ్వొద్దని, టిటిడి ఉద్యోగులకు ఇంటి స్థలం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మున్సిపాల్టీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు 20వేలు ఇస్తున్నారని, రుయా ఆస్పత్రిలో పనిచేసే పారిశుధ్యకార్మికులకు ఈనెల నుండి 18,600 రూపాయలు ఇచ్చేందుకు అగ్రిమెంట్ జరిగిందన్నారు. టిటిడిలో పనిచేస్తున్న పారిశుధ్యకార్మికులకు 11,600 రూపాయలు ఇస్తున్నారని, ప్రతినెలా 18,600 రూపాయలువేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి ఈ సమస్యలను పరిష్కరించాలని చింతామోహన్ కోరారు.

# రాష్ట్రంలో వర్షాలు.. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి : హోం మంత్రి అనిత

**విజయవాడ,ఆగస్టు 28,ప్రభాతవార్త ప్రతినిధి:** బంగాళాఖాతంలో అల్పపీడనంతో ఏపీ వ్యాప్తంగా పలు చోట్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో ఆమె ఫోన్లలో మాట్లాడారు. జిల్లాల్లో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. కృష్ణా పరివాహకంతో పాటు లోతట్టు ప్రాంత ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. సహాయక చర్యలకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదకర హోర్డింగులు,కూలిన చెట్లను వెంటనే తొలగించాలన్నారు.

# త్వరితగతిన భూసేకరణను చేపట్టాలి



### కలెక్టర్ ఆనంద్ ఆదేశం

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 28, ప్రభాతవార్త :**జిల్లాలో అవసరమైన భూసేకరణను త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ల్యాండ్ ఎక్విజేషన్పై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడికుడి శ్రీకాళహస్తి బ్రాడ్ గేజ్ నిర్మాణానికి సంబంధించి భూసేకరణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే భూమిని ఇచ్చిన వారికి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని ఆయన సూచించారు. రైలు ఓవర్ బ్రిడ్జిలు రైలు అండర్ బ్రిడ్జిలు ఏర్పాటుకు సంబంధించి పనులు వేగవంతం చేయాలన్నారు. బుచ్చి దగదర్తి రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్డు ఏర్పాటు, గిలకపాడు, వీరయ్యపాలెంలో మంచినీటి పైపులైను అదే విధంగా వినుమురులో మంచినీటి పైపులేని ఏర్పాటుపై సమీక్షించారు. ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.


బద్వేలు నుంచి నెల్లూరు వర కు ఫేస్ వన్, ఫేస్ టు కింద నేషనల్ హైవే ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణ తదితర అంశాలను చర్చించారు. అవసరమైన చోట అటవీ శాఖ అనుమతులు తీసుకోవాలని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే. కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ, రెవిన్యూ డివిజన్ అధికారులు పావని, అనూష వంశీకృష్ణ డిఐఈపిసి మెంబర్ భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

# సోమశిల, కండలేరు జలాశయాల్లో 100 టిఎంసిల నీటి నిల్వలు

### - మొదటి, రెండు పంటలకు పుష్కలంగా నీరు ఇచ్చాం - నదుల అనుసంధానానికి సిఎం బృహత్తర ప్రణాళిక: మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు, ఆగస్టు28, ప్రభాతవార్త:** జిల్లాలో ఎన్నడూ లేని విధంగా రెండో పంటకు నీళ్ల ఇచ్చిన తర్వాత కూడా సుమారు 100 టీఎంసీల నీరు నిల్వ ఉండడం నెల్లూరు జిల్లా సాగునీటి రంగంలో ఒక నూతన అధ్యాయమని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. గురువారం ఉదయం నెల్లూరు సంతపేటలోని క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని జలాశయాల్లో నీటి నిల్వల పరిస్థితిపై మంత్రి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలోని ప్రధాన జలాశయాలైన సోమశిల, కండలేరు జలాశయాల్లో సుమారు 90నుంచి 100 టీఎంసీల సమృద్ధి నీటి నిల్వలతో కళకళలాడుతున్నాయని చెప్పారు. ఇది రైతాంగానికి జిల్లా ప్రజలకు శుభపరిణామమన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలో చేపట్టిన సమర్ధవంతమైన సాగునీటి నిర్వహణ వలన నేడు జిల్లాలో సమృద్ధిగా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నట్లు మంత్రి వివరించారు. దాదాపు ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు సత్యవేడు, శ్రీకాళహస్తిని కలుపుకొని మొదటి పంటకు దాదాపు ఆరు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్లు చెప్పారు. సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టుల్లో మొదటి పంట తరువాత కూడా రెండవ పంటకు నీళ్ల అందించినా ఇంకా మిగులు నీళ్ల ఉన్నాయన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా సత్యవేడు శ్రీకాళహస్తి కలిపి రెండో పంటకు ఐదు లక్షల 24 వేల ఎకరాలకు , ఒక్క నెల్లూరు జిల్లాలో దాదాపు నాలుగు లక్షల ఎకరాలకు రెండో పంటకు నీళ్ల ఇచ్చినట్లు చెప్పారు. రెండో పంట చివరి దశకు వచ్చిందన్న మంత్రి, మరో 20 రోజుల్లో వరి కోతలు మొదలవుతున్నాయని చెప్పారు. సోమశిల జలాశయంలో 59 టీఎంసీలు, కండలేరు, తెలుగు గంగలో 35 టీఎంసీల నీళ్ల నిల్వ ఉన్నట్లు చెప్పారు. ఒక్క చుక్క నీరు కూడా వృధా కాకుండా, ప్రతి పంటకు నీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. రైతన్నలు కూడా ప్రతి నీటి చుక్కను ఉపయోగించుకోవాలి గాని అనవసరంగా వృధా చేయకూడదని మంత్రి విజ్ఞప్తి చేశారు.




# భక్తుడి సూచనలతోనే అరవింద్ కంటి ఆస్పత్రిలో నేత్రదానం కేంద్రం

### - టిటిడి ఇఒ శ్యామలరావు

**తిరుపతి,ఆగస్టు 28 ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడికి ఓ భక్తుడు "డయల్ యువర్ ఇఒ"కార్యక్రమంలో చేసిన అమూల్యమైన సూచనలతోనే తిరుపతిలోని ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రిలో నేత్రదానం కేంద్రం ప్రారంభించడం జరిగిందని టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. ఈ ఆస్పత్రిలో 80శాతం కంటి సమస్యలకు అత్యల్ప ఖర్చుతో ఆధునిక వైద్యసేవలు అందిస్తున్నారని, హార్వర్డ్ బిజినెస్ స్కూల్ (హెచ్‌బిఎస్)అధ్యయనాలు కూడా అరవింద్ నేత్రాస్పత్రిని సామాజిక ఆరోగ్యసేవల్లో ఆదర్శంగా గుర్తించిందన్నారు. గురువారం ఉదయం అరవింద్‌కంటి ఆస్పత్రిలో నేత్రదాన కేంద్రాన్ని టిటిడి ఇఒ శ్యామలరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ శ్రీవారి భక్తులు,ప్రజలు స్వచ్ఛందంగా నేత్రదానం చేసి ఎంతోమందికి కొత్తజీవితాన్ని అందించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అరవింద్ ఆస్పత్రి ప్రత్యేక హెల్ప్ లైన్ నంబర్ 9398358828ను విడుదల చేశారు. జాతీయ అంధత్వనివారణ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 25నుండి సెప్టెంబర్ 8వరకు 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రిలో జరుగుతున్నాయన్నారు. శరీరంలోని అన్ని ఇంద్రియాలలో కంటికి ఉన్న ప్రాధాన్యత అత్యంత ఉత్కృష్టమైనదనిఅన్నారు. 2019లో సిఎం చంద్రబాబునాయుడు దూరదృష్టితో శ్రీవేంకటేశ్వరస్వామి పాదాల చెంత ఆరు ఎకరాల విస్తీర్ణంలో తిరుపతి నగరంలో ఈ సుప్రసిద్ధ కంటి ఆస్పత్రి ప్రారంభించబడినదని గుర్తుచేశారు. మనదేశంలో కంటి మార్పిడి(కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్)కోసం కనీసం ఒక లక్షకళ్ళు అవసరం ఉంటే కేవలం 25వేల కళ్ళే అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి : మంత్రి గొట్టిపాటి

**విజయవాడ,ఆగస్టు28,ప్రభాతవార్తప్రతినిధి:** వర్షాల్లో ప్రజలకు విద్యుత్తు సరఫరా ఇబ్బంది లేకుండా అన్ని ముందస్థు చర్యలు చేపట్టాలని గొట్టిపాటి రవికుమార్ మంత్రి ఆదేశించారు.విద్యుత్ అధికారులతో ఆ శాఖ మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలతో విద్యుత్ సమస్యలు ఎక్కడెక్కడ తలెత్తాయని ఆయన ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని ముందస్థు చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఒకటి రెండు చోట్ల మినహా పెద్ద ఇబ్బందులు తలెత్తలేదని అధికారులు ఆయనకు తెలిపారు. ఉత్తరాంధ్రలో నీటి ప్రవాహం అధికంగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేసి తగిన జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా ప్రజల్ని అప్రమత్తం చేయాలని అధికారులకు గొట్టిపాటి సూచించారు.

వినాయక విగ్రహాల తరలింపు సమయం లోనూ సిబ్బంది అప్రత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM

Engineering Section /SE (Works-II) / EE (Works-IV)
EXPRESSION OF INTEREST

Provide services to GVMC for a proposed "Provide Services to GVMC for the proposed "Study Tour for Hon'ble Ward Members on Developmental Activities taken up under Swachh Bharath Mission / Smart City at Urban Local bodies Jaipur, Jodhpur, Jaisalmeer and Udaipur for a period of 8 days and 7 nights.

The documents containing terms & conditions may be downloaded from website of Further details at http://www.apeprocurement.gov.in (Tender ID : 839798)

Further details at Superintending Engineer, GVMC Main Office, Visakhapatnam, e-mail : eegvmcpw3@gmail.com,
Cell No : 7729995941.
For COMMISSIONER (GVMC)

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada - 520002 (A.P.)

E Procurement Short Tender Notice

NIT No. 75/MAU61/736/2025-LEG-MAU61, Dated: 26.08.2025
Name of Work : Tenders are Invited for Empanelment of Legal Firms for a Period of Two Years

NIT No. 80/Proc/MAU61-USI0HB(BG)/10/2025-HB-Part (1), Dated: 26.08.2025
Name of Work : RFP for Selection of an Agency for Conceptualization, Installation and Operation of Experience Centre @ APCRDA Project Office, Amaravati
The bid can be downloaded on AP e-procurement portal from 28.08.2025 to 06.09.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid is 06.09.2025 up to 15.00 Hrs, Technical bid opening 06.09.2025 @16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

E Procurement Tender Notice

NIT No. 19/MAU61-USI0HB(OTH)/367/2025-HB Dt.28.08.2025.
Name of Work: "Providing Un-Skilled workers for attending the services of cleaning and dusting the case records, placing in serial, making them available to the posting section and also other works in the High Court of Andhra Pradesh, Nelapadu, Amaravati for a period of 1 Year"– Estimate Cost Rs.3,41,26,000/-
The bid can be downloaded on AP e-procurement portal from 29.08.2025 to 12.09.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 12.09.2025 up to 15.00 Hrs, Technical bid opening 12.09.2025 @16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

E Procurement short Tender Notice (Third Call)

NIT No. 12/MAU61-USI0HB(BG)/7/2025-IFR2/3rd call Dt.26.08.2025.
Name of Work: "Providing Comprehensive Annual Maintenance Contract to Daikin make Air Conditioning Units Installed in the buildings of the High Court (Main building and Annexe building) of Andhra Pradesh, Nelapadu, Amaravati,for the period of 1 Year"– Estimate Cost Rs.79,50,000/-
The bid can be downloaded on AP e-procurement portal from 29.08.2025 to 02.09.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 02.09.2025 up to 15.00 Hrs, Technical bid opening 02.09.2025 @16.00Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in

Sd/- Commissioner, APCRDA, Vijayawada.

వార్త


నీ తోటి మనుషులతో నీవే ఎక్కువ తెలివైనవాడిగా, ఎక్కువ చదువుకున్నవాడిగా ఎప్పుడూ ప్రవర్తించకు.

-రోజర్

# విస్తరిస్తున్న వికృత క్రీడ!

ర్యాగింగ్‌ను నిరోధించేందుకు చట్టాలు చేసి,కఠిన చర్యలు తీసుకుంటున్నామని పాలక పెద్దలు ఎంతగా చెప్తున్నా వాటిని పూర్తిగా నిరోధించలేక పోతున్నాయి. తాత్కాలికంగా తగ్గినట్లు కన్పించినా ఈ రాక్షస క్రీడకు శాశ్వతంగా మంగళం పాడలేకపోతున్నారు. ఈ ర్యాగింగ్‌లతో బాధిత విద్యార్థులు కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు కూడా ఉన్నాయి. అలాంటి సమయంలో అధికారులు చేసే హడావుడి అంతా ఇంతా కాదు. ఆ తర్వాత యథా విధిగానే మరిచిపోతున్నారు. ఫలితంగా ఈ ర్యాగింగ్ పైకి తగ్గినట్లు కన్పించినా చాపకింద నీరులా విస్తరిస్తూనేఉంది. చాలా మంది విద్యార్థులు ఈ ర్యాగింగ్‌లతో తీవ్ర ఇబ్బందులు, అవమానాలు ఎదుర్కొన్నా భయపడి బయటకు చెప్పలేకపోతున్నారు. కొన్ని కాలేజీల్లో యాజమాన్యాలకు తెలిసినా చర్యలు తీసుకోలేని నిస్సహాయక పరిస్థితుల్లో ఉన్నారు. బాధిత విద్యార్థులు ధైర్యం చేసి తల్లిదండ్రులకు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే ఇవి వెలుగు చూస్తున్నాయి. తాజాగా నిజామాబాద్ జిల్లాలో జూనియర్‌పై ఐదుగురు సీనియర్లు,ర్యాగింగ్ చేసిన ఉదంతం వెలుగు చూసింది. అర్ధరాత్రి వైద్యకళాశాల హాస్టల్‌కు పిలిపించి ఆ విద్యార్థిని బెదరించి ర్యాగింగ్ చేశారు. భయ భ్రాంతులకు గురైన ఆ విద్యార్థి నిజామాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సంఘటన వెలుగు చూడడంతో కళాశాల ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సోమవారం విచారణ జరిపి పోలీసు నివేదిక ఆధారంగా ఐదుగురు సీనియర్ విద్యార్థులపై ఆరు నెలల పాటు సస్పెన్షన్ విధించింది. వారికి కళాశాల హాస్టల్ సదుపాయాన్ని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. వాస్తవంగా ప్రతి కాలేజీలోనూ ఈ ర్యాగింగ్ నిరోధించేందుకు కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పటిష్టమైన నిఘా వేసి ర్యాగింగ్ జరగకముందే పసిగట్టి చర్యలు తీసుకోవాల్సిన కమిటీలు బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లిన తర్వాత కానీ చర్యలకు ఉపక్రమించలేకపోతున్నారు. అంతకుముందు గతంలో నల్గొండ జిల్లాలో జరిగిన సంఘటన కూడా ఇందుకు అద్దం పడుతున్నది. పోలీసులకు ఫిర్యాదు చేసిన తర్వాతనే ఆ సంఘటన కూడా వెలుగు చూసింది. తనను గదిలోకి పిలిపించి దాదాపు రెండుగంటలకుపైగా మోకాళ్లపై కూర్చోబెట్టి బట్టలు విప్పించి సెల్‌ఫోన్‌లో వీడియో తీశారని, గుండు గీసేందుకు కూడా ప్రయత్నించారని బాధిత విద్యార్థి ఆరోపించాడు. వాష్‌రూమ్ పేరుతో సీనియర్ల నుండి తప్పించుకొని జరిగిన అవమానాన్ని తన తండ్రికి ఫోన్ ద్వారా చెప్పడంతో ఆయన పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి కాపాడినట్లు ఆ విద్యార్థి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆలస్యంగా స్పందించిన పాలకపెద్దలు విచారణకు ఆదేశించి కారకులైన ఆరుగురు విద్యార్థులను యేడాదిపాటు కాలేజీ నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు.వారికి శాశ్వతంగా హాస్టల్‌లో వసతి ఇవ్వకూడదని కూడా నిర్ణయించారు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పుడు కేసులు నమోదు చేయడం కొంతమేరకు చర్యలు తీసుకుంటున్నందువల్లనే ర్యాగింగ్ తగ్గుముఖం పట్టిన మాట వాస్తవమే కావొచ్చు. కానీ ఇది పూర్తిగా సమిసిపోలేదు. కొత్తగా అడుగుపెట్టిన వారికి బెరుకు, భయం పోగొట్టి పరిచయం చేసుకునే వినోద కార్యక్రమం కొందరి విద్యార్థుల కారణంగాప్రాణాంతక వికృతకేళిగా మారిపోయింది. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి ఇంటర్మీడియేట్ విద్యను పూర్తి చేసుకొనిఎంతో భవిష్యత్‌ను ఊహించుకుంటూ ప్రొఫెషనల్ కాలేజీల్లో అడుగుపెట్టే విద్యార్థులు ఎదురయ్యే అవమానాలు భరించలేక కొందరు తమలోతాము కుమిలిపోతుండగా మరికొందరు అర్ధాంతరంగా ఏకంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. అశ్లీలసాహిత్యం,నీలిచిత్రాలు,మత్తుపదార్థాలు,మద్యం, ఇతర బలహీనతలు కూడా ఈ సంస్కృతిని మరింతగా రెచ్చగొడుతున్నాయి. పాశ్చాత్య సంస్కృతి విషవలయంలో చిక్కుకొని ఆలోచనారహితంగా వీరుచేస్తున్న ఈ ర్యాగింగ్‌ను సున్నిత మనస్కులు తట్టుకోలేకపోతున్నారు. ఈ ర్యాగింగ్ క్రీడకు వెరసి కొందరు ఏకంగా విద్యాభ్యాసానికే స్వస్తి చెప్పిన సంఘటనలు కూడా ఉన్నాయి. మొత్తం మీద రాష్ట్రంలోనేకాక దేశవ్యాప్తంగా ఈ ర్యాగింగ్ శృతి మించడంతో ఉన్నతస్థాయిలో ఆనాడే చర్చలు జరిగాయి. దీన్ని ఆపకపోతే మరిన్ని పసిప్రాణాలు బలయ్యే ప్రమాదం ఉందని సర్వత్రా ఆందోళన వ్యక్తమైంది. ఈ దశలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ కలిగించుకొని ర్యాగింగ్ నిరోధక చర్యలు చేపట్టాల్సిందిగా ప్రొఫెషనల్ విద్యాసంస్థలకు, విద్యాలయాలకు లేఖలురాసింది. ఆ మేరకు 1997లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్రమైన చట్టానికి రూపకల్పన చేసింది. 1997 మార్చి 18న రాష్ట్ర శాసనసభ ఆమోదించిన ర్యాగింగ్ చట్టం ప్రకారం వేధింపులకు గురిచేస్తే తీవ్రమైన శిక్షలు ఖరారు చేశారు.అయినా ఈ రాక్షసక్రీడ చాపకింద నీరులా కొనసాగుతూనే ఉన్నది. ప్రాణసమానంగా పెంచుకున్న తమ బిడ్డ కళ్లముందే చదువు సంస్కారం ఉందనుకున్న కొందరు వింతపశువుల వికృత చేష్టలకు బలైపోతే ఆ గర్భశోకం వర్ణనాతీతం. ముఖ్యంగా ర్యాగింగ్ చేసేటప్పుడు ప్రత్యక్ష సాక్షులు ఉండే అవకాశం లేదు. ఉన్నా వారు న్యాయస్థానాల ముందుకు వచ్చి సాక్ష్యాలు చెప్పడానికి ఇష్టపడరు. అందువల్ల కోర్టుల్లో రుజువు కాదనే ధైర్యంతో ఇలాంటి చర్యలకు ఒడిగడుతున్నారు. ఈ విషయంలో పాలకపెద్దలు న్యాయనిపుణులతో మరింత లోతుగా చర్చించి చట్టానికి మరింత పదును పెట్టాలి. ఈ జాడ్యం విద్యార్థుల జీవితాలను కబళించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

అతి సామాన్యమైన జీవితం గడపడానికి ఆసక్తి, అధికమైన ఆలోచనాశక్తి గొప్పవారి జీవిత సూత్రాలు.



వి.జాన్సన్

అధర్మంగా ఆర్జించిన సంపాదనతో ఆచరించిన సత్కర్మలు సత్ఫలితాలనివ్వవు.



ఆస్కార్‌వైల్డ్

# ప్రజావాక్కు



### అన్యమతస్థుల ప్రవేశం

ఇటీవల కేరళలోని ప్రసిద్ధ గురువాయూర్ శ్రీకృష్ణ దేవాలయ కోనేరులో జాస్మిన్ జప్పర్ అనే అన్యమతస్థురాలు కాళ్లు కడుగుతూ వీడియో రీల్స్ చిత్రీకరించటం ఘోరమైన తప్పిదం. గురువాయూర్ శ్రీకృష్ణ ఆలయంలోకి హిందువులకు తప్ప ఇతర మతస్థులకు ప్రవేశం లేదు. గురువాయూర్ దేవస్థానం కట్టుబాట్లను అతిక్రమించిన సదరుయువతిపై కోనేరును అపవిత్రం చేసిందని పోలీసులకు ఆలయ అధికారులు ఫిర్యాదు చేశారు.కేరళ హైకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా ఆలయప్రాంగణంలోకి ఇతర మతాన్నిఆచరించే ఆ యువతి ఫొటోలు,వీడియోలు చిత్రీ కరించటం ఆలయ మర్యాదలను దెబ్బతీసే దురుద్దేశ ప్రయత్నంగా చెప్పవచ్చు. దేవాలయంలోకి అన్యమత స్థులకు ప్రవేశంలేనప్పుడు హిందువులు కాని వారువచ్చి వీడియోలు తీసుకోవటం ప్రతి హిందువు ఖండించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### విద్యార్థుల కిరాతకం

ఇటీవల ఏపిలో ఒక ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిపై సహచర విద్యార్థులు తోటి దళిత విద్యార్థిపైవ్యవహరించిన తీరువారి రాక్షసతత్వాన్ని, నిర్భయత్వాన్ని తెలుపుచున్నది.వారు పిల్లలా లేక రౌడీల అనిపిస్తోంది.ఆ విధమైన పనులు వారు ఎక్కడ చూస్తున్నారో ఆశ్చర్యం వాటిని ఆ చిన్న వయస్సులో ఎలా చేస్తున్నారో భయం కలుగుతోంది. ఉత్తమ బోధన, సదుపాయాలతో పాటువారి క్రమశిక్షణ,తీరుతెన్నులు వారుభవిష్యత్ రాణింపునకు మూలమవుతుంది. ఈ విషయం అధ్యాపకులు వారిపై నిఘాఉంచాలి.చిన్న విషయమైన యాజమాన్యానికి తెలియచేయాలి. లేనిచోట కొందరు ఉపాధ్యాయులపై కూడా తిరగబడే సంఘటనలు జరిగాయి.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

### గ్రామీణ రహదారులకి మోక్షం ఎప్పుడు?

గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాహదారులను పట్టించుకోకపోవడంతో పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండల పరిధిలోనిఊరదాళ్ళపాలెం గ్రామ ప్రధానరహదారి మీదుగా రహదారులు అధ్వాన్నంగా మారడంతోఏళ్ల తరబడి గుంతలు, తేలాడిన కంకరపై వాహనదారులు ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు.

- డి.వెంకటరెడ్డి, ప.గో జిల్లా

### సాంకేతికతతో పెరుగుతున్న నేర ప్రవృత్తి

ప్రపంచ వివాహ దినోత్సవం రోజునే ఓ దుర్మార్గపు భర్త అయిదు నెలలగర్భిణిని క్రూరాతి కూరంగా చంపి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికి తీసుకెళ్ళి మూసీ నది ప్రవాహంలో పడవేసి తన భార్య కనిపించడం లేదని అమాయకంగా పోలీసు రిపోర్టు యిచ్చాడు. పోలీసులు తమదైన రీతిలో ఆరా తీయగా నిజాన్ని వెళ్ళగక్కాడు. పురాణాల్లో రాక్షసులు కూడా యింత రాక్షసంగా ప్రవర్తించ లేదేమో. మరొక సంఘటనలలో భార్యలు భర్తలను అనేక నూతన పద్ధతులలో అంతమొందిస్తున్నారు. మొన్న ఒక 14 ఏళ్ళ బాలుడు పక్కింటి 12 ఏళ్ల అమ్మాయిని పదునైన కత్తితో అనేకసార్లు పొడిచి చంపేసాడు. సామాజిక వ్యవస్థలు రానురాను అస్తవ్యస్తం అవుతున్నాయి. పవిత్రమైన బంధాలు కలుషితం అవుతున్నాయి. పెరుగుతున్న సాంకేతికత, పిల్లలకు సెల్‌ఫోన్లకు అలవాటు చేయడం,అందులో వాళ్లేం చూస్తున్నారో తల్లిదండ్రులు గమనించకపోవడంవల్ల నేరప్రవృత్తి పెద్దలలోనూ పిల్లలలోనూ అలవడుతోంది.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చెయ్యాలి

కరీంనగర్ పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని, కొద్దిమందికి మాత్రమే ఇస్తామని ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పంపించేసి లబ్ధిదారులకు ఇవ్వాలి.డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వకపోవడం తోలబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు.గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం మూలంగా డబుల్ బెడ్ రూమ్ఇండ్లు శిథిలావస్థలోకి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు చింతకుంట, ఆరెపల్లి, ఎలగందుల ఖాజీపూర్ ఇవ్వాలని కోరారు.

- సింగు లక్ష్మీనారాయణ చింతకుంట, కరీంనగర్

### కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షే

రాష్ట్రాలలో పరిశ్రమలు ఎన్ని ఉన్నాయో అంతకంటే ఎక్కువ చిన్న పెద్దా ఆసుపత్రుల సంఖ్య ఉంది. కార్పొరేట్ హాస్పిటల్స్ అన్నీ ప్రతీరోజు రోగులతో కిటకిటలాడిపోతున్నాయి.ప్రతీ చిన్న నలతకు సవాలక్ష పరీక్షలు చేయించకు రమ్మని డాక్టర్లు రాస్తున్నారు. ఈపరీక్షలు, డాక్టర్ల, ఫీజులు అన్నీకలపి వేలు లక్ష ల్లో బిల్లులు చెల్లించవలసి వస్తోంది. డాక్టర్లు ఎంత బిజీగా ఉన్నారంటే పేషెంట్లతో ఒపిగ్గా మాట్లాడరు. అర నిముషం లోపలే మందుల చీటీ రాసిచ్చి పంపేసారు.

-ఎన్.రామారావు, నల్గొండ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# బీటలు వారుతున్న తెలుగు భాషా వైభవం

తెలుగు భాష కేవలం మాట్లాడుకోవడానికే తప్పమరే ఇతర అవసరాలకు పనికి రాకుండాపోవడానికి మనం మన భాషపట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యమే కారణమవుతున్న సంగతిని విస్మ రించరాదు. మన దేశంలోనే కాకుండా ప్రపంచంలోని పలు దేశాల్లో మాతృభాషలు అంతరించిపోతున్నాయి. భారత దేశంలో జాతీయ భాష హిందీతో పాటు పలు ప్రాంతీయ భాషలు మనుగడలో ఉన్నాయి. అయితే ఆంగ్ల భాషపట్ల మక్కువతో పలు ప్రాంతీయ భాషలు తిరస్కరణకు గురౌతున్నాయి.శతాబ్దాల చరిత్రగల చక్కనైన తెలుగు భాష ఆంగ్ల భాషా వికాసంతో వెలవెలబోతున్నది. తెలుగు భాష మాట్లాడడం తెలుగు వారికి నామోషీగా మారడం దురదృష్టకరం. అందమైన అక్షరాలతో, మల్లెతీగలా మనసుకు హత్తుకుని, అల్లుకుపోయే మృదు మధురమైన తెలుగు భాషా పరిమళాన్ని ఆస్వాదించలేకపోవడం దురదృష్టకరం. తెలుగు భాష మన మాతృభాష అని చెప్పుకోవడంలోనే తెలుగు వారి గౌరవం వికసిస్తుంది. ఈ సత్యాన్ని మరచి, మన భాషను మనమే చిన్నబుచ్చడం, అవహేళన చేయడం కుసంస్కారం.



సుంకవల్లి సత్తిరాజు

ప్రజల మధ్య సంబంధాలు నెలకొల్పడానికి, వారి సంస్కృతీ సాంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను అవగతం చేసుకోవడానికి అవసరమైన భావ వ్యక్తీకరణకు వినియోగించే అర్థవంతమైన మాధ్యమాన్ని 'భాష' అని నిర్వచించవచ్చు. భాషలు వివిధ దేశాల,ప్రాంతాల ప్రజల చరిత్రను, గుర్తింపును విశ్వ వ్యాప్తం చేస్తాయి. తమ చరిత్రను విస్తరింపచేయడానికి,వివిధ ప్రాంతాల ప్రజలతో సాన్నిహిత్యం పెంపొందించుకోవడానికి,తమ వారసత్వ ఔన్నత్యాన్ని ప్రపంచం నలుదిశలకు చాటి చెప్పడానికి ప్రతీ భాషకు లిపి అవసరం. లిపి లేని భాషలను గ్రంథస్థం చేయలేము కనుక, కాలక్రమంలో అలాంటి భాషలు కనుమరుగుకాక తప్పదు. దురదృష్టవశాత్తూ ప్రపంచంలో అతికొద్ది భాషలు మాత్రమే ప్రజలు విరివిగా ఉపయోగిస్తున్నారు. ఆంగ్లం, మాండరిన్ చైనీస్,హిందీ,స్పానిష్,ఫ్రెంచ్ వంటి భాషలు ప్రపంచంలో అధికసంఖ్యాక ప్రజలు మాట్లాడుతున్నారు. భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో భిన్నమైన భాషలు మాట్లాడే ప్రజలున్నారు. అయితే ఆంగ్లభాష ప్రపంచాన్ని శాసిస్తున్న వర్తమాన పరిస్థితుల నేపథ్యంలో భారత దేశంలో కూడా పలు ప్రాంతీయ భాషలు అంతరించిపోయే ప్రమాదం ఏర్పడింది. అందులో తెలుగు భాష ఒకటి. తెలుగుభాష రాయడం నేటితరం ఇప్పటికే మరచిపోయింది. తెలుగు భాష మాట్లాడంలో కూడా ఆంగ్ల భాషను మిళితం చేస్తున్నారు. పర భాషా సంగమంతో మిశ్రమంగా మారిన తెలుగు భాష తన స్వచ్ఛతను కోల్పోతున్నది.ఆంగ్లం మాట్లాడితేనే తమ స్థాయి పెరుగుతుందనే మూర్ఖ భావజాలం వ్యాపించడం దురదృష్టకరం. తెలుగు మాట్లాడే వ్యక్తులు కూడా తెలుగు భాష పట్ల అయిష్టత ప్రదర్శించడం ఆంగ్ల భాషకు అగ్రతాంబూలమివ్వడం దేనికి సంకేతం? మారుతున్న కాలానికనుగుణంగా ఆంగ్లాన్ని నేర్చుకోవడం తప్పని సరి. విద్యా, ఉద్యోగ సంబంధిత వ్యవహారాల్లో ఆంగ్ల భాష ప్రాధాన్యతను విస్మరించలేం. అయితే ఇంట్లో కూడా ఆంగ్ల భాషలోనే మాట్లాడుకోవడం, తమ పిల్లలు కూడా ఆంగ్లంలో మాట్లాడితే ఆనందపరవశులు కావడం మరీ విడ్డూరం. నగరాల్లోనే కాదు కుగ్రామాల్లో కూడా తెలుగు భాషా వికాసం మోడు వారిపోతున్న విషయం తెలుగు భాషాప్రియులకు ఆశనిపాతం. ఆంగ్ల భాషా వ్యామోహం అమృతతుల్యమైన, అత్యంత అర్థవంతమైన తెలుగు భాషను క్షీణింప చేయడం బాధాకరం. అందమైన అక్షరాల పొందికతో అత్యద్భుతంగా రూపకల్పన చేయబడ్డ రమణీయమైన ప్రాచీన భాషతెలుగు. క్రీ.పూ 400 సంవత్సరాల క్రితమే తెలుగు భాష మనుగడలో ఉన్నట్టుగా అనేక శిలాశాసనాలు తేటతెల్లం చేస్తున్నాయి. తెలుగు భాషలో ఎన్నో మండలికాలు,యాసలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా వేలాది భాషలు సజీవంగా ఉన్నప్పటికీ, కేవలం కొన్ని వందల భాషలకు మాత్రమే లిపి ఉన్నది. ఎన్నో భాషలు అంతరించిపోయాయి. మరెన్నో భాషలు కేవలం మాట్లాడుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతూ, లిపి లేకుండా పోయాయి. ఇంకొన్ని భాషలు అంతరించడానికి అతి దగ్గరలో ఉన్నాయి.మన భారతదేశంవిభిన్న భాషలకు నిలయం. భాషా వైవిధ్యంగల భారతీయ సమాజంలో కొన్ని రాష్ట్రాల్లోని భాషలు వాటికున్న ప్రాచీన చారిత్రక నేపథ్యం ఆధారంగా ప్రాచీన హోదా సంపాదించాయి. అందులో తెలుగు భాష ఒకటి. తెలుగు భాషకు ప్రాచీన హోదా దక్కడంలో ఆలస్యమైనా తుదకు ఆ మైలు రాయిని కూడా అధిగమించి,అనుకున్న లక్ష్యం సాధించడంలో సఫలీకృతమైనది. తెలుగు ప్రజలు వేర్వేరు ప్రాంతాల్లో నివసిస్తున్నప్పటికీ, వేర్వేరు యాసల్లోభాషను వినియోగిస్తూ, భావాన్ని వ్యక్తీకరిస్తున్నప్పటికీ, వారంతా తెలుగు భాష మాట్లాడే




ప్రజలే. ప్రాంతాలు వేరైనా తెలుగు వారంతా ఒక్కటే. తెలుగు భాషకున్న వైభవం చరిత్ర చాటి చెబుతున్నది. త్రిలింగ అనే పదం నుండి 'తెలుగు' ఏర్పడిందని పరిశోధకుల అంచనా. కొన్ని ప్రాచీన గ్రంథాల్లో తెలుగు పదాలు ఉన్నట్టు అంచనా. శాతవాహనులకు ముందునుంచే తెలుగు ఉనికిలో ఉందని, కృష్ణ,గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు తెలుగు మాట్లాడే వారని కొంతమంది అభిప్రాయం. 11వ శతాబ్ధంలో తెలుగు ముద్రితమైనదని కొందరు, తెలుగు భాష 2400 సంవత్సరాల క్రిందటే అస్థిత్వంలో ఉందని మరికొందరు చెబుతారు. ఏది ఏమైనప్పటికీ తెలుగు భాషకు అత్యంత ప్రాచీన చరిత్ర, వైభవం ఉన్న మాట వాస్తవం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అధికార భాషగా చెలామణీ అవుతూ, హిందీ,బెంగాలీ వంటి భాషల సరసన ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో మాట్లాడే భాషగా తెలుగు భాష ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇతర దేశాల్లోని తెలుగు వారు తెలుగును గౌరవిస్తుంటే, తెలుగునేలపై తెలుగు అపహాస్యానికి గురౌతున్నది. తెలుగు మాట్లాడడం నేరమన్న భావన ప్రబలడం హాస్యాస్పదం. మాతృభాషను గౌరవించడం మన కర్తవ్యం. తెలుగు భాషా పరిరక్షణ ప్రతీ తెలుగు వాడి బాధ్యత. తెలుగుదనాన్ని ఆస్వాదించకుండా కేవలం ఆంగ్లాన్ని నెత్తిన పెట్టుకుని ఆరాధించడం భావ దారిద్ర్యం అనక తప్పదు. భారతదేశం గుర్తించిన ఆరు ప్రాచీన భాషల్లో తెలుగు కూడా ఒకటి. కన్నడ, ఒడియా, మలయాళం, సంస్కృతం వంటి భాషలతో పాటు తెలుగు అత్యంత ప్రాచీన భాషగా గుర్తింపబడింది. రాబోవు కొద్ది కాలంలో మన దేశంలో హిందీ, మళయాళం, తమిళం, బెంగాలీ వంటి కొద్దిభాషలు మాత్రమే మిగులుతాయి.తెలుగు భాష కేవలం మాట్లాడుకోవడానికే తప్పమరే ఇతర అవసరాలకు పనికి రాకుండాపోవడానికి మనం మన భాష పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యమే కారణమవుతున్న సంగతిని విస్మరించరాదు. మన దేశంలోనే కాకుండా ప్రపంచంలోని పలు దేశాల్లో మాతృభాషలు అంతరించిపోతున్నాయి. భారత దేశంలో జాతీయ భాష హిందీతో పాటు పలు ప్రాంతీయ భాషలు మనుగడలో ఉన్నాయి. అయితే ఆంగ్ల భాష పట్ల మక్కువతో పలు ప్రాంతీయ భాషలు తిరస్కరణకు గురౌతున్నాయి.శతాబ్దాల చరిత్రగల చక్కనైన తెలుగు భాష ఆంగ్ల భాషా వికాసంతో వెలవెలబోతున్నది. తెలుగు భాష మాట్లాడడం తెలుగు వారికి నామోషీగా మారడం దురదృష్టకరం. అందమైన అక్షరాలతో, మల్లెతీగలా మనసుకు హత్తుకుని, అల్లుకుపోయే మృదు మధురమైన తెలుగు భాషా పరిమళాన్ని ఆస్వాదించలేకపోవడం దురదృష్టకరం. తెలుగు భాష మన మాతృభాష అని చెప్పుకోవడంలోనే తెలుగు వారి గౌరవం వికసిస్తుంది. ఈ సత్యాన్ని మరచి, మన భాషను మనమే చిన్న బుచ్చడం,అవహేళన చేయడం కుసంస్కారం. తెలుగు భాష చాలా ప్రాచీనమైనదైనప్పటికీ తెలుగులో పురాణైతిహాసాలు ,పాఠ్యాంశాలు గ్రాంథిక భాషలో లిఖించడం వలన అవి సామాన్య జనవాహినికి చదవడానికి కష్టసాధ్యంగా ఉండేవి. కవివర్యులకు, రచయితలకు మాత్రమే గ్రాంథిక భాష సౌలభ్యంగా ఉండేది. ఇలాంటి అర్థం కాని సంస్కృత పదాలతో, పద్యాలతో కొరకరాని కొయ్యగామారి, తెలుగు జనాలకు దూరమోతున్న తెలుగును సామాన్యులకు, విద్యార్థులకు అర్థవంతమైన పద్ధతిలోవ్యవహారిక శైలిలో రూపొందించి, తెలుగుభాషను తెలుగు హృదయాలకు చేరువ చేయాలన్న తపనతో విశేష కృషి చేసిన గిడుగురామ్మూర్తి తెలుగు భాషాభిమానులకు అత్యంత ప్రీతిపాత్రుడు.'గిడుగు' తెలుగు వ్యావహారిక భాషోద్యమం తెలుగు భాషకు గొడుగు పట్టింది. తెలుగు ప్రజలకు చేరువైనది. గ్రామీణ నేపథ్యం గల తెలుగు జనాలకు సైతం తెలుగు వ్యావహారిక భాష అమృతతుల్యంలా అగుపించింది. తెలుగు భాషను వ్యావహారిక శైలిలో తెలుగు ప్రజలకు చేరువకావడానికి గిడుగు వేంకట రామ్మూర్తి చేసిన అనితర సాధ్యమైన, అనిర్వచనీయమైన సేవలకు గుర్తింపుగా ఆయన జయంతి ఆగష్టు 29 వ తేదీని "తెలుగు భాషాదినోత్సవం"గా జరుపుకోవడం గిడుగు వారి పట్ల తెలుగు వారికున్న అపారమైన గౌరవానికి నిదర్శనం. అయితే నేటితరం తెలుగు భాష పట్ల చూపుతున్న నిర్లక్ష్యం, నిర్లిప్తత తెలుగు జాతి ప్రాచీన వారసత్వ ఔన్నత్యానికి గొడ్డలిపెట్టు.ఆంగ్ల భాషను అభ్యసించడం అవసరం. అంతర్జాతీయ భాషగా ఉద్యోగావకాశాలకు అనుగుణంగా ఆంగ్లభాషను నేర్చుకుంటూనే,తెలుగు భాషనుకూడా కొనసాగించాలి. తెలుగు ఖ్యాతిని ఇనుమడింప చేయాలి. ●

# ఉద్యోగాల కల్పనలో ఇక ఎఐదే కీలకపాత్ర

ఎస్.సీతారామయ్య

దేశంలో రానున్నకాలంలో ఉద్యోగాల స్వరూపమే అనూహ్యంగా మారిపోయే పరిణామాలు కనిపిస్తున్నాయి. ఇది వరకు డిగ్రీలుంటే కానీ సరైన ఉద్యోగాలు రాని పరిస్థితి ఉండగా,ఇప్పుడు సాంకేతిక నైపుణ్యం ముందు డిగ్రీలు చిన్నబోతున్నాయి. దేశంలో ఎఐ(కృత్రిమ మేధ) నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. ప్రపంచ స్థాయిలో 88శాతంవరకు ఎఐ ప్రోగ్రాములు అమలవుతున్నాయి. ఉత్పాదక ఆధారిత ఎఐ శిక్షణ నమోదులో అమెరికా, భారత్ దేశాలు ముందుండడంతో ప్రపంచవ్యాప్తంగా ఎఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరిగింది. జనరల్ ఎఐ శిక్షణను పెంచడంలో కార్పొరేట్ సంస్థలు ముందుంటున్నాయి. ఈ కార్పొరేట్ సంస్థలకు ప్రపంచ వ్యాప్తంగా 14 మిలియన్ల కన్నా ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారు. జనరల్ ఎఐ వినియోగం ప్రస్తుతం అన్ని రంగాల్లో పెరుగుతోంది. అందుబాటులో ఉన్న సమాచారాన్ని వినియోగించుకుని సరికొత్త చిత్రాలు, పాఠ్యాంశాలు, సంగీతం తదితర అంశాలను సృజించే వ్యవస్థలను జనరేటివ్ ఎఐగా వ్యవహరిస్తున్నారు. ఎఐ నైపుణ్యానికి సంబంధించి దేశంలో 67 కంపెనీలు కొత్త విచిన్న నైపుణ్య ప్రతిభపై దృష్టి సారిస్తున్నాయి. 2030 నాటికి దేశంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, మరోవైపు 9.2 కోట్ల ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని, అలాగే ప్రపంచంలో 170 మిలియన్ కొత్త ఉద్యోగాలు సృష్టించబడగా, 92 మిలియన్ ఉద్యోగాలు కోల్పోవడమవుతుందని వరల్డ్ ఎకనామిక్ పోరమ్ (డబ్ల్యుఇఎస్) నివేదిక వెల్లడించింది. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయ కంపెనీలు ప్రపంచాన్ని అధిగమించేందుకు సిద్ధంగా ఉన్నాయి.ఎఐ, రోబోటిక్స్,ఎనర్జీ టెక్నాలజీ వంటిరంగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. దేశంలో బిగ్ డేటా, ఎఐ, మెషిన్‌లెర్నింగ్, సైబర్ నిర్వహణ వంటి ఉద్యోగాలు దేశంలో వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత దేశంలోని ఐటి రంగం ప్రస్తుతం 5.4 మిలియన్ మందికి ఉద్యోగాలు కల్పిస్తోంది. 2030 నాటికి ఈ సంఖ్యను 10మిలియన్ వరకు రెట్టింపు చేయాలన్న టార్గెట్ ఉండగా, కేవలం 7.5మిలియన్ వరకే సాధించగలమని ఆయా రంగ నిపుణులు చెబుతున్నారు. దీనికి కారణం ఎఐ విస్తరించడంవల్ల ఇప్పుడున్న ఉద్యోగాలు పోతాయన్న భయం వెంటాడుతుండడమే. ప్రస్తుతం ఈ వృద్ధి అంతా డిజిటల్ సాంకేతికత వైపు దూసుకెళ్తోంది. ఎఐ, క్లౌడ్ కంప్యూటింగ్,ఆటోమేషన్ తదితర సాంకేతిక ప్రక్రియలుపారిశ్రామిక, వాణిజ్యసంస్థల ప్రోత్సాహంతో విస్తరిస్తున్నాయి. ఇది వరకటి 10 మిలియన్ ఉద్యోగాల టార్గెట్ను 7.5 మిలియన్ ఉద్యోగాలకు సవరించినప్పటికీ, ఉద్యోగాల రాశి కన్నా నైపుణ్యం, నాణ్యతలకు పట్టంకడుతున్నారు. ఎఐ, ఆటోమేషన్ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు ఉద్యోగాల నియామక ప్రక్రియలను క్రమబద్ధంచేస్తున్నాయి. ఈ మార్పులు,అత్యంత విలువైన సాంకేతిక సేవలు,నూతన ఆవిష్కరణలవైపు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. ఈ ఆధునిక సాంకేతిక నైపుణ్య ప్రక్రియలను అందిపుచ్చుకోగలిగితేనేఇప్పుడు ఉద్యోగాలు లభిస్తాయి.ఈమేరకు ఉద్యోగ అవ కాశాలు 80శాతంవరకు సాంకేతిక నిపుణులతో 2025-26 నాటికి 20వరకు పెరుగుతాయని ఐటి రంగవర్గాలు పేర్కొంటున్నాయి. అత్యంత ఆధునిక సాంకేతికతల వల్ల 2030 నాటికి దేశంలో 150బిలియన్ డాలర్ల వరకుఆర్థిక ప్రయోజనం సిద్ధిస్తుందని అంచనావేస్తున్నారు.జనరేటివ్ ఎఐ వంటిసాంకేతికతలే ఐటిరంగంలో 2030 నాటికి రెండు మిలియన్ల వరకు కొత్తఉద్యోగాలను సృష్టిస్తాయని నివేదికలవల్ల తెలుస్తోంది. ●

# అణుబాంబు నీడలో మానవ జీవితం!



రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ చరిత్రలో అణుశక్తి మానవ మేధస్సు ఆవిష్కరణకు ప్రతీకగా నిలిచినప్పటికీ, అదేశక్తి మానవ నాగరికతను నాశనం చేసే భయంకర శక్తిగా కూడా పరిణమించింది. ప్రపంచ శాంతి, మానవ రక్షణ, పర్యావరణ పరిరక్షణ అనే అంశాలు నేటి యుగంలో అత్యంతప్రాధాన్యం సంతరించుకున్నాయి. అణు ఆయుధాలు మానవజాతికి శక్తి, ఆధిపత్యం, సాంకేతిక ప్రగతి చిహ్నాలుగా భావించబడినా వాటి విధ్వంసకర శక్తి ప్రపంచాన్ని పునరావృతంగా ఆలోచించేలా చేస్తోంది. అందుకే ప్రతి సంవత్సరం ఆగస్టు 29న అంతర్జాతీయ అణుపరీక్షల వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటారు. 1991లో కజిఖిస్తాన్‌లోని సెమిపాలటిన్స్క్ అణు పరీక్షా క్షేత్రం మూతపడిన రోజు గుర్తింపుగా ఐక్యరాజ్య సమితి 2009 డిసెంబర్ 2న తీర్మానం ఆమోదించి ఈ దినోత్సవాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. ఈ నిర్ణయం అణు పరీక్షలు మానవ జాతిపై మోపిన విపరీతమైన దుష్పరిణామాలను స్మరింపజేయడమే కాక భవిష్యత్తులో అణు ముప్పులను నివారించే ప్రయత్నాలకు ఒక బలమైన ఆహ్వానం. ప్రపంచ చరిత్రలో అణు పరీక్షల మొదటి దృశ్యం 1945 జూలై 16న అమెరికా న్యూ మెక్సికోలోని అలమోగోర్డోలో ట్రినిటీ పేరిట జరిగిన ప్రయోగమే. తరువాత అదే సంవత్సరం జపాన్‌పై హిరోషిమా, నాగసాకిపై అణు బాంబులు ప్రయోగించబడినప్పుడు ప్రపంచం అణుశక్తి భయానకతను ప్రత్యక్షంగా చూచింది. ఆ ఘోర వినాశనం లక్షలాది ప్రాణాలను బలి తీసుకున్నదే కాక తరతరాల పాటు ఆప్రాంతాల్లో వికలాంగత్వం, కేన్సర్లు, పర్యావరణ కాలుష్యం వంటి అపరిమిత కష్టాలను మిగిల్చింది. ఆ తర్వాత అమెరికా, సోవియట్ యూనియన్, ఫ్రాన్స్, బ్రిటన్, చైనా తదితర దేశాలు యుద్ధ కాలంలో ఆధిపత్య పోరులో భాగంగా వందలాది అణు పరీక్షలు జరిపాయి. ఈ పరీక్షలు కేవలం ఎడారులు, సముద్రాలు, భూమి గర్భానికే పరిమితం కాలేదు, వాటి ప్రభావం వాతావరణంలో రేడియోధార్మిక కణాలుగా వ్యాప్తి చెంది మానవ ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యంపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటివరకు రెండు వేలకి పైగా అణుపరీక్షలు జరిగాయి. వీటిలో అమెరికా 1,030,సోవియట్ యూనియన్ 715, ఫ్రాన్స్ 210,బ్రిటన్ 45, చైనా 45, భారత్ 6, పాకిస్థాన్ 6, ఉత్తర కొరియా 6 పరీక్షలు జరిపాయి. ప్రతి పరీక్ష వాతావరణంలో విష రసాయనాలు, రేడియేషన్ విడుదల చేస్తూ జీవవైవిధ్యాన్ని ముప్పుకు గురిచేసింది. సంవత్సరాలుగా అణు పరీక్షల వ్యతిరేకంగా ప్రజల నిరసనలు ఉధృతమయ్యాయి. జపాన్‌లో అణుబాంబు బాధితులు, శాంతి కార్యకర్తలు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు నడిపారు. ఈనేపథ్యంలో 1963లో



అమెరికా, సోవియట్ యూనియన్, బ్రిటన్‌లు పాక్షిక అణు పరీక్షా నిషేధ ఒప్పందంపై సంతకం చేసి భూమి మీద, వాతావరణంలో, నీటిలో పరీక్షలను నిషేధించాయి. అయితే భూగర్భ పరీక్షలకు మాత్రం అవకాశం ఇచ్చారు.తదనంతరం 1996లో సమగ్ర అణుపరీక్షా నిషేధ ఒప్పందంరూపొందినా అది అమల్లోకి రాలేదు. ఎందుకంటే అణు శక్తివంతమైన కొన్ని దేశాలు దానిని ఆమోదించలేదు. అయినప్పటికీ, ఆ ఒప్పందం అంతర్జాతీయ రాజకీయాల్లో అణు నియంత్రణకు ఒక ప్రధాన పునాది వేసింది.భారతదేశం 1974లో స్మైలింగ్ బుద్ధా పేరిట మొదటి అణుపరీక్ష,1998లో పోఖ్రాన్ పేరిట ఐదు అణుపరీక్షలు నిర్వహించింది.అయితే భారత్ ఎల్లప్పుడూ ప్రథమంగా అణ్వస్త్ర వినియోగం చేయమని స్పష్టంగా ప్రకటించింది. ఈ విధానం ప్రపంచానికి శాంతి సందేశాన్ని ఇస్తుంది. అణు పరీక్షల ప్రభావం మానవ జీవితంలోఅనేక కోణాలలో ప్రతిఫలించింది. భూగర్భ పరీక్షల వల్ల భూకంపాలు, భూగర్భ జలాలకలుషితం, నేల పాడైపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యాయి. సముద్ర పరీక్షలు సముద్ర జీవ సంపదపై ఘోర ప్రభావం చూపాయి.వాతావరణంలో వ్యాపించిన రేడియోధార్మిక కణాలు ఆహార శ్రేణిలోకి చేరి తరతరాలపాటు జన్య వ్యాధులను సృష్టించాయి. వైద్యపరమైన పరిశోధనల ప్రకారం అణుపరీక్షల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలలో కేన్సర్, ల్యూకేమియా, థైరాయిడ్ వ్యాధులు అధికంగా కనిపించాయి. కజిఖస్తాన్‌లోని సెమిపాలటిన్స్ ప్రాంతం, పసిఫిక్ మహాసముద్రంలోని బికినీ అటోల్ దీవులు,నెవాడా ఎడారి లాంటిప్రాంతాలు ఈ విషాదానికి సాక్ష్యాలుగా నిలిచాయి. అంతర్జాతీయ అణు పరీక్షల వ్యతిరేక దినోత్సవం నేడుమనిషి అనుభవించిన దుర్ఘటనల జ్ఞాపకమే కాక భవిష్యత్తుపట్ల మానవజాతికి ఒక హెచ్చరిక. ఈ రోజు దేశాలు పరస్పరం నమ్మకం పెంపొందించుకొని, ఆయుధ పోటీకి బదులుగా శాంతి సహకారం వైపు నడవాలని గుర్తుచేస్తుంది. ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ శాంతి సంస్థలు, శాస్త్రవేత్తలు,పౌరసమాజం అన్నివర్గాలు ఈ రోజు నాడు అణు పరీక్షల ముప్పును సవివరంగా చర్చించి ప్రత్యామ్నాయ భద్రతా మార్గాలను అన్వేషిస్తాయి. అణు నిరాయుధీకరణ దిశగా వియన్నా, జెనీవా వంటి నగరాల్లో అనేక చర్చలు జరుగుతాయి.ఇది కేవలం ప్రభుత్వాలకే కాక సాధారణ పౌరులకూ శాంతి పట్ల బాధ్య తను గుర్తు చేసే రోజు. అణుశక్తిశాంతి ప్రయోజనాలకోసం ఉపయోగపడే శక్తివంతమైన సాధనం కావచ్చు.విద్యుత్ ఉత్పత్తి, వైద్యరంగం, వ్యవసాయం వంటి రంగాల్లో అది సద్వినియోగం అవుతుంది. కానీ దాన్ని ఆయుధాలుగా వినియోగించడం మానవ జాతికి అస్తిత్వపరమైన ముప్పు.అందుకే అంతర్జాతీయ సమాజం అణు నిరాయుధీకరణ పట్ల కట్టుబాటుగా ఉండి అణు పరీక్షలు జరపకుండా నిబద్ధతతో ముందుకు సాగాలి.భవిష్యత్తు తరాలకు ఒక సురక్షితమైన, శాంతియుతమైన ప్రపంచాన్ని అందించాలంటే అణు ఆయుధాల రహిత భూగోళాన్ని సాధించడానికి ప్రయత్నాలు ఆగ కూడదు. మానవ జీవన విలువను కాపాడటం, ప్రకృతి సమతుల్యతను పరి రక్షించడం, శాంతిని నిలబెట్టడం అనే మూడు లక్ష్యాల కోసం ఈరోజుమానవ జాతి ఒకటిగా నిలబడి ఆత్మ పరిశీలన చేయాలి. ●

Main tab page 111_Main tab page 111.qxd 8/29/2025 12:52 AM Page 1



## మంత్రి ఆదేశాలతో బస్ సర్వీసు ప్రారంభం

**అద్దంకి, ప్రభాతవార్త**



అద్దంకి మండలం, మణికేశ్వరం గ్రామానికి ఏపీఎస్ఆర్టీసీ సదుపాయం లేక వృద్ధులు, విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన గ్రామ టీడీపీ నాయకులు కరిముల్లా మరియు కొంతమంది గ్రామస్తులు కలసి సమస్యను గత నెలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈ మేరకు గురువారం అధికారులు మణికేశ్వరం గ్రామానికి నూతన బస్సు సర్వీసును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రి ఫ్లెక్సీలు చేతపట్టి కృతజ్ఞతలు తెలిపారు,అనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ కరిముల్లా, బడావలి, రూబేను,రవి, ఆదినారాయణ,కాలేషా, రఘుబాబు, సుధాకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ సర్టిఫికేట్ల వెర్ఫికేషన్ పక్రియను పరిశీలించిన జేసీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



గురువారం ఉదయం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఒంగోలు రూరల్ మండల పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలో గల శ్రీసరస్వతి జూనియర్ కళాశాలను సందర్శించి డీఎస్సీ-2025 కు సంబంధించి జరుగుతున్న సర్టిఫికేట్ వెర్ఫికేషన్ పక్రియను పరిశీలించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సర్టిఫికేట్ వెర్ఫికేషన్ పక్రియను పటిష్టంగా చేపట్టాలని ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్, విద్యాశాఖకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు రైతు సేవకేంద్రంలో అందుబాటులో ఉంచుతాం

**కొండపి, ప్రభాతవార్త**




రైతులకు అవసరమైన ఎరువులను ఆయా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచుతామని కొండపి మండల వ్యవసాయ అధికారి మేడికొండ మాల్యాద్రి రైతులకు సూచించారు గురువారం కొండపి మండలం పరిధిలో కె. ఉప్పలపాడు చిన వెంకన్నపాలెం గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో సాగు చేయు వివిధ రకాల పంటలకి సంబంధించి సమగ్ర యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు కులంకుశం గా వివరించారు . పంట సాగుచేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని,పంటలకు ఇన్సూరెన్స్ కట్టుకోవడానికి ప్రభుత్వం వారు ఈ నెల 31 వరకు మాత్రమే అవకాశం ఇచ్చిఉన్నారు తెలియజేశారు.అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించ ఎంపీసీఐ పెండింగ్ ఉన్న రైతులు త్వరగా మ్యాపింగ్ చేయించుకోవాలని తెలియపరిచారు.ఈ కార్యక్రమం లో ఏ ఈ ఓ పి.కుమార్, పంచాయతీ కార్యదర్శి ఏ ఏ. బుజ్జీ, మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు..

## నిమర్జనం ప్రదేశం తనిఖీ చేసిన డిఎస్పి

**కొత్తపట్నం ఆగస్టు 28 ప్రభాతవార్త**



కొత్తపట్నం బీచ్ ను ఒంగోలు డి.ఎస్.పి రాయపాటి శ్రీనివాసరావు తనిఖీ చేయడం జరిగింది. వినాయక చవితి సందర్భంగా వినాయక నిమజ్జనానికి వచ్చే వాహనాలు రాకపోకలకు అంతరాయం లేకుండా నిమజ్జనం సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ సుధాకర్ కు తెలియజేశారు. బందోబస్తు విషయంలో ఎలాంటి లోపాలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. నిమజ్జనానికి వచ్చే బొమ్మలను సముద్రంలో కలపడానికి గజ ఈతగాళ్లతో మాట్లాడడం జరిగింది. సాయంత్రం 6 తర్వాత వచ్చే వాహనాలను సముద్రంలోనికి వెళ్లకుండా నిలుపుదల చేస్తామని ఆయన తెలియజేశారు. నిమజ్జనానికి వచ్చే ప్రజానికం సముద్రం లోపలికి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ మేడ శ్రీనివాసరావు, కొత్తపట్నం ఎస్సై వేముల సుధాకర్, మెరైన్ ఎస్ఐ సుబ్బారావు, పోలీస్ సిబ్బంది, మెరైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ను కలిసిన యోగయ్యయాదవ్

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**



విజయవాడ బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివియన్ మాధవ్, మంత్రి మధుకర్‌లను గురువారం బిజెపి ఒంగోలు అసెంబ్లీ ఇంచార్జి యోగ య్య యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో పార్టీ సహచరులు బిజెపి ఆఫీస్ ఇంచార్జి శ్రీనివాసరాజు, బిజెపి స్టేట్ ఆఫీస్ సెక్రటరీ పవన్, బిజెపి సీనియర్ నాయకులు ముప్వల సుబ్బయ్య తదితరులను మర్యాద పూర్వకముగా కలవటం జరిగింది. పార్టీకి సంబంధించిన పలు షయాలపై రాష్ట్ర అధ్యక్షులు, మంత్రి మధుకర్‌లతో ఉమ్మడిగా చర్చించారు.

## మండల స్థాయి అధికారులతో ఎంపీడీఓ సురేష్‌బాబు సమీక్ష

**సంతనూతలపాడు, ఆగష్టు 28, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నాడు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు మండల స్థాయి అధికారులతో పలు రంగాలు అభ్యున్నతిపై సమీక్ష నిర్వహించారు. మండలంలో పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి ఫ్రోగ్రెస్‌లో ఉన్న సీసీ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ సురేస్‌బాబు అధికారులకు సూచనలు ఇచ్చారు. మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, 15 రోజులకు ఒక సారి ఇంజనీరింగ్ అసిస్టెంటన ద్వారా క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వెలుగు ఎన్ఆర్ఈజీఎస్, రంగాల అభ్యున్నతిపై ఎంపీడీఓ సురేష్ బాబు సమీక్షించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఏఈ వీరాంజనేయులు, డిప్యూటీ ఎంపీడీఓ రమణమ్మ, వెలుగు ,ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## శ్రీ హరిహర క్షేత్రంలో ప్రత్యేకపూజల్లో పాల్గొన్న శిద్దా

**చీమకుర్తి, ప్రభాతవార్త**



వినాయక చవితి సందర్భంగా చీమకుర్తి శ్రీ హరి హర క్షేత్రంలో రాష్ట్ర మాజీ మంత్రి వర్యులు శిద్దా రాఘవ రావు విశేష పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శిద్దా రాఘవ రావుకి తీర్థ ప్రసాదాలతో పాటు వేద ఆశీస్సులు అందచేశారు.

### బషీర్ బాగ్ అమరవీరుల స్ఫూర్తితో

# మరో విద్యుత్ పోరాటానికి సన్నద్ధం కావాలి





- *స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకునేంత వరకు ఉద్యమం ఆగదు*
- *ప్రజలపై భారాలు మోపటంలో చంద్రబాబు, జగన్ దొందు దొందే*
- *ఆదాని, అంబానీల ఏజెంట్‌గా చంద్రబాబు*

**ఒంగోలు, ప్రభాతవార్త**

బషీర్ బాగ్ విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని వాపమక్ష నేతలు పిలుపునిచ్చారు. విద్యుత్ సంస్కరణలు విరమించుకుంటే ప్రజాగ్రహంతో ప్రభుత్వం కొట్టుకుపోవడం ఖాయమని హెచ్చరించారు. విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినంలో భాగంగా ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎంఎస్ సాయి, సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అమరవీరులు రామకృష్ణ విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి చిత్రపటాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ 2000 సంవత్సరంలో బషీర్ బాగ్ వద్ద జరిగిన విద్యుత్ ఉద్యమంలో తనకు గాయాలయ్యాయి. ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నాటి విద్యుత్ ఉద్యమం తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోవడానికి శ్రీకారం చుట్టిందన్నారు. నీటి ఫిరంగులు ఒక వైపు, రబ్బరు బుల్లెట్లు ఒక వైపు దూసుకు వస్తున్నా ఏ మాత్రం లెక్క చేయకుండా వేలాది మంది కార్యకర్తలు గుండ్లకు గుండెను అడ్డుపెట్టి వీరోచిత పోరాటం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మరో విద్యుత్ పోరాటం పునరావృతం అయ్యే పరిస్థితులు నేడు రాష్ట్రంలో నెలకొన్నాయన్నారు. చంద్రబాబు నాయుడు, జగన్ ఇద్దరు ప్రజలపై భారాలు మోపడంలో దొందూ దొందే అన్నారు. దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్న చందంగా ప్రజలపై నేడు విద్యుత్ భారాలు మోపుతున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ యువగళం, చంద్రబాబునాయుడు పెద్దగళం పేరుతో స్మార్ట్ మీటర్లను పగలకొట్టండి అంటూ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. కానీ నేడు అదే చంద్రబాబునాయుడు స్మార్ట్ మీటర్ల బిగింపుకు, ట్రూ అప్ ఛార్జీల భారాలు మోపేందుకు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. డబుల్ ఇంజన్ సర్కారు ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈపాటికే వామపక్ష పార్టీలు ఉద్యమ బాటలో ఉన్నాయని ఎర్రజెండా నీడన మరో విద్యుత్ పోరాటానికి ప్రజల సిద్ధం కావాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు శంకర్ గిరి మాన్యాలు పట్టి పోవడం ఖాయమని హెచ్చరించారు. రూ.175 కోట్లతో అమెరికాలో ఆదాని ఒప్పందం కుదుర్చుకున్న జగన్‌ను చంద్రబాబు నాయుడు ఎందుకు జైలుకు పంపలేకపోతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడుకు దమ్ముంటే జగన్‌ను జైలుకు పంపాలని సవాల్ విసిరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు జీతగానిగా విద్యుత్ సంస్కరణలుత ఎచ్చిన చంద్రబాబు మరో సారి అదే దారిలో నడుస్తున్నాడని దుయ్య బట్టారు. కేంద్రం అండతో రాష్ట్రాన్ని ఆదాని, అంబానీల అడ్డాగా మారుస్తున్నాడని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ ఈటర్లు పగలగొట్టమని పిలుపునిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చి వాటినే అమలు చేయడం సిగ్గుచేటు అని విరుచుకుపడ్డారు. స్మార్ట్ మీటర్లను అనుమతించబోమని ప్రభుత్వం స్పష్టంగా ఎందుకు చెప్పలేకపోతుందని ప్రశ్నించారు. ఈ మౌనం వెనుక ఆదాని, అంబానీ ప్రయోజనాలే ఉన్నాయని ప్రజలకు అర్థం అవుతోందని ఆరోపించారు. సూర్యఘర్ పథకం పేరిట కోట్లాది రూపాయల డ్వాక్రా నిధులను మళ్లించే కుట్ర జరుగుతోందని ఆమె ఆరోపించారు. చిన్న పరిశ్రమలకు ఇచ్చే రాయితీలు తొలగించడం విద్యుత్ సంస్థలను దివాళా తీయించి కార్పొరేట్లకు అప్పగించడం అన్ని కార్పొరేట్ల ప్రయోజనం కోసమే అన్నారు .ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ఆజకీయ విధానాలతో ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ గత పోరాట ఫలితంగా ప్రజలకు 20 ఏళ్ల నుండి విద్యుత్ భారాల నుండి ఉపశమనం లభించిందని, జగన్ ప్రభుత్వం ట్రూ ఆఫ్ ఛార్జీలతో కొత్త సంస్కరణలు తెచ్చి పెట్టాడు అన్నారు. ఎన్నికలలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఇప్పుడు మరోసారి సంస్కరణలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు ఇంటి బాట పట్టడం ఖాయమని ఘాటుగా వ్యాఖ్యానించారు. సీపీఎం ఎల్ జిల్లా కార్యదర్శి డీవీఎన్ స్వామి మాట్లాడుతూ ఆదానీతో 1750 కోట్ల ఒప్పందం, మరో వైపు ప్రజలపై రూ.1.25 లక్షల కోట్ల భారం ఇది ప్రభుత్వానికి వై సులభమా..? ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోళ్లలోనూ కోట్ల రూపాయల అవినీతి జరిగింది. 60 వేల విలువ గల ట్రాన్స్‌ఫార్మర్‌ను జగన్ రూ.1.30 లక్షలకు చంద్రబాబు రూ.1.40 లక్షలకు కొనుగోలు చేశారు. ఇది స్పష్టమైన దోపిడి అని ఆరోపించారు. సీపీఎంఎల్ నాయకులు ఆర్.మోహన్ మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీకి భూములు అప్పగించేందుకు కరేడు గ్రామాన్ని పోలీసులతో అష్టదిగ్బంధనం చేయించడం ప్రభుత్వ తంతు అని దుయ్యబట్టారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కోసం పని చేస్తున్నాయని, వీరి విధానాలపై వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు సాగాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు మాట్లాడుతూ భారతదేశంలో మొదటి విద్యుత్ సంస్కరణల ప్రయోగశాల ఆంధ్రప్రదేశ్ అన్నారు. 25 ఏళ్ల క్రితం 9 వాపమక్ష పార్టీలు చేపట్టిన పోరాటం ఫలితంగా 20 ఏళ్ల పాటు విద్యుత్ జోలికి ఏ ప్రభుత్వం పోలేదని, ఇప్పుడు మళ్లీ అదే చరిత్ర పునరావృతం అవుతుందని గుర్తు చేశారు. సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు రకాల విద్యుత్ భారాలు మోపిందని , ప్రజలను దోచుకోవడమే అజెండా అని ఆరోపించారు. తొలుత సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే మాబు నేతృత్వంలో మరో విద్యుత్ ఉద్యమం చేపట్టాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాసులు, నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్‌ఏ సలార్, సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రమేష్, జిల్లా కమిటీ సభ్యులు వి.బాల కోటయ్య, కే.రమాదేవి, సీనియర్ నాయకులు పమిడి వెంకటరావు, సీపీఐ ఎంఎల్ నాయకులు ఎస్ లలిత కుమారి, న్యూ డెమోక్రసీ నాయకులు బి.పద్మ, ఎల్.రాజశేఖర్, సీపీఎం నాయకులు జి.శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులే సమస్యను జటిలం చేశారు : మాజీమంత్రి సురేష్

**కొండపి, ప్రభాతవార్త**

సమస్యను పరిష్కరించాల్సిన పోలీసులే గ్రామంలో నెలకొన్న చిన్న సమస్యను జటిలం చేసి గ్రామంలో అలజడి సృష్టించారని వైఎస్ఆర్సిపి కొండపి నియోజకవర్గం కన్వీనర్ మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆరోపించారు. కొండపి మండలం జాలపాలెంలో వివాదాస్పదంగా మారి కోర్టు విచారణలో ఉన్న రచ్చబండ సమస్యను కొండపి పోలీసులు మంగళవారం రాత్రి తొలగించే క్రమంలో గ్రామస్తులపై వాటి చార్జీకి పాల్పడ్డారని ఆరోపిస్తూ ఆదిమూలపు సురేష్ గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. విలేకరులు సమావేశం ముందుగా లాటి చార్జీలో దెబ్బలు తగిలిన బాధితులను



పరామర్శించి అనంతరం సమావేశంలో మాట్లాడారు. గ్రామంలోని ఉమ్మడి స్థలంలో ఉన్న వేప చెట్టు వద్ద రచ్చబండ అరుగు ఏర్పాటు చేసుకొని గ్రామస్తులు వినియోగించు కుంటు న్నారన్నారు. గ్రామంలో ఇరు వర్గీల మధ్య తలెత్తున వివా దాల మధ్య రచ్చబండ స్థలం తమదేనంటూ అరుగు తొలగించేందుకు ఒక వర్గం వారు ప్రయత్నాలు జరుపగా రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు ఆ సమస్యను రెవెన్యూ కోర్టులో విచారణలో ఉంది అన్నారు. ఒక వర్గం గారికి కొమ్ముకాసిన పోలీసులు మంగళవారం రాత్రి అధిక స్థాయిలో పోలీసులు గ్రామంలో మొహరించి గ్రామస్థులను భయభ్రాంతులకు గురిచేసి రచ్చబండను తొలగించారని అడ్డువచ్చిన మహిళలపై లాఠీ చార్జ్ చేశారని ఆయన మండిపడ్డారు. ఈ ఘటనకు పోలీసులు బాధ్యత వహించి సమాధానం చెప్పాలని ఆయన అన్నారు. విలేకరులు సమావేశంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర నాయకులు డాకా పిచ్చిరెడ్డి, మండల నాయకులు బచ్చల కోటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ, వేముల రమేష్, మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండవ మాల కొండయ్య చౌదరి, మండలం నాయకులు పాల్గొన్నారు

## పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు ఎప్పుడు గుర్తింపు ఉంటుంది: ఎమ్మెల్యే కందుల

**మార్కాపురం ఆగస్టు 28 ప్రభాతవార్త**



పార్టీ అభివృద్ధి కోసం క్రియా శీలకంగా పని చేసే కార్యకర్తలకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి అన్నారు, గురువారం ఆయన జవహర్ నగర్ కాలనీలోని ఆయన స్వగృహంలో కార్యకర్తలతో సమావేశం అయ్యారు, తెలుగుదేశం పార్టీ విజయానికి, పార్టీ అభివృద్ధికి అహర్నిశలు పనిచేసిన దొడ్డ దుర్గేశ్ రెడ్డికి పట్టణ తెలుగు యువత అధ్యక్షులుగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు మరువదని కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిపక్షాల ఎత్తుగడలను తిప్పి కొట్టాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల పిలుపునిచ్చారు, మార్కాపురం పట్టణ తెలుగు యువత అధ్యక్షుడిగా నియమింపబడ్డ దొడ్డ దుర్గేశ్ రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతను అప్పగించినారని భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పార్టీ అభివృద్ధికోసం పనిచేస్తానని అన్నారు, ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎం వెంకటరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు ఇబ్రహీం ఖాన్, మాజీ అధ్యక్షుడు డాక్టర్ మోలాలి, కందుల రామిరెడ్డి, తాళ్లపల్లి సత్యనారాయణ, సీనియర్ నాయకులు గుంటక సుబ్బారెడ్డి, కనిగిరి బాల వెంకటరమణ, ముస్లిం యూత్ నాయకులు నూరుల్లా, మైనార్టీ నాయకులు షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# సేనతో సేనాని.. మున్నాళ్లు ముచ్చటేనా..?

**ఒంగోలు, ప్రభాతవార్త**

జనసేన అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టిన ఆనవాళ్లు అరుదే. ఈ నేపథ్యంలో గురువారం ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో సమావేశం నిర్వహించారు. విశాఖ కేంద్రంగా సేనతో సేనాని అనే పేరుతో జనసేన పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఈనెల 30తో ముగిననున్నది. ఈ కార్యక్రమం తొలి రోజు పవన్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సమావేశం కానున్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయడం, ప్రభుత్వ పని తీరు, ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన సూచనలు వంటి అంశాలు చర్చించనున్నారు. ఇక మరుసటి రోజు సుమారు వివిధ విభాగాల యువతతో సమావేశమై రాజకీయాల్లో యువత పాత్ర, అభివృద్ధి ఉద్యోగాల కల్పనా వంటి ఇతరత్రా అంశాల మీద చర్చ జరగనుంది. జనసేనకు ఉన్న బలం, బలహీనత రెండు యువతే కావడంతో వారికి పార్టీ అధిష్టానం నుంచి సరైన రాజకీయ గైడెన్స్ తప్పనిసరి. ఇక చివరి రోజు బహిరంగ సభ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి పవన్ ప్రసంగించనున్నారు. అయితే 2024 ఎన్నికల్లో 100శాతం స్ట్రైక్ రేట్‌తో పోటీ చేసిన 21 కి 21 నెగ్గినప్పటికి పార్టీ నాటి నుంచి నేటి వరకు అదే స్థాయిలో ఉండిపోయింది. ఉప ముఖ్యమంత్రి నుంచి ఐదు శాఖల మంత్రిగా పవన్, పౌర సరఫరాల శాఖ మంత్రిగా నాదెండ్ల సినిమాటోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రిగా కందుల దుర్గేష్ కూటమి ప్రభుత్వంలో భాగమైనప్పటికి క్షేత్ర స్థాయిలో జనసేన పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉండిపోయింది. అటు సినిమాలు ఇటు పాలన అంటూ పవన్ పార్టీ కార్యక్రమాల పై శ్రద్ద పెట్టకపోవడం క్షేత్ర స్థాయిలో పార్టీకి నాయకులను తయారు చేయలేకపోయింది. పార్టీ స్థాపించిన నాటి నుంచి నేటి వరకు జనసేన వన్ మాన్ షో మాదిరి వన్ అండ్ ఎన్లీ పవన్ అన్నట్టుగానే సాగుతుంది. ఇదే జనసేనకు బలమైన నాయకత్వాన్ని దూరం చేస్తూ వస్తుంది. క్షేత్ర స్థాయిలో పార్టీ కోసం పని చేసే జనసేన అభిమానులు ఉన్నప్పటికి ఆ అభిమాని , పార్టీ మీద ప్రేమను అధికారం వైపు తీసుకెళ్లే నాయకత్వం లేకపోవడం మొదటి నుంచి జనసేనను వెనక్కిలాగుతుంది. ఇటు పార్టీలో నెంబర్ 2 గా భావించే నాదెండ్ల సైతం మంత్రిగా ఉండడంతో పార్టీ బలోపేతంపై పెద్దగా దృష్టి సారించలేక పోతున్నారు. ఇక పవన్ అన్న నాగబాబు ఎమ్మెల్సీగా ఉన్నప్పటికి పార్టీ వ్యవహారాల విషయంలో అంత చురుకుగా వ్యవహారించకపోవడం, ఎక్కువగా హైదరాబాద్‌కే పరిమితం కావడం వంటి అంశాలు జనసేన బలోపేతం కాలేకపోవడానికి కారణాలుగా పేర్కొనవచ్చు. ఏ పార్టీ మనుగడకైనా పార్టీ కార్యకర్తల నుంచి కింది స్థాయి, జిల్లా, ప్రాంత, రాష్ట్ర ఇలా అంచలంచలుగా బలమైన నాయకత్వం ఉండాలి.




అప్పుడే ఆ పార్టీ రాజకీయంగా బలపడుతుంది. ఎన్ని ఒడిదుడుకులనైనా తట్టుకోగలుగుతుంది. అటు ప్రభుత్వాన్ని ఇటు పార్టీని రెండిటి సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లగల సమర్ధవంతమైన నాయకులు జనసేనకు అవసరం. రాష్ట్రంలో జనసేన గెలిచిన స్థానాలలో సైతం పార్టీ పరిస్థితిలో ఎటువంటి మెరుగుదల కనిపించకపోవడం ఆ పార్టీ అభిమానులను కలవర పెడుతుంది. ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా గెలిచిన జనసేన నాయకులు సైతం పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టలేకపోతున్నారు. ప్రభుత్వంలో భాగంగా ఇటు ప్రజలకు అందుబాటులో ఉంటూనే అటూ పార్టీ పరంగా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు పవన్ భరోసాగా నిలబడాలి. పార్టీ అధికారంలో ఉన్న ఇటువంటి సానుకూల సమయంలోనే పార్టీ తనకు పట్టున్న ప్రాంతంలో పార్టీని మరింత బలోపేతం చేసుకోగల్గాలి. అలాగే ఇతర ప్రాంతాలలో సైతం పట్టు కోసం బలమైన నాయకులను తయారు చేసుకోగలగాలి. సభలకు వచ్చే జనసమూహంతో పవన్ కొత్తగా నిరూపించుకోవాల్సిందిగా ఏమి లేదు. అయితే ఆ సమూహాన్ని లక్ష్యం వైపు నడిపే నాయకులను పవన్ సిద్ధం చేసుకోవాలి. సభలు, సమావేశాలు అంటూ విశాఖలో జరగబోయే మూడు రోజుల కార్యక్రమాలు జనసేనకు మూన్నాళ్ళ ముచ్చటగా కాకుండా రానున్న మూడేళ్ళ పార్టీ భవిష్యత్‌గా మార్చగలగాలి.

# చంద్రన్న పచ్చదనం కార్యక్రమం






**దొనకొండ,ఆగస్టు 28,ప్రభాతవార్త**
గొట్టిపాటిలక్ష్మి, లలిత్‌సాగర్ ఆదేశాలతో, గురువు గారు అచ్చెన్నాయుడు గారి ఆసీసుల తో, దొనకొండ మండలం,వడమర వెంకట పురం గ్రామంలో స్కూల్ నందు హెడ్ మాస్టర్ డి.వీరాంజనేయులు ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రకాశంజిల్లా మాజీ లీగల్‌సెల్ అధ్యక్షుడు పరిటాల సురేష్ .ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లలందరూ గ్రీన్స్ లీడర్ గా ఎదగాలి అని , ప్రకృతి చెట్లు పర్యావరణ కు తొలి మెట్లు పిల్లలతో అన్నారు. కరోనా సమయంలో ఆక్సీజన్ అందక చాలా మంది చనిపోయినారు అని,అదే మణి ఇంటి ఆవరణలో చెట్లు ఉంటే ఆక్సిజన్ అందేది అని వివరించారు.చెట్లు పెంచడం వల్ల కాయలు పండ్లు, నీడ అన్ని దొరుకుతాయి అని సురేష్ అన్నారు.పుట్టిన రోజు సందర్భంగా అందరూ కలిసి మొక్కలు నాటడం మంచిది అని అన్నారు..ఎండలు విపరీతంగా ఉన్నాయని దానికి కారణం అటవీ శాతం తగ్గడమే అని సురేష్‌అన్నారు.. ఈ కార్యక్రమంలో టీచర్స్ వెంకట రెడ్డి,లక్ష్మీ ప్రసన్న,తోట శ్రీనివాసులు, అంకయ్య పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం



**దొనకొండ,ఆగస్టు 28,ప్రభాతవార్త**
వద్దిపాడు,సంగాపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 1. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గారు మాట్లాడుతూ పత్తి మరియు కంది పంటలలో తీసుకోవలసిన సస్య రక్షణ చర్యల గురించి రైతులకు వివరించడం జరిగినది. 2. మండల వ్యవసాయ అధికారి వారు మాట్లాడుతూ పంట వేసిన రైతులందరు అందరూ ఖచ్చితంగా epanta నమోదుకు మీ యొక్క గ్రామ వ్యవసాయ సహాయకులతో చేపించుకోవలని తెలిపారు. 3. యూరియా ను అధిక ధరలకు అమ్మితే ఎరువుల షాపు వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపినారు.

## ఘనంగా వినాయక చవితి పర్వదిన వేడుకలు



**బల్లికురవ, ఆగస్టు 28, ప్రభాతవార్త**
వినాయక చవితి పర్వదిన వేడుకలు వాడవాడలా గణనాధుని ఘనంగా కీర్తిస్తూ అత్యంత వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. బుధవారం ప్రారంభమైన ఈ వేడుకలు నవరాత్రుల నిర్వహణలో భాగంగా వినాయక మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. బల్లికురవ వరసిద్ధి వినాయక స్వామి దేవాలయంలో వేకువజాము నుండి ప్రత్యేక అభిషేకాలు కొనసాగాయి. స్వామి వారి దర్శనార్థం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా వేద పండితులు ఇంకొల్లు సుధీర్ శర్మ మాట్లాడుతూ సృష్టికి కారకుడు పరమేశ్వరుడు ఆయన శక్తి ప్రకృతి ఈ రెండింటి సమన్వయ తత్వం గణేష్ ఆకృతిలో వ్యక్తం అవుతుందని అన్నారు. శరీరం శక్తిమయం శిరస్సు శివమయం పరశివుడు ఇచ్చిన తల, గౌరీదేవి కల్పించిన తనువు , రెండు కలిసి శివశక్తి ఆకృతిగా గణపతి అభివ్యక్తమయ్యాడని పేర్కొన్నారు. గణపతి నాభి బ్రహ్మరూపమని, ముఖం విష్ణు రూపమని, నేత్రాలు శివరూపమని, ఎడమ భాగం శక్తి రూపమని, కుడిభాగం సూర్య రూపం అని వివరించారు. సకల దేవతల సమిష్టి రూపంగా గణనాధుడు వినాయక చవితి పర్వదినం వేళ మండపాలలో కొలువుతీరుతాడని వివరించారు. గణనాథుడిని సేవిస్తే సకల దేవతలను పూజించినట్లేనని వివరించారు.

## మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం



**వెలిగండ్ల, ఆగస్టు 28, ప్రభాతవార్త**
జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు ప్రతి బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన మండలంలో సమావేశం నిర్వహించడంలో భాగంగా బుధవారం వినాయక చవితి సెలవు కావడంతో గురువారం మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీఓ షేక్ మహబూబ్ భాషా అధ్యక్షతన మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో మండలంలో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న పనుల పనితీరు గురించి చర్చించడం జరిగింది. క్లాప్ మిత్రాల శాలరీలు, పారిశుద్ధ్యం, గ్రామాల్లో తాగునీరు ఉపాధి హామీ పనితీరు తదితర విషయాలపై సమావేశంలో చర్చించడం జరిగింది. ఉపాధిహామీ పథకంలో భాగంగా పండ్ల తోటలకు ప్రభుత్వ అవకాశం ఇచ్చిందని ఈ అవకాశాన్ని రైతులకు తెలియజేసి వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి షేక్ మహబూబ్‌భాషా, డిప్యూటీ ఎంపీడీఓ ఒంగోలు అన్నమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పవన్‌కుమార్, పంచాయతీ రాజ్ ఏఈ బ్రహ్మయ్య, వెలుగు ఏపీఎం జీవరత్నం, వెలుగు సీసీలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ పరిరక్షణ యాత్ర సన్నాహక ర్యాలీ




**మార్టూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
మార్టూరులో రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు సన్నాహకగా ర్యాలీ, మాలల ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. భారీగా మహిళలు, యువకులు పాల్గొన్న ఈ యాత్రలో మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దాసరి చెన్నకేశవులు పాల్గొన్నారు. దీనికి మాల సంఘాల జేఏసీ అధ్యక్షులు మైలా నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక సుప్రీం కోర్టు తీర్పు వ్యతిరేక ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం అని చెప్పారు. దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ 42 లక్షలు ఓట్లున్న మాలలను వాడుకొని వదిలేస్తున్న ప్రభుత్వాలకు రాజకీయ పార్టీలకు తోటుతోనే తగిన బుద్ది చెప్తాము అన్నారు. వర్గీకరణ బిల్లు వెనక్కి తీసుకోకపోతే కూటమి ప్రభుత్వ పతనంఖాయమన్నారు. ఇందులో మాలఉద్యోగుల సంఘం రాష్ట్రకార్యదర్శి వేండ్రపాటి శ్రీనివాసరావు, క్రాంతి, శ్రీదేవి, పర్చూరు ఇన్‌ఛార్జ్ గ్యారా స్వరాజ్, కూరాకుల ఇసాక్ బాబు, ఉలస గాంధీ, దోప్పలపూడి ఆశీర్వాదం, గొట్టిపాటి రవి, నూకతోటి జాను, చిన్న జాగర్లమూడి యందు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ జంపని వీరయ్య, పులిపాటి సుబ్బారావు, బోస్‌బాబు, రోశయ్య, భరత్ కుమార్, జట్టి ఖాజావలి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలను పరిశీలించిన ఎంఈఓలు



**మార్టూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
మార్టూరు మండలం రాజుగారిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖాధికారి ఎంసీహెచ్ వస్త్రామ్ నాయక్ సందర్శించగా, కోనంకి గ్రామం సమతానగర్‌లోని ప్రాథమిక పాఠశాలను కే.ప్రేమలత సందర్శించారు. మొదటిగా పాఠశాలలోని మౌలిక వసతులను, విద్యార్థులకుప్రభుత్వం నిర్వహించిన సెల్ఫ్ అసిస్మెంట్61 పరీక్షల విధానాన్ని అనుసరించి విద్యార్థులు వ్రాచిన బుక్లెట్స్‌ను, విద్యార్థుల యొక్క సామర్థ్యాలను పరిశీలన చేశారు. పాఠశాలలోని తరగతి గదులను కూడా పరిశీలించి ప్రస్తుత వర్షాల దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి ఆయాల సహకారంతో టీచర్స్ విద్యార్థులను వరుస క్రమంలో కూర్చోబెట్టి మాత్రమే భోజనం వడ్డించాలని, ప్లేట్‌తో విద్యార్థులను నిలవబెట్టి భోజనం వడ్డించరాదని ఆదేశించి, నాణ్యమైనటువంటి వేడిగా ఉన్న భోజనాన్ని మాత్రమే పిల్లలకు అందించాలని మధ్యాహ్న భోజనం ఏజెన్సీ వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ జి.రమేష్ పాల్గొన్నారు.

### వినాయక చవితి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కదిరి కుటుంబ సభ్యులు



**సీఎస్‌పురం, ఆగస్టు 28, ప్రభాతవార్త**
వినాయక చవితి పండుగ సందర్భంగా కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు ఆయన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి వినాయక చవితి పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొని గణనాధునిని దర్శించుకొని పూజలు చేశారు.

# దోర్నాల శ్రీశివ బాలాజీ ట్రేడర్స్‌లో దొంగతనం

### - సీసీ కెమెరా వైర్లు కట్ చేసి రూ.90 వేలు నగదు చోరీ







**పెద్దదోర్నాల, ఆగస్టు 28, ప్రభాతవార్త**
పెద్దదోర్నాలలోని శ్రీ శివ బాలాజీ ట్రేడర్స్‌లో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. కర్నూలు - గుంటూరు జాతీయ రహదారి గ్రామ సచివాలయం-3 సమీపాన ఉన్న శ్రీ శివ బాలాజీ ట్రేడర్స్‌లో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి షట్టర్ పగలగొట్టి లోపల కౌంటర్‌లో ఉన్న 90 వేల రూపాయలు అపహరించారు. దుకాణంలో అమర్చిన సీసీ కెమెరా వైర్లను కట్ చేసి భద్రత వ్యవస్థను నిర్వీర్యం చేసిన దొంగలు షట్టర్ పగలగొట్టి, లేదా మరో నకిలీ తాళంతోనైనా షట్టర్ తీసి లోపలికి ప్రవేశించి టేబుల్ డ్రాయర్‌లో ఉన్న నగదును అపహరించు ఉండవచ్చునని భావిస్తున్నారు. షాపు యజమాని పల్లా వెంకటేశ్వర్లు ఉదయాన్నే షాపు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీం ఆధ్వర్యంలో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి ఎస్సై వి.మహేష్ దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై వి.మహేష్ మాట్లాడుతూ దుకాణంలో జరిగిన చోరీపై కేసు నమోదు చేశాం. దొంగలను త్వరలో పట్టుకుంటాం. అన్ని కోణాలలో దర్యాప్తు సాగుతోంది. వ్యాపారులు తమ దుకాణాలలో భద్రత చర్యలు మరింత బలోపేతం చేసుకోవాలి. పట్టణ శివారు షాపులలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉంటాయి. 20 వేలకు మించి షాపులలో నగదు ఉంచరాదని తెలిపారు. పట్టణంలో కొత్త వ్యక్తులు లేదా అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తుల సంచారం ఉంటే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### పోలీసుస్టేషన్లో భక్తిశ్రద్ధలతో గణనాధునికి మొదటి పూజలు, మొదటి నిమజ్జనం



**పెద్దదోర్నాల, ఆగస్టు 28, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల పోలీసు స్టేషన్లో ఎస్సై వి.మహేష్ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు గణనాథుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పూజారి బీదరే రామ్ ప్రసాద్ వర్మ మంత్రోచ్చరణలతో పూజలు జరిపి పోలీసు సిబ్బంది అంతా గణనాధుని ఆశీస్సులు పొందారు. చరిత్రలో దోర్నాల పోలీసు స్టేషన్లో గణేష్ విగ్రహ ప్రతిష్ఠ తొలిసారి చేసి భక్తి భావాలు చాటారు. మండలంలోనే మొట్టమొదటి నిమజ్జనంగా నిలిచింది. వినాయకుడు విఘ్నాలను తొలగించే దేవుడు ప్రజలందరికి శాంతి సౌఖ్యాలు కలగాలని ఎస్సై వి.మహేష్ ప్రార్థించారు. పోలీసు స్టేషన్ ప్రాంగణం పండుగ వాతావరణంలో కళకళలాడింది. మంగళ వాయిద్యాలతో గణనాధుని ఆరాధన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం గణేష్ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి గంటవానిపల్లె చెరువులో నిమజ్జనం చేశారు. దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ జరిగే పోలీసు స్టేషన్‌లో భక్తి భావాలతో ఏ కొద్ది సేపు ఆధ్యాత్మిక వాతావరణం కల్పించిన ఎస్సై వి.మహేష్‌ను సెహభాష్ పోలీసు అంటూ మండల ప్రజలు అభినందిస్తున్నారు.

# మండపాలలో కొలువుదీరిన గణనాధులు

### - పల్లెలు పట్టణాల్లో ఆరంభమైన వినాయక చవితి వేడుకలు



**పెద్దదోర్నాల, ఆగస్టు 28, ప్రభాతవార్త**
మండల కేంద్రమైన పెద్దదోర్నాల పట్టణం, గ్రామాలలోని మండపాల్లో గణనాధులు కొలువు దీరారు. వినాయక చవితి వేడుకలు బుధవారం నుండి భక్తిశ్రద్ధలతో ఆరంభమయ్యాయి. గణనాధులు విభిన్న ఆకారాలు రూపాల్లో శిల్పకారుల ప్రతిభకు అద్దం పట్టేలా మండపాలలో కొలువుదీరారు. పెద్దదోర్నాల పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో వీధుల్లో మండపాలు రంగరంగుల పందిరులతో విద్యుత్ దీపాల అలంకరించి కనుల పండుగగా తీర్చిదిద్దబడ్డాయి. భక్తులు కుటుంబ సమేతంగా గణనాధులను దర్శించి పూజలు నిర్వహిస్తున్నారు. పండితుల వేదమంత్రాలతో ప్రత్యేక హోమార్చనలు చేస్తూ గణపతిని ప్రసన్నం చేసుకుంటున్నారు. గణపతి అష్టోత్తర శతనామావళి పఠనాలతో మండపాలు మార్మోగుతున్నాయి. మహాగణపతి, సింహగణపతి, మూషిక వాహనుడు, విశ్వవినాయకుడు వంటి విభిన్న శిల్పాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. మొత్తం మీద గణనాధులు మండపాలలో కొలువుదీరడంతో ఊరంతా భక్తిశ్రద్ధలతో కళకళలాడుతుంది.

# ఘనంగా వినాయక చవితి వేడుకలు



**కొనకనమిట్ల, ఆగస్టు 28, ప్రభాతవార్త**
మండలంలో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం కొనకనమిట్లలోని హరిజనవాడ, స్టేషన్‌పల్లి, శివాలయం, రెడ్డిగుంట రోడ్డు వద్ద వినాయక విగ్రహాలను ప్రత్యేక మండపాల్లో ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెద్దారికట్ల, గొట్లగట్టు, చిన్నారి కట్ల, మునగపాడు, చింతకుంట్ల, సిద్ధవరం, నాగిరెడ్డిపల్లి గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. పాత పాటలు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం మండపం వద్ద జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీతో పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమాలు నిర్వహించారు.

### ముప్పళ్లపాడు పీఏసీఎస్ అధ్యక్షులుగా కుందూరు నారాయణరెడ్డి బాధ్యతలు స్వీకరణ

### - సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తా - కుందూరు నారాయణ రెడ్డి



**హనుమంతునిపాడు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలం ముప్పళ్లపాడు పీఏసీస్ అధ్యక్షులుగా కుందూరు నారాయణరెడ్డి, సింగిల్ విండో డైరక్టర్లుగా కూరాకు బాల నారాయణ, వేసిపోగు రాజేష్‌లు గురువారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కుందూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం ఇచ్చిన కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి, మండల తెలుగుదేశ ంపార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని వాటిని రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. మండల ప్రజలకు రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తన వంతు సహాయస హకారాలు అందిస్తానని సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అర్హత ఉన్న రైతులకు రుణాలు మంజూరు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి తండ్రి ముక్కు నరసారెడ్డి, కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి పాల్గొని రైతులకు, కార్యకర్తలకు పలు విషయాలపై అవగాహన కల్పించి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షుడుని, డైరక్టర్లని శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మురారి నరసయ్య, ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు ఆకుపాటి వెంకటరావు, ఏఎంసీ డైరక్టర్లు గాయం కృష్ణారెడ్డి, కూడలి రోశయ్య, మండల పార్టీ ఉపాధ్యక్షులు చావలి వెంకటేశ్వర్లు, మండల యూనిట్ కన్వీనర్ దేవిరెడ్డి రాజారామిరెడ్డి, సీనియర్ నాయకులు కోటపాటి శేషయ్య, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి ముర్వా రంగ సాయి యాదవ్, నందనవనం నీటి సంఘం అధ్యక్షుడు పెన్నా గురవయ్య, గంగిరెడ్డి రమేష్‌రెడ్డి, రెడ్డెం తిరుపతిరెడ్డి, దొడ్డి చింతల సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, కనిగిరి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాలసాని కోటయ్య, కత్తి తిరుపాలు , గాయం రామిరెడ్డి, కూడలి దశరథ, చీకటి వెంకట సుబ్బయ్య, ఎం.గంగరాజు, పెంచికల రామకృష్ణ, యలనాటి చిన్న కోటయ్య, రైతులు, సొసైటీ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పలువురు సీనియర్ నాయకులను కలిసిన

## స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి



**హనుమంతునిపాడు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి గురువారం దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, జిల్లా జడ్పీచైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, సీనియర్ నాయకులు జంకే వెంకట్‌రెడ్డి, మార్కాపురం ఇన్‌ఛార్జ్ అన్నా రాంబాబులను మర్యాదపూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి పార్టీ పురోగతి కొరకు అన్ని విధాలుగా సమిష్టిగా కృషిచేయాలని, జగన్‌మోహన్‌రెడ్డిని మరలాఅధికారంలోకి తీసుకు రావడానికి పలు సూచనలు ఇవ్వడం జరిగిందని చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు.

## వినాయక మండప కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి






**పొన్నలూరు, ఆగస్టు28,ప్రభాతవార్త**
వినాయక చవితి సందర్భంగా మండలం లోని గ్రామాలలో ఏర్పాటుచేసిన వినాయకుని మండపాల వద్ద కమిటీ సభ్యులు అప్రమత్తం గా ఉండి ఎటువంటి ఉద్రిక్తతలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ కోరారు. వార్షిక తనిఖీలలో భాగంగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించి, రికార్డుల నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం లో ఏర్పాటు చేసుకున్న మండపాల వద్ద ఎటువంటి ఉద్రిక్తలు, అవాంఛనీయ సంఘటన లు జరిగినా కమిటీ సభ్యులదే పూర్తి బాధ్యతని అటువంటి చర్యల పట్ల కమిటీ సభ్యులపై కేసులు కూడా నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరుతూ గతంలో అవాంఛనీయ సంఘటనలు జరిగిన గ్రామాలలో ఈ ఏడాది వినాయక మండపాలకు అనుమతిని ఇవ్వలేదని ఆయన గుర్తు చేశారు. వినాయక చవితి ఊరేగింపు కార్యక్రమాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తగా చూసుకోవాలని శాంతిభద్రతలకు ఆటంకం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షి ంచవద్దని ఆదేశించారు. ముందుగా ఆయన స్టేషన్‌పరిసరాలను పరిశీలించి, ఆవరణలో మొక్కను నాటారు. సిబ్బంది యొక్క యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మహిళా పోలీసులతో సమావేశమై వారి యొక్క విధి వివరాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో కొండేపి సీఐ జి సోమశేఖర్ ఎస్సై అనుక్ పోలీసులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనాల ఊరేగింపులకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

### - శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు
### - పాకల సముద్ర తీరంలో నిమజ్జనాలకు ప్రత్యేక ఏర్పాట్లు
### - ప్రజలు పోలీసులకు సహకరించాలి



**సింగరాయకొండ, ఆగస్టు 28,ప్రభాతవార్త**
వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని మండల వ్యాప్తంగా జరిగే గణనాధుల నిమజ్జనాలు ఊరేగింపు శాంతియుతంగా, ప్రశాంతంగా పూర్తయ్యేలా అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టాలని ఒంగోలు డీఎస్పీరాయపాటిశ్రీనివాసరావు పోలీసులనుఆదేశించారు. సింగరాయకొండ సర్కిల్ కార్యాలయం లో బుధవారం రాత్రి సర్కిల్ పరిధిలోని పోలీస్ అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ, కందుకూరు, కొండేపి, టంగుటూరు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో గణనాధవిగ్రహాలను పాకల సముద్రతీరానికి తరలిస్తారని తెలిపారు. ఈ ఊరేగింపులకు తగిన భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని ఆయన ఆదేశించారు. ప్రతి ఊరేగింపు మార్గంలో సిబ్బంది మోహరింపు, సీసీ కెమెరాల పర్యవేక్షణ, నిమజ్జన పాయింట్ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుంపుల నియంత్రణ కోసం అదనపు బలగాలను సిద్ధంగా ఉంచుతున్నట్లు తెలిపారు. ఊరేగింపుల సమయంలో డీజేసౌండ్స్ పరిమితి, అల్లర్లు, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కఠిన నిఘా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు, భక్తులు భద్రతానియమాలు పాటించి, పగలు సమయాలలో మాత్రమే నిమజ్జనాలకు విగ్రహాలను తరలించి, పోలీస్ సూచనలకు సహకరించాలని డీఎస్పీవిజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సింగరాయకొండ సీఐ సి.హెచ్.హాజరత్తయ్య, టంగుటూరు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు, సింగరాయకొండ ఎస్ఐ బి. మహేంద్ర, జరుగుమల్లి ఎస్ఐలు, ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

### పాకల తీరంలో నిమజ్జన ప్రదేశాలను పరిశీలించిన ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు

### - పాకల బీచ్‌లో పోలీసులుకు ప్రత్యేక సూచనలు



సింగరాయకొండసర్కిల్ పరిధిలోగణేష్ నిమజ్జనాల లో ఎలాంటి అంతరాయం లేకుండా, సురక్షితంగా జరిగేలా అన్ని విభాగాలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సూచించారు. గురువారం మండలం లోని పాకల సముద్రతీరాన్ని సందర్శించారు. ముందుగా పాకల సముద్రతీరంలో నిమజ్జన పాయింట్లను సందర్శించి, పై పాకాల బీచ్‌లో ఏర్పాట్లను సమీక్షించారు. నిమజ్జనం జరిగే ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని ఆయన అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అదనపు పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు తెలిపారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో రక్షణ చర్యలు, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్‌లు, బోట్లు తప్పనిసరిగా సిద్ధంగా ఉండాలి అనీ అన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక బృందాలు పనిచేస్తాయని, ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. పాకాలబీచ్‌లో ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించి, పోలీస్ కి అవగాహన కల్పించారు. నిమజ్జనం జరిగే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్షుణ్ణమైన పర్యవేక్షణ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తనిఖీలో సీఐ.హాజ రత్తయ్య, ఎస్ఐ బి. మహేంద్రలు పాల్గొన్నారు.

# ఎరువుల షాపుల తనిఖీ

**దొనకొండ,ఆగస్టు 28,ప్రభాతవార్త**
దొనకొండలోని ఎరువుల షాపులను బి.రమాదేవి తహసీల్దార్ వి.బాలకృష్ణనాయక్ మండల వ్యవసాయ అధికారి గారు మరియు జె. రంగనాయకులు పోలీసుశాఖ హెడ్ constable తనిఖీ చేయడం జరిగినది. ఈ తనిఖీ లో భాగంగా యూరియా స్టాక్స్ ను చెక్ చేయడం జరిగినది, సదరు షాపు యజమానులకు యూరియా ఎక్కువ ధరలకు అమ్మిన మరియు వేరే మండలాలకు తరలించిన చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పడం జరిగినది, అలాగే రైతులతో మాట్లాడి యూరియాను అధిక ధరలకు అమ్మితే సంబంధిత మండల వ్యవసాయ అధికారి వారికి వెంటనే తెలియచేయాలని తెలిపినారు.

## వినాయకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన

### టీడీపీ మండల అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి - రజనీ దంపతులు



**హనుమంతునిపాడు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
వినాయక చవితి పండుగ సందర్భంగా కనిగిరి పట్టణం అర్బన్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం దగ్గర నిర్వహించిన పూజా కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి- రజనీ దంపతులు పాల్గొని గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆది దేవుడు అయినా గణపతి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని, ప్రజలు పాడి పంటలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ గణనాథుని ప్రార్థించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, చీకటి వెంకట సుబ్బయ్య, సుమిత్ర తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాలను సందర్శించిన ఎస్సై మాధవరావు



**హనుమంతునిపాడు, ఆగస్టు 28, ప్రభాతవార్త**
వినాయక చవితి పండుగను అత్యంత భక్తిశ్రద్దలతో ప్రశాంతంగా జరుపు కోవాలని ఎస్సై కే.మాధవ రావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఆయన సందర్శించి ఆయా విగ్రహాల కమిటీ సభ్యులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద ప్రభుత్వ నిబంధనలు పాటించే విధంగా ఆయా మండపాల కమిటీలు బాధ్యతలు వహించాలన్నారు. అదే విధంగా మండపాల వద్ద సౌండ్ డీజేలు వంటివి పెట్టరాదు అన్నారు. రాత్రుల సమయాల్లో విగ్రహాల దగ్గర కనీసం ఒకరు లేదా ఇద్దరైనా ఉండాలని తెలిపారు. అలాగే నిమజ్జనం ఊరేగింపుల సమయంలో మద్యం సేవించడం, శాంతి భద్రతలకు భంగం కలిగించడం అలాంటి వాటికి దూరంగా ఉండాలని అలా కాదని నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, భక్తిశ్రద్దలతో వినాయక నిమజ్జనం కార్యక్రమం నిర్వహించుకోవాలని మండల ప్రజలకు ఆయన సూచించారు. ముందుగా గణనాథుని దర్శించుకుని మండల ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం మత్తులో ఘర్షణ.. ఐదుగురికి గాయాలు

**బల్లికురవ, ఆగస్టు 28, ప్రభాతవార్త**

మండలంలోని కొనిదెన గ్రామంలోని పాత గొడవల నేపధ్యంలో మద్యం మత్తులో బుధవారం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్సై నాగరాజు కథనం ప్రకారం ఎస్సీ కాలనీలో సాయంత్రం 5.30 గంటల సమయంలో గల్లా సంకరయ్య అను వ్యక్తి మద్యం మత్తులో ఉండి, పాత గొడవల నేపధ్యంలో మరో కుటుంబంపై దూషణకు దిగటంతో అక్కడ రెండు వర్గాల వారికి వివాదం చెలరేగింది. దీంతో ఇరు కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో జంఘాలపల్లి కోటేశ్వరరావు, జంఘాలపల్లి శేషు, గెల్ల వెంకటేశ్వర్లు, గెల్ల మల్లేశ్వరి, అనుబాల్లు గాయపడ్డారు. సదరు వివాదం గురించి గెల్ల దేవేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గురువారం ఒంగోలు జీజీహెచ్ నుండి వచ్చిన ఫిర్యాదు మేరకు మరొక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇరువురు వర్గాల మధ్య మరలా ఘర్షణలకు తావు లేకుండా 11 మంది వ్యక్తులపై బైండోవర్ కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై నాగరాజు వివరించారు.

## పుష్పాలంకరణ వేడుకలలో మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి గాయం తిరుపతిరెడ్డి

**హనుమంతునిపాడు, ఆగస్టు 28, ప్రభాతవార్త**



మండల పరిధిలోని హాజీపురం ఎస్సీ కాలనీ నందు గోన డేవిడ్ కుమార్తె పుష్పాలంకరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ గాయం తిరుపతిరెడ్డి పాల్గొని చిన్నారికి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు తాతపూడి బుజ్జి,గాయంసుబ్బారెడ్డి, దంతల ప్రభాకర్, సుధాకర్, దంతల ఏసేబు, మల్లెల కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతలపై అవగాహన కలిగించిన మండల ప్రత్యేక అధికారి

**కొనకనమిట్ల, ఆగస్టు 28, ప్రభాతవార్త**



మండలంలోని కాట్రగుంట గ్రామ సచివాలయంలో మండల ప్రత్యేక అధికారి, ఒంగోలు డ్వామాగుల కార్యాలయం ఏడీ సువర్ణమ్మ ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలలోఇంకుడు గుంతలను నిర్మించుకోవాల్సిందిగా తెలియజేశారు. కాట్రగుంట గ్రామ సచివాలయం తనిఖీ చేయడం జరిగింది.మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఈపీటీఎస్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఏపీవో బులియనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# దొనకొండలో ఎరువుల షాపుల తనిఖీ

**దొనకొండ,ఆగస్టు 28,ప్రభాతవార్త**



దొనకొండలోని ఎరువుల షాపులను బి.రమాదేవి తహశీల్దార్ వి.బాలకృష్ణనాయక్ మండల వ్యవసాయ అధికారి జె.రంగనాయకులు పోలీసుశాఖ హెడ్ constable గారు తనిఖీ చేయడం జరిగినది.ఈ తనిఖీలో భాగంగా యూరియా స్టాక్స్‌ను చెక్ చేయడం జరిగినది, సదరు షాపు యజమానులకు యూరియా ఎక్కువ ధరలకు అమ్మిన మరియు వేరే మండలాలకు తరలించిన వ్యక్తులపైన చర్యలు తీసుకోవడం జరుగు తుందని చెప్పడం జరిగినది. అలాగే రైతులతో మాట్లాడి యూరియాను అధిక ధరలకు అమ్మితే సంబంధిత మండల వ్యవసాయ అధికారి వారికి వెంటనే తెలియచేయాలని తెలిపినారు.

# ఎస్‌వి కన్వెన్షన్‌ను ప్రారంభించిన మంత్రి

**- పాల్గొన్న నరసరావుపేట శాసనసభ్యులు**

**అద్దంకి , ఆగస్టు 28,ప్రభాతవార్త**



అద్దంకి పట్టణంలోని ఒంగోలు రోడ్‌లోగల మధురానగర్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌వి కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబులు గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా యాజమాన్యానికి వారు శుభాకాంక్షలు తెలిపారు. అద్దంకిలో వివిధ కార్యక్రమాలకు ఎస్‌వి కన్వెన్షన్ హాల్ వేదికకావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కన్వెన్షన్ హాల్ యాజమాన్యం, సిబ్బంది, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

# నానో యూరియాతో పంటలకు అధిక మేలు

**అద్దంకి, ఆగస్టు 28, ప్రభాతవార్త**



నానో యూరియా తో పంటలకు మేలు జరుగుతుందని అని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం నాగులపాడు,వేములపాడుగ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ అర లీటరు నానో యూరియా ఒకబస్తా యూరియాతో సమానమని, మామూలు యూరియా వలన భూమిలో పంటలకు మేలు చేసే మంచి సూక్ష్మ జీవులు, వానపాములు చనిపోతాయని అన్నారు. నానో యూరియా పిచికారి చేయడం వలన ఆమందు పంట ఆకులపై పడి సమర్థవంతంగా పనిచేస్తుందని అన్నారు. మందు భూమిపై పడకపోవడం వలన భూమిలో పంటలకు మేలు చేసే జీవులు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. మండలంలో ఎరువుల సంప్రదింపు ఉన్నాయని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.మండలంలో పొగాకు సాగు చేయవద్దని సూచించారు ప్రైవేట్ కంపెనీలు ఇప్పుడు ప్రోత్సహించి తరువాత మొఖం చాటేస్తారని తెలిపారు.కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు చాందిని,వ్యవసాయవిస్తరణ అధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నల్లబర్లీ, పొగాకు పంటలు నిషేధించారు

**జె. పంగులూరు , ఆగస్టు 28, ప్రభాతవార్త**



మండలంలోని ఆరికట్ల వారిపాలెం గ్రామం రైతుసేవ కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి డి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ 2025 – 2026 సంవత్సరానికి తెల్లబర్లీ, నల్లబర్లీ పొగాకు పంట సాగు మరియు నారుమడులు పెంపకం నిషేధం జరిగిందని, రైతు సోదరులు పొగాకు నారుమడిలు గాని,పంట సాగు గాని సాగు చేయవద్దని గాని కౌలుకు తీసుకున్న యెడల రైతు తప్పనిసరిగా గ్రామ రెవెన్యూ అధికారులను కలిసి కౌలుకార్డులు పొందవలెనని, దీనివల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని ఉన్నాయన్నారు. భూసార పరీక్షలు ఆధారంగా ఎరువుల వాడకం మరియు సమగ్ర ఎరువుల యాజమాన్యం పద్ధతులు పాటించి ఆరోగ్యమైన నేలలో మేలైన ఎరువుల వాడకం వలన రైతుపెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చున్నారు. ఈ సమావేశంలో నాయకులు వీరాంజనేయులు, సాయి కృష్ణ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బాధితులకు సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల సతీమణి వసంతలక్ష్మీ**

**మార్కాపురం రూరల్, ఆగస్టు 28, ప్రభాతవార్త**



మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మీ ఇటీవల ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సిఎం సహాయనిధి నుండి వచ్చిన చెక్కులను పట్టణంలోని వివిధ వార్డులలో గురువారం స్వయంగా అందజేశారు. పట్టణంలోని దూదేకుల అబ్దుల్ రెహమాన్,కు రూ.2,57,097లు, నగలపాటి వెంకటరమణకు రూ.15,441లు, గాలి పెద్ద చెన్నారెడ్డికి రూ.67,729లు, కందెపు పుల్లమ్మకు రూ.98,864లు, షేక్ బాదుల్లాకు రూ.22,260లు, పైడిమర్రి శ్రీనివాసులుకు రూ.86,058లు, దేవతి ప్రకాష్‌రావుకు రూ.1,15,386లు, చిన్న మీరావలికి రూ.1,31,595లు, సయ్యద్ సుభానీకి రూ.1,15,536లు, మొత్తం రూ.9,10,066లు విలువగల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుంది

**- అద్దంకి ఇండోర్ క్రీడా కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి గొట్టిపాటి**

**అద్దంకి ,ఆగస్టు 28,ప్రభాతవార్త**



రాష్ట్రంలో క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అర్బన్, సెమీఅర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఔత్సాహిక క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందిస్తుందని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.గురువారం అద్దంకిలోని శింగరకొండ రోడ్‌లో ఏర్పాటు చేసిన హిట్ జోన్ ఇండోర్ క్రీడా కేంద్రాన్ని మంత్రి గొట్టిపాటి ప్రారంభించారు.నెట్ క్రికెట్‌తో సహా, షటిల్, ఇతర ఇండోర్ గేమ్స్ కోసం అత్యాధునిక సదుపాయాలతో తీర్చిదిద్దిన ఈ హిట్ జోన్ సెంటర్‌ను అద్దంకి ప్రజలు, యువతీ యువకులు,క్రీడాకారులు వినియోగించుకోవాలని మంత్రి కోరారు.ఈ కార్యక్రమంలో హిట్ జోన్ నిర్వాహకులు, స్థానిక కూటమి నాయకులు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

**- శంఖుస్థాపనలు నిర్వహించిన మంత్రి గొట్టిపాటి**

**అద్దంకి , ఆగస్టు 28, ప్రభాతవార్త**



మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలతోపాటు ప్రారంభోత్సవాలను రాష్ట్రవిద్యుత్ శాఖమంత్రిగొట్టిపాటి రవికుమార్‌గురువారం నిర్వహించారు . అందులో భాగంగా జార్లపాలెం – చెరువుకొమ్ముపాలెం తారురోడ్డును రూ.కోటి వ్యయంతో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు.అనంతరం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు, అలాగే అద్దంకి – కొణికి రోడ్డు నుంచి దాసుల కాలనీ వరకు రూ.30లక్షల సీసీ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు.అనంతరం 35మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ గత 15 నెలల్లో అభివృద్ధి అంటే ఏంటో కూటమి ప్రభుత్వం చూపించిందని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాలలో కూటమి నేతలతోపాటు ఆశాఖల ఉన్నతాధికారులు, ఆయా గ్రామాల టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం

**- కొరిశపాడు, ఆగస్టు 28,ప్రభాతవార్త**



మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చెరువుకొమ్ముపాలెం గ్రామము నందు క్షయ వ్యాధిపై అవగాహన కలిగించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ హరికృష్ణ క్షయ వ్యాధి లక్షణాలు రెండు వారాలు నుండి దగ్గు రెండు వారాలు నుండి జ్వరం దగ్గినప్పుడుకళ్ళల్లో రక్తం చారలు పడటం ఆకలి మందగించటం బరువు తగ్గిపోవడం లక్షణాలు కలవారు పరీక్షలు చేయించుకోవాలన్నారు. అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రం నందు క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహిస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అద్దంకి క్షయవ్యాధి నివారణ కేంద్ర సూపర్వైజర్ టి.రాజశేఖర్,104 సిబ్బంది పాల్గొనడం జరిగినది.

## విజయవాడ గణపతి పూజలో పాల్గొన్న మంత్రులు

**అద్దంకి , ఆగస్టు 28 ప్రభాతవార్త**



విజయవాడ పశ్చిమ నియోజకవర్గం, సితార సెంటర్ లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు డూండీ రాకేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 72 అడుగుల శ్రీ కార్యసిద్ధి మహాశక్తి మహాగణపతి విగ్రహాన్ని మంత్రులు సందర్శించారు.ఈ సందర్భంగా నిర్వహించిన పూజలలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్,అనగాని సత్యప్రసాద్‌లుపాల్గొన్నారు.ఈ సందర్భంగా మహాశక్తి గణపతికి ప్రత్యేక పూజలు మంత్రులు నిర్వహించారు.

# ఎజిపి బత్తులకు పలువురు అభినందనలు

**అద్దంకి, ఆగస్టు 28, ప్రభాతవార్త**



అద్దంకి ప్రిన్సిపల్ సీనియర్, జూనియర్ సవిల్ జడ్జి న్యాయస్థానాల ఎజిపిగా బత్తుల రామకోటయ్య నియమితులైన విషయం పాఠకులకు విధితమే, ఇది ఇలా వుండగా అద్దంకిలోనే నివాసం వుంటున్న బత్తుల రామకోటయ్య ఎజిపిగా నియమితులైన నేపద్యంలో ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు, పార్టీ నేతలు, పలువురు అధికారులు, ప్రధానంగా అద్దంకి నియోజకవర్గంలోని పట్టణంతోపాటు, 5మండలాలకు చెందిన ముఖ్య నేతలు కూడ రామకోటయ్యను వారి గృహానికి వెళ్ళి అభినందిస్తున్నారు. దమ్ము న్యాయవాదిగా, మంచివక్తగా, ప్రజలందరితో కలుపుగోలుగా వుండే మనస్తత్వం వున్న బత్తుల రామకోటయ్యను పలువురు పూలమాలలతో దుశ్శాలువలతో ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వినాయక చవితి రోజు అద్దంకి నియోజకవర్గంతోపాటు, రాష్ట్రంలోని పలు జిల్లాలో వున్న ఆయన శ్రేయోభిలాషులు, మిత్రులు, పలువురు అధికారులు, అటు స్వయంగా ఇటు సోషల్ మీడియాలోను,ఫోన్‌ల ద్వారా రామకోటయ్యకు అభినందనలు తెలుపుతున్నారు. దీంతోపాటు ఆయన నియామకానికి సహకరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడ కొందరు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.సంతమాగులూరు మండలంలోని పుట్టావారిపాలెం కు చెందిన బత్తుల రామకోటయ్యకు వారి మిత్రబృందం, స్వయంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, అభినందనలు తెలియజేస్తున్నారు. ఏది ఏమైనా ఎజిపిగా నియమితులైన బత్తుల రామకోటయ్య అందరివాడిగా అభినందనలు అందుకోవడం విశేషం.

## వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరులకు ఘన నివాళులు

**త్రిపురాంతకం, ఆగస్టు 28, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరులకు గురువారం ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవెండ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28న తగ్గించాలని చెప్పి హైదరాబాద్ నగరంలో బషీరభాగ్ నుండి ర్యాలీగా వెళ్తున్నటువంటి కామ్రేడ్స్‌పై ఆనాటి టిడిపి ప్రభుత్వం విచక్షణారహితంగా కాల్పులు జరపడం జరిగిందన్నారు. ఇది దుర్మార్గమైన చర్య అని అనాటి బషీర్ బాగ్ అమరవీరులకు త్రిపురాంతకంలో వామపక్షాల ఆధ్వర్యంలో నివాళులర్పించడం జరిగిందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోడీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న డబుల్ ఇంజన్ సర్కార్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించాలని ఈ రోజు ఆగమేఘాలతో ప్రజలపైన భారాలు వేయటానికి సిద్దమవుతుందన్నారు. విద్యుత్ అమరవీరుల సాక్షిగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించకపోతే భవిష్యత్తులో ప్రజలపై కోట్లాదిరూపాయల భారం పడుతుందని కనుక ప్రజాస్వామ్య వాదులు, ప్రజలు అమరవీరుల సాక్షిగా ఈ స్మార్ట్‌మీటర్లు వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లా సిపిఎం నాయకులు బి రఘురామ్ మాట్లాడుతూ గతంలో ఆనాడు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఏదైతే అవలంభించారో అదేవిధంగా నేడు తన నిరంకుశ విధానాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ఆయన విషయంలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. భవిష్యత్తులో ఇదే విధానాన్ని కొనసాగించినట్లయితే ప్రజలను చైతన్యం చేసి పెంచిన విద్యుత్ చార్జీలపై, స్మార్ట్ మీటర్లపై ఉద్యమం చేపడతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ త్రిపురాంతకం మండల కార్యదర్శి దాసరి మల్లిఖార్జున్, సిపిఐ సీనియర్ నాయకులు ఆంజనేయులు, సిపిఎం జిల్లా నాయకులు బి రఘురామ్, సిపిఎం మండలనాయకులు రాజరామయ్య,సిపిఐ నాయకులు గూడూరి నాగేశ్వరరావు,సి.పవన్ కుమార్, ఎస్‌కె ఖాశిం, యువజన నాయకులు రవిచంద్ర, మహేష్, బి కొండలు, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం సందర్భంగా నేడు పాఠశాలలకు సెలవు

**గిద్దలూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త**

వినాయక పర్వదినంలో భాగంగా నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని మండల పరిధిలోని అన్ని మండలపరిషత్ మరియు ఎయిడెడ్ పాఠశాలలకు నేడు శుక్రవారం స్థానిక సెలవును ప్రకటించినట్లు ఎంఈఓ -1, ఎంఈఓ -2లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం వినాయక చవితి సందర్భంగా పట్టణంలో, గ్రామాల్లో విభిన్న సంఘాలు ఘనంగా వేడుకలు నిర్వహించి చివరి రోజున వినాయక నిమజ్జనం చేస్తారు. భారీగా జరిగే ఈ నిమజ్జన కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు రవాణా ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు సెలవు ఇవ్వడం జరిగిందని అధికారులకు వివరించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా గిద్దలూరు పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లో భక్తుల రాకపోకలు అధికంగా ఉంటాయని, పోలీసులు, స్థానిక సంస్థలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠశాలలకు నేడు ఒక రోజు స్థానిక సెలవు ఉండనున్నట్లు స్పష్టం చేశారు.

# రైతన్నల సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వం ధ్యేయం

**- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి**

**గిద్దలూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**



రాష్ట్రంలో రైతన్నల సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వం ధ్యేయమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా మండలంలోని దిగువమెట్ట తండా గ్రామంలో సుమారు రూ.7.60లక్షల నిధులతో ఇంటింటికి కుళాయి మంచినీరు అందించే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని శంఖుస్థాపన చేశారు.అనంతరం వ్యవసాయానికి సంబంధించిన సబ్సిడీ ద్వారా రైతు సంఘాలకు ఇవ్వబడిన డ్రోన్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ రైతు పక్షపాతి అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతాంగ అభివృద్ధి కోసం పాటుపడుతున్నారని, అందులో భాగంగానే రైతు సంఘాలకు 10లక్షల విలువగల డ్రోన్‌ను కేవలం రూ.2లక్షలకే రైతుకు అందించి మిగతా రూ.8లక్షలు ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. గత వైఎస్సార్ ప్రభుత్వంలో వినాయక మండపాలకు విద్యుత్ సరఫరాకు రూ.5వేలు వసూలు చేశారని, తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ప్రతి పండుగకు సంక్షేమం చేకూరే విధంగా వినాయక మండపాలకు రూ.5వేల విలువగల కరెంటు ఉచితంగా ఇస్తున్నామని దీనికోసం 15కోట్ల బడ్జెట్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బైలడుగు బాలయ్య, జడ్‌పిటిసి సభ్యులు బుడత మధుసూధన్, సంజీవరాయునిపేట వ్యవసాయ పరపతి సంఘం ఛైర్మన్ రామసుబ్బయ్య, నాయకులు ప్రతాప్ రెడ్డి, మార్తాల సుబ్బారెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు (ఇన్చార్జి) కె రాజశ్రీ, వ్యవసాయ అధికారులు విజయభాస్కర్ రెడ్డి, మహబూబ్ బాషా, అబ్దుల్ రఫిక్, జక్కం మెర్సి, యూనియన్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ పృధ్వీనాధ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ అనూష, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అమరులైన విద్యుత్ అమరవీరులకు సిపిఎం, సిపిఐ పార్టీల ఘన నివాళులు

**- విద్యుత్ భారాలపై మరో ఉద్యమాన్ని కొనసాగించాలి..**

**- పెంచిన విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించుకోవాలి**

**మార్కాపురం, ఆగస్టు 28, ప్రభాతవార్త**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా 2000సంవత్సరం ఆగస్టు 28న జరిగిన పోరాటంలో అమరులైన విద్యుత్ అమరవీరులకు సిపిఎం, సిపిఐ పార్టీల ఆధ్వర్యంలో స్థానిక కోర్టు సెంటర్ నందు నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లానాయకులు అందెనాసరయ్య,సిపిఎం పట్టణ కార్యదర్శి డికెఎం రఫిలు విద్యుత్ అమరవీరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేయించారు.ఈ ప్రతిజ్ఞలో విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించాలని,విద్యుత్ అమరవీరుల ఆశయాలను సాధిస్తామని,కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడుతామని,విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.అందె నాసరయ్య,డికెఎం రఫిలు మాట్లాడుతూ మోడి, చంద్రబాబు ప్రభుత్వాలు విద్యుత్ చార్జీల బాదుడును తగ్గిస్తామని చెప్పి 14నెలల కాలంలో రూ.15485 కోట్లు భారాలు మోపి ప్రజల నుండి వసూలుచేస్తూ ప్రజలను మోసంచేస్తున్నారని అన్నారు.ప్రస్తుతం మరలా రూ.12,717 కోట్లు భారాలు మోపడానికి రాష్ట్రప్రభుత్వం సిద్దమైందని ప్రజలపై ఈ భారాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని అదాని, ఇతర కార్పోరేటర్లకు అప్పగించడానికి ప్రభుత్వం సిద్దమైందని అన్నారు. విద్యుత్ సంస్కరణలు వెంటనే ఆపివేయాలని, ఉపయోగం లేని సంస్కరణల వలన ప్రజలపైన భారాలు పడటం తప్ప ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ట్రూ ఆప్ సర్ చార్జీల పేరుతో ప్రజల నుండి వసూళ్లను ఆపాలని అన్నారు. నాణ్యమైన విద్యుత్ పేరుతో స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలపై మరో బాదుడుకు సిద్ధమవుతున్నారని అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను, స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు.సిపిఐ ఏరియా కార్యదర్శి ఎస్‌కె ఖాశిం,హరిబాబు,సిపిఎం పట్టణ కమిటీసభ్యులు పి.రూబెన్, ఎస్‌కె నన్నేసా,బి.కాశయ్య,నాని, రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ పోరాట స్పూర్తితో ఆదానీ స్మార్ట్ మీటర్‌పై పోరాటం

**- దర్శిలో వామపక్షాల ప్రతిజ్ఞ కార్యక్రమం**

**దర్శి, ఆగస్టు 28 ప్రభాతవార్త**



ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీల పెంచడానికి వ్యతిరేకంగా 2000 సంవత్సరంలో జరిగిన పోరాటం హైదరాబాద్ బషీర్ బాగ్ లోముగ్గురు పోలీసుల తుపాకి తుటాలకు బలి అయ్యారని ఆ అమరవీరు బలిదానం స్పూర్తితో నేడు వామపక్షాలు ఆదానీ స్మార్ట్ మీటర్లకు, ట్రూఆఫ్ ఛార్జీలకు విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడతామని సీపీఎం దర్శి మండల కార్యదర్శి సందు వెంకటేశ్వరరావు అన్నారు. దర్శి గడియారస్తంభం సెంటర్‌లో అమరవీరులైన బాలస్వామి, ఎస్.రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి చిత్రపటాలకు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు తాండవ రంగారావు, సీపీఐ నాయకులు రాచపూడి కరుణానిధిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జూపల్లి కోటేశ్వరరావు, కేవీ పిచ్చయ్య, ఉప్పు నారాయణ, షేక్ కాలే భాషా, తాండవ లక్ష్మీ, పద్మావతి, సందు రంగమ్మ, చిట్లా ఆదినారాయణ, గర్నిపూడి జూన్, ఎం.యల్లమందారెడ్డి,ఇత్తడి కోటయ్య, రామ్‌కోటిరెడ్డి, ఉప్పుమోహన్‌రావు, అంజిబాబు, గోగు వెంకయ్య, తదితరులు నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు.

## విద్యుత్ అమరవీరుల స్పూర్తితో విద్యుత్ భారాలపై మరో ఉద్యమాన్ని కొనసాగించాలి

**ముండ్లమూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా నాడు 2000 సంవత్సరం ఆగస్టు 28న జరిగినపోరాటంలో అమరులైన విద్యుత్ అమర వీరులకు సీపీఎంపార్టీ ఆధ్వర్యంలో ముండ్లమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నందు నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా సీపీఎంజిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు, సీపీఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు, విద్యుత్ అమరవీరులైన రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంరతం ప్రతిజ్ఞ చేయించారు.ఈ ప్రతిజ్ఞలో విద్యుత్ సంస్కరణలు ఉపసంహరించాలని విద్యుత్ అమరవీరుల ఆశయాలను సాధిస్తామని,కార్పొరేట్ కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడుతామని విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడారు.బోడపాటి హనుమంతరావు, సత్యం, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, హనుమయ్య, తిరుపతయ్య,ఇర్మియా,శ్రీను,ఏలియా,సుబ్బారావు,హనుమంతరావు,తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

**నాగులుప్పలపాడు, ఆగస్టు 28, ప్రభాతవార్త**



నాగులుప్పలపాడు మండల పరిధిలో గల ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల డీలర్స్‌కు ఎఫ్‌సీఓ యాక్ట్ మీద అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలతహశీల్దార్ ప్రవీణ్‌కుమార్,మండల వ్యవసాయాధికారి పి.వెంకటరావు,ఏఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు. తహశీల్దార్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ఎరువుల షాపులు తనిఖీలు కోసం మండల స్థాయిలో టీంని ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ టీం రెగ్యులర్‌గా ఎరువులు షాపులు తనిఖీ చేస్తుందని తెలిపారు. మండల వ్యవసాయాధికారి వెంకటరావు మాట్లాడుతూ ఎరువుల షాపుల యజమానులు తప్పనిసరిగా స్టాక్ రిజిస్టర్‌కి భౌతికంగా నిల్వ ఉన్న స్టాక్‌కి తేడాలు ఉండకూడదని తెలియజేశారు. ఎరువులను ఎమ్మార్పీ రేట్లు కే అమ్మాలని అధిక ధరలకు అమ్మినచో చర్యలు తీసుకుంటారని తెలియజేశారు. ఎవరైనా డీలర్స్ కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే వారిని చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం అని తెలియజేశారు.ప్రతి ఎరువుల దుకాణం బయట స్టాక్,రేట్ల వివరాలను బోర్డు మీద వ్రాసి తెలియజేశారు. ప్రతి రైతు ఎరువుల కొనుగోలు కొరకు వెళ్లేటప్పుడు పట్టాదారు పాస్‌బుక్,ఆధార్‌కార్డు తీసుకెళ్లాలని తెలియజేశారు.తద్వారా మద్దిరాలపాడు, నాగులుప్పలపాడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.

# అట్టహాసంగా టంగుటూరులో కురుగుంట్ల ఆశాలతా

## మెమోరియల్ హాస్పిటల్ ప్రారంభోత్సవం

**- ప్రారంభించిన ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య**

**టంగుటూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని కొండపి రోడ్డులో గల రెండే లోపల నూతనంగా ప్రారంభించబడిన కురుగుంట్ల ఆశాలతా మెమోరియల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ముఖ్య అతిధిగాపాల్గొని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పోతుల నరసింగరావు, మాజీ సర్పంచ్ బెల్లం జయంతిబాబు, గ్రామ నాయకులు పాల్గొన్నారు. నూతన ప్రారంభం సందర్భంగా ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిపుణులైన డాక్టర్లచే మంచి ఆరోగ్యంగా ఉండేందుకు ఆధునిక పరికరాలతో హాస్పిటల్ ఉందని తెలియజేశారు. ఈ వైద్య పరీక్షలు 28 నుండి 31 వరకు ఉచితంగా చూస్తారని అన్నారు.

# రైతులకు రబీసీజన్ పంటలపై అవగాహన

**రాచర్ల, ఆగస్టు 28 ప్రభాతవార్త**

రాబోయే రబీ సీజన్‌లో సాగు చేసే పంటలపైరైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాష గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలం లోని ఎడవల్లి, సత్యవోలు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మహబూబ్ బాష రబీ సీజన్‌లో సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.రబీ సీజన్‌లో రైతులు ఎన్ని ఎకరాల్లో శనగ విత్తనాలు వేయడానికి ఆసక్తి చూపుతున్నారో ముందుగా తమకు తెలియజేయాలని అందుకను గుణంగా వారికి విత్తనాలు తెప్పించేందుకు మందస్తుగా ప్రతి పాదనలు సిద్దం చేస్తామని తెలిపారు. రైతులు భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, విఏఏలు నందిని, రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# బలే బలే.. బాల వినాయకుడు.. మాహీర్‌బాబు

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలోని నారాయణ పాఠశాలలో వినాయక చవితి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణం మొత్తం శ్రీవిగ్రహాలమంగళహారతులు, శ్లోకాలతో మార్మోగింది. విద్యార్థులు గణనాధుని వేషధారణలో పాల్గొని ఇనాయక పూజా కార్యక్రమాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా యూకేజీ చదువుతున్న షేక్ మాహీర్‌బాబు(మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ చిన్న మస్తాన్, కీర్తిశేషులు ముంతాజ్ బేగం ముద్దుల మనవడు, షేక్ మస్తాన్ వలి గారాలపట్టి అయిన కుమారుడు) వినాయకుడి వేషధారణలో అందరిని అలరించారు. ముద్దుగా, బొద్దుగా ఉండే మహీర్ బాబు వినాయక వేషంలో మరింత ఆకర్షణీయంగా కనిపించడంతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆనందపడ్డారు. అతని అమాయకపు చిరునవ్వులు, ముద్దు ముద్దు మాటలు చూసి అందరూ మంత్ర ముగ్ధులయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ వినాయక చవితి పండుగ ద్వారా చిన్నారులలో సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుంది. వేషధారణల ద్వారా వారికి సాంస్కృతిక విలువలు సులభంగా బోధించవచ్చు అని తెలిపారు. ఈ వేడుకల్లో పిల్లలు వినాయక గీతాలు పాడుతూ, చిన్న చిన్న నృత్యాలు చేస్తూ ఉత్సాహపరిచారు. చివరగా వినాయక వేషధారణలో పాల్గొన్న ప్రతి చిన్నారిని అభినందిస్తూ పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. నారాయణ పాఠశాల వినాయక చవితి వేడుకలు కనిగిరి పట్టణంలో అందరి మనసులను దోచుకున్నారు. అందరిలోనూ మహీర్‌బాబు బాల వినాయకుడి వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# వినాయక పూజల్లో ముస్లిం సోదరుల భాగస్వామ్యం

**- సామరస్యానికి ప్రతీక**



**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**

కనిగిరి అమరావతి గ్రౌండ్స్‌లో వినాయక చవితి ఉత్సవాలు భక్తి,ఆధ్యాత్మిక శ్రద్దలతో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలుగుదేశం పార్టీ మహిళలు ప్రజలందరూ విఘ్నాలు తొలగి సుభిక్షం, సంతోషంతో జీవించాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో కనిగిరి మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తూ హారతులు ఇచ్చారు ప్రత్యేక ఆకర్షణగా వినాయక చవితి రెండవ రోజు గురువారం ముస్లిం మైనార్టీ నాయకులు పూజల్లో పాల్గొనడం విశేషం. వారు మాట్లాడుతూ విఘ్నాలను తొలగించి విజయమారం చూపించే గణేశుడు ప్రతి ఇంటికి ఆరోగ్యం, ఐశ్వర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నాం. సమాజంలోని ప్రతి వర్గం ఐకమత్యం, సౌభ్రాతృత్వంతో ముందుకు సాగాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, జిల్లా మైనార్టీ నాయకులు గుడిపాటి ఖాదర్, కనిగిరి ఏఎంసీ డైరక్టర్ బారే మామ్, కనిగిరి అంజుమన్ కమిటీ అధ్యక్షులు షేక్ అహ్మద్, షేక్ రెహమాన్, మస్తాన్‌బాబు, రీటా ఫయాజ్, షేక్ అఖిల్, బుల్లబాలబాబు,షేక్ వాజీదా,ఇస్మాయిల్, చిన్ను,గౌస్‌బాషా, జానీ,నజీముద్దీన్,నాగూర్ వలి తదితరులు స్థానికనాయకులు పాల్గొని వినాయక ఉత్సవాలను సామరస్య వాతావరణంలో మరింత విశిష్టం చేశారు.

# వినాయక చవితి పర్వదినాన దద్దాల నారాయణ ప్రత్యేక పూజలు

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్ పట్టణంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. శివనగర్‌కాలనీ,ఇందిరా కాలనీ, పాత కూచిపూడిపల్లి, రామాలయం, తాళ్లూరి కళ్యాణ మండపంలో విఘ్నేశ్వరుడికి వేద పండితుల సన్నిధిలో పూజలు నిర్వహించి వేదాశీర్వచనం స్వీకరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. గణేష్ కమిటీ సభ్యులు దద్దాల నారాయణ యాదవ్‌ను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించి గణపతి విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపాలిటీ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, కనిగిరి మున్సిపాలిటీ వైసీపీ అధ్యక్షుడు ఎస్వీఎస్ గోవర్ధన్‌రెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఆవుల భాస్కర్‌రెడ్డి, వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ మందాడి కృష్ణారెడ్డి, దర్శి సుబ్రహ్మణ్యం, బచ్చు వెంగళరావు గుప్తా, తడికమళ్ళ వెంకటేశ్వరరావు, శిగా కృష్ణారావు, కంటూ గురవయ్య, కౌన్సిలర్ రామనబోయిన ప్రశాంతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో స్థానిక ప్రజలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వినాయక నవరాత్రులను మరింత విశిష్టంగా మార్చారు.

# వినాయక మండపాలలో ప్రత్యేక పూజలు చేసిన టీడీపీ నాయకులు

**- అభివృద్ధి కార్యక్రమాలకు విఘ్నాలు తొలగాలని ఆకాంక్ష**

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**

వినాయక చవితి పండుగ సందర్భంగా కనిగిరి తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎటువంటి విఘ్నాలు లేకుండా కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలని, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ప్రజలు మరింత శ్రేయస్సు కలగాలని గణపతి ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. కనిగిరి పట్టణంలోని రామాలయం వీధిలో గోనుగుంట గోపాలకృష్ణమూర్తి- అఖిలాండేశ్వరి, గోనుగుంట పవన్ కుమార్, గోనుగుంట సుధీర్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కొత్తూరులో టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి తన సోదరులు, కనిగిరి పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి వినాయకుడి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వినాయక చవితి వేడుకలను మరింత విశిష్టంగా మార్చారు.

# పీఏసీఎస్ అధ్యక్షుడిగా రంగబాబు బాధ్యతలు స్వీకరణ

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**



కనిగిరి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడిగా అద్దంకి రంగబాబు, డైరెక్టర్లుగా షేక్ బాబిమామ్, సుబ్బయ్య గురువారం పీఏసీఎస్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, ఆర్యవైశ్యులు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన సభ్యులు పాల్గొని రంగ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ యారవ రమాదేవి శ్రీనివాసులు,కనిగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి రావిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, కనిగిరి పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ అప్సర్, కోట సురేష్‌బాబు, రిజ్వాన్, కొల్లూరి శ్రీనివాసులు, గుడిపాటి ఖాదర్, బజాజ్ బాలిరెడ్డి, బుల్లు బాలబాబు,ఏఎంసీ డైరెక్టర్ కూడాలి రోశయ్య,రామసుబ్బారెడ్డి,నాగ నజీముద్దీన్, తదితరులు పాల్గొని నూతన అధ్యక్షుడు, డైరెక్టర్లకు అభినందనలు తెలిపారు. అద్దంకి రంగబాబు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి తోడ్పడే నిర్ణయం.నూతనబృందం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ అద్దంకి రంగబాబును సన్మానించిన ఆర్యవైశ్యులు

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**



కనిగిరి ప్రాథమిక సహకార సంఘం సొసైటీ చైర్మన్ అద్దంకి రంగబాబు గురువారం పదవి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో పలువురు ఆర్యవైశ్యులు ఘనంగాసన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.రైతులకు తక్కువ వడ్డీకి పంట రుణాలు ఇప్పి ఆర్థికంగా ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఐవీ నారాయణ, ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొలవర్తి మారుతి కుమార్, శ్రీశ్రీ సాయిబాబా దేవస్థానం అధ్యక్షులు కొప్పరపు సత్యాలు,వెలుగురు చంద్రశేఖర్,కోటసురేష్‌బాబు, రావపూడి వెంకటేశ్వర్లు, ఒబిలి చిన్న, తడికమళ్ల వెంకటేశ్వరరావు, వాసవి సత్ర సమదాయ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, సద్దురు, మామిడి రమేష్, శ్రీరామ్, గోనుగుంట పవన్ కుమార్, విశ్వనాథుని వంశీ, సిహెచ్ వాసు, గొల్ల భాస్కర్, కోట ఆంజనేయులు, కోట రాజా, బుజ్జిబాబు, బచ్చుశ్రీనివాసులు, వాగిచర్ల వెంకటేశ్వర్లు,బచ్చుమహేష్, శ్రీ విజయమార్కండేశ్వర, దేవస్థాన చైర్మన్ గొంట్ల మల్లిఖార్జునరావు, పత్రికా విలేకర్లు, పుర ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# వినాయక మండపాల వద్ద పారిశుధ్యం కార్యక్రమాలు

**కనిగిరి, ఆగష్టు 28, ప్రభాతవార్త**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని వినాయక మండపాల వద్ద ఎటువంటి శానిటేషన్ సమస్యలుతలెత్తకుండా ముందుగానే చర్యలుచేపట్టాలని మున్సిపల్‌కమీషనర్ పి.కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రతి వినాయక మండపం పరిసర ప్రాంతాల్లో ప్రతి రోజు శానిటేషన్ పనులు చేయించడంతో పాటు సున్నం,బ్లీచింగ్ చల్లాలని సంబంధిత శానిటరీ సిబ్బందిని చెప్పడంజరిగింది.నిమజ్జనం పూర్తయ్యేవరకు ఈ చర్యలను నిరంతరంగా కొనసాగించాలనిస్పష్టం చేశారు.

# ఒంటరి వృద్ధ మహిళ హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

**- మూడు లక్షలు విలువైన సొత్తు స్వాధీనం**

**- నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలింపు**

**- కేసులో ప్రతిభ కనబరిచిన పోలీసులను అభినందించిన ఎస్పీ**

**సింగరాయకొండ,ఆగష్టు 28, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని అంబేద్కర్ మూడవ లైన్లో ఈ నెల 23వ తేదిన ఒంటరి వృద్ధ మహిళ చెరుకూరు సుబ్బాయమ్మ హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్దనున్న మూడు లక్షల విలువచేసే బంగారం సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సి.హెచ్ హాజరత్తయ్య తెలిపారు. గురువారం సీఐ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలు ఎస్పి ఏఆర్ దామోదర్ పర్యవేక్షణలో డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో సిఐ సిహెచ్ హాజరత్ అయ్యా ఎస్సై బీ మహేంద్ర తన సిబ్బందితో కలిసి 16వ నెంబర్ జాతీయ రహదారి జరుగుమల్లి అడ్డరోడ్డు, టంగుటూరు వైపు వేళ్ళు అండర్ పాస్ వద్ద ఈ ముగ్గురు నిందితులను గురువారం మధ్యాహ్నం అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.టంగుటూరు మండలం, బుచ్చి రాజుపాలెం చెందిన నత్తల మాధవి భర్త మాధవరావు, కుమారుడు నత్తల మణికంఠ, మధుమాల మాధురి భర్త ఏడుకొండలు అను ముగ్గురు కొంత కాలంగా సింగరాయకొండ పట్టణంలోని సుబ్బరామిరెడ్డి నగర్లో నివసిస్తున్నారు.మాధవి, మాధురిల కుమార్తెలు వివాహం జరిపించి అప్పులు కావడంతో మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్ మూడవ లైన్లో టిఫిన్ దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తు,వడ్డీ వ్యాపారం చేస్తున్న చెరుకూరు సుబ్బాయమ్మ 55 సంవత్సరాలు మహిళతో పరిచయం కావడంతో మమత 80,000,మాధురి 50 వేల రూపాయలు అప్పుగా తీసుకున్నారు. వీరు ప్రతి నెల 850 రూపాయలు,600 వడ్డీ రూపంలో చెల్లిస్తుంటారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఈ వడ్డీ తాలుకు డబ్బులు చెల్లించకపోవడంతో కొంతమంది మగవారు వ్యభిచారానికి పంపించి డబ్బులు వసూలు చేసుకుంటుందని చెప్పారు. కొంతకాలం గా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో సుబ్బాయమ్మ పంపిన వ్యక్తులతో వ్యభిచారం చేయకపోవడంతో నీచమైన బూతులు తిట్టడంతో మనస్థాపానికి చెంది,ఈ మహిళా మాటలు పడలేక ఉపశమనం పొందాలని తన కుమారుడైన మణికంఠకు ఈ విషయం చెప్పడంతో టీవీ తరహా వ్యూహం పన్ని ఎలాగైనా చంపాలని నిర్ధారించుకున్నారు. మమత, మాధురిలకు సంబందించిన దురద,మత్తు మాత్రలను అధిక మోతాదులో ఆమెకి ఇచ్చే పాయసంలో కలిపారు. దీనితో సుబ్బాయమ్మ పాయసం తాగి అక్కడికక్కడే మంచంపై పడిపోవడంతో వెంటనే మమత కుమారుడు మణికంఠ ఉత్తరం వైపు గోడదూకి ఇంటి లోపలికి ప్రవేశించి సుబ్బాయమ్మ కాళ్ళు, చేతులును ఇద్దరు మహిళా నిందితులు పట్టుకోగా, మణికంఠ దిండుతో ఊపిరాడకుండా వృద్ధ మహిళా ను హత మార్చాడు.వెంటనే ఆమె ఒంటి మీద ఉన్న తాళిబొట్టు, చెవి కమ్మలు,చంప సవరాలు,960 రూపాయలు నగదు, ఏటీఎం కార్డు దొంగిలించుకొని ముగ్గురు నిందితులు ఆటోలో పరారై వెళ్ళిపోయారని సీఐ తెలిపారు.ఈ అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితులను కోర్టులో హాజరు పరిచగా రిమాండ్ కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకొనుటలో ప్రతిభ కనబరిచిన సీఐ సి.హెచ్ హాజరత్తయ్యా,ఎస్ఐ బి. మహేంద్ర కానిస్టేబుల్స్ ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# శ్రీశైలం గాయత్రి పీఠం పీఠాధిపతులుగా చల్లా రామారావు

**వేటపాలెం, ఆగష్టు 28, ప్రభాతవార్త**



శ్రీశైల గాయత్రి పీఠం పీఠాధిపతులుగా వేటపాలెం మండలం రావూరిపేటకు చెందిన జ్యోతిర్విద్వాన్, దేవాంగ పురోహిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు, దేవాంగ పురాణం గ్రంధకర్త విశ్రాంత ఉపాధ్యాయులు చల్లా రామారావు ఎంపికయ్యారు. దేవాంగ కుల ద్వితీయ గురు పీఠం శ్రీశైలం గాయత్రి పీఠం అని, పీఠం రిజిస్ట్రేషన్ పక్రియ ఈనెల 26న చీరాల పూర్తి చేసినట్లు పీఠం ప్రధాన కార్యదర్శి అంబాబత్తుల అండకొండ రాముడు గురువారం పత్రికా ముఖంగా వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాంగ కులానికి(దేవ బ్రాహ్మణ సమాజం) ఐదు గురు గాయత్రి పీఠాలు కలవని, అందులో మొదటిది కాశి క్షేత్రంలో, ద్వితీయం శ్రీశైల గాయత్రి పీఠం, తృతీయ హేమకుటంచ,చతుర్దేవ శోనచలం,పంచవం శంభుశైలంచపీఠాలు కలవని, ఈ ఐదు దేవాంగ గురువులవి కావున ద్వితీయం శ్రీశైల గాయత్రి పీఠం పున:నిర్వహణలో భాగంగా చట్టపరమైన రిజిస్ట్రేషన్ పక్రియ పూర్తి అయిందని, ఆంధ్రప్రదేశ్ దేవ బ్రాహ్మణ పండిత అర్చక పురోహిత పరిషత్ కార్యవర్గ సమావేశంలో దేవాంగ సమాజానికి గుర్తింపు, మేలు చేయాలనే తలంపుతో తీర్మాణం చేసి వైదిక శాస్త్రియ పద్దతిలో చల్లా రమారావుని ఎన్నిక చేయడం జరిగిందని,ఉత్తరాధికారిగా కారుపర్తి తేజవ్వెరకోట వెంకటేశ్వరరావుని గాయత్రి పీఠం పీఠాధిపతులు చల్లా రామారావు ప్రకటించడం జరిగిందని శ్రీశైల గాయత్రి పీఠం ప్రధాన కార్యదర్శి అంబాబత్తుల అండకొండ రాముడు తెలియజేసి తదుపరి కార్యచరణ అనగా పట్టాభిషేకం మొదలు విషయాలు అతి త్వరలో తెలియజేస్తామని తెలిపారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఈ పీఠాన్ని రావూరిపేటలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని కార్యక్రమాలు పూర్తి అయిన తర్వాత పీఠాన్ని శ్రీశైలంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీశైలం పీఠం సభ్యులు చల్లా లక్ష్మణరావు, పన్నెం బాలశంకరరావు, సజ్జా విశ్వనాథ్, సజ్జా వీరరాఘవులు తదితరులు అభినందించారు.

# విద్యార్ధికి ఆర్ధిక సహాయం చేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

**పర్చూరు, ఆగష్టు 28, ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు వారి ఆధ్వర్యంలో విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్షులు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ వేటపాలెం మండలం సెంటెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న కుంచాల ఓంకార్ అనే విద్యార్థికి బస్ ఫీజు నిమిత్తం ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా 15 వేల రూపాయలు ఆర్థిక సహాయిన్న అందజేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు పంబిసదానందరెడ్డి, కోట శ్రీనివాసరెడ్డి, కారుమూడి సుబ్బారెడ్డి, మున్నంగి వెంకట సుబ్బయ్య, పి.వెంకటేశ్వర్లు, కాసా అశోక్ కుమార్, గడ్డిపాటి శ్రీనివాసరావు, విద్యార్థి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అమరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాడతాం

**- చీరాల గడియారం సెంటర్లో ప్రతిజ్ఞ చేసిన వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు**

**చీరాల టౌన్, ఆగష్టు 28, ప్రభాతవార్త**



బషీర్ బాగ్ కాల్పుల్లో అశువులు బాసిన విద్యుత్ అమర వీరులు స్ఫూర్తితో నేడు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలకు వామపక్షాలు, ప్రజా సంఘాలు పూనుకున్నాయని సీపీఎం పార్టీ ప్రాంతీయ కార్యదర్శి నలతోటి బాబురావు అన్నారు. 2000 సంవత్సరం ఆగష్టు 28న హైదరాబాద్ బషీరాబాద్‌లో జరిగిన విద్యుత్ వ్యతిరేక ఉద్యమంపై చంద్రబాబు ప్రభుత్వం పోలీసు కాల్పుల ధమనకాండలో విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి అనే ముగ్గురు కార్యకర్తలు అశువులు బాసి నేటికి 25 సంవత్సరాలు పూర్తయిందని, సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విద్యుత్ అమరవీరుల సంస్మరణ ప్రతిజ్ఞ దినం కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ గురువారం స్థానిక గడియారస్తంభం సెంటర్లో వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పేద ప్రజలను దోపిడికి గురి చేసే ప్రభుత్వ విధానాలను అందరు కలిసి ఐక్యంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ పంపిణీ, నిర్వహణ వ్యవస్థలను ప్రభుత్వం ప్రైవేటు సూంస్థలకు అప్పగించడాన్ని తీవ్రంగా ఖండించారు. కేంద్రం, ఆంధ్ర రాష్ట్రంలో ఎవరు అధికారంలో ఉనాన ప్రపంచ బ్యాంకు ఆదేశిత సంస్కరణలనే అముల చేస్తున్నారని, దీనిలో భాగంగానే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని మొత్తం ఆదాని వంటి కార్పొరేట్లకు కట్టబెడుతూ, ఊడిగం చేస్తున్నాయని, ఫలితంగా ప్రజలపై పెను భారాలు పడుతున్నాయని ఆరోపించారు. వైసీపీ , టీడీపీ, జనసేన, బీజేపీ ఎవరు అధికారంలో ఉన్న కార్పొరేట్లకు సంపద పోగు చేయడం, సామాన్య మధ్య తరగతి ప్రజలపై పెను భారాలు వేసే విధానాలనే అమలు చేస్తున్నారని, వీటిని రద్దు చేయించేందుకు గతం వలే నాడు కూడా వామపక్ష పార్టీలు ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్నాయన్నారు. కావున ప్రజలు వామపక్ష పార్టీలకు అండగా నిలవాలని విద్యుత్ రంగాన్ని ప్రైవేటు కార్పొరేట్ దోపిడికి వదిలేయకుండా అవసరమైతే ప్రజలు అందరూ మరో బషీరాబాగ్ పోరాటానికి సిద్దంగా ఉండి పోరాటాల్లో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.వసంతరావు, డి.నారపరెడ్డి, ఎల్.జయరాజు, ఐవీ ప్రసాద్, బి.సుబ్బారావు, ఇమ్మానియేలు, సీపీఐ నాయకులు బత్తుల సామ్యేల్, పైడియ్యా, ప్రజా సంఘాల నాయకులు మాచర్ల మోహన్‌రావు, చుండూరి వాసు, బలహీన వర్గాల సమైక్య నాయకులు గోసాల ఆశీర్వాదం, తాటిబోయిన లక్ష్మీ ప్రసాద్, శీలం వెంకటేశ్వర్లు, ఎన్.మోహన్ కుమార్ ధర్మ పలువురు పాల్గొన్నారు.

# దివ్యాంగుల పింఛన్లపై వైసీపీ అసత్య ప్రచారాలు

**- రూ. 33 వేల కోట్లతో 65 లక్షల మందికి పింఛన్లు**

**- ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను కూటమి అమలు చేస్తోంది**

**- మంత్రి లోకేష్ హామీ ప్రకారమే మెగా డిఎస్సీతో పోస్టుల భర్తీ**

**- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి**

**అద్దంకి , ఆగష్టు 28, ప్రభాతవార్త**



దివ్యాంగులకు ఇచ్చే పింఛన్ల విషయంలో వైసీపీ నేతలు అసత్యాలు చెబుతూ విష ప్రచారం చేస్తున్నారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దంకి నియోజకవర్గంలో గురువారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ వివిధ ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. నిర్మాణం పూర్తి చేసుకున్న రోడ్లను ప్రారంభించారు. ఈ విధంగా జార్లపాలెం - చెరువుకొమ్ముపాలెం తారురోడ్డును రూ. కోటి వ్యయంతో నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు, అలాగే అద్దంకి - కొణికి రోడ్డు నుంచి దాసుల కాలనీ వరకు రూ.30 లక్షల సీసీ రోడ్డును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. అనంతరం 35 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ గత 15 నెలల్లో అభివృద్ధి అంటే ఏంటో కూటమి ప్రభుత్వం చూపించిందని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అమలు చేయకుండా వదిలేశారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తోందన్నారు. దివ్యాంగుల పింఛన్ల విషయంలో అసలైన లబ్ధిదారులకు నష్టం కలిగేలా వైసీపీ నేతలు అసత్యాలతో విష ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన దివ్యాంగులు ఎవరికీ పింఛన్లు ఆగలేదని, ఎవరివీ తొలగించలేదని మంత్రి స్పష్టం చేశారు. పింఛన్ల పెంపు విషయంలో రూ.2 వేల నుంచి రూ.3 వేల పెంచడానికి జగన్ కు 5 ఏళ్లు పట్టిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఒక్క సంతకంతోనే రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెన్షన్ పెంచారని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 65 లక్షల మందికి రూ.33 వేల కోట్లతో పింఛన్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. దేశంలో ఇంత పెద్ద సంఖ్యలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం, స్త్రీ శక్తి వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన అన్నా క్యాంటీన్లను పునరుద్ధరించి పేదలకు ఐదు రూపాయిలకే పౌష్టిక ఆహారం అందిస్తున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ ద్వారా పోస్టులను భర్తీ చేస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు.

# లోడ్ లారీ బోల్తా.. తప్పిన పెద్ద ప్రమాదం

**సంతనూతలపాడు, ఆగష్టు 28, ప్రభాతవార్త**





సంతనూతలపాడు మండల ఎండ్లూరు డొంక సమీపంలో గల వంతెన వద్ద గ్రానైట్ వైట్ స్టోన్ లారీ పక్కన గల చిన్నపాటి చెరువులో బోల్తా పడింది. గురువారం వేకువజామున ఈ ప్రమాద సంఘటన చోటు చేసుకుంది. అయితే ప్రమాదవ శాత్తు ఎవ్వరు గాయాలకు గురికాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది.బద్వేల్ నుండి గుళ్ళపల్లికి గ్రానైట్ వైట్ స్టోన్ లోడ్‌తో పెద్ద లారీ వెళ్తూ ఈ ప్రమాదానికి గురైంది. మొదట లారీ డ్రైవర్ ముందు వైపున వెళ్తున్న 108 వాహనాన్ని ఢీకొట్టి సైడు కాలువలో పడిపోయింది. గురువారం సాయంత్రం క్రేన్ ద్వారా బోల్తా పడిన లారీని ఒంగోలు- కర్నూలు రహదారిప బయటకి తీస్తున్న వేళలలో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సంతనూతలపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ వేజెండ్ల అజయ్‌బాబు సూచనల మేరకు స్థానిక పోలీసులు సంఘటన ప్రాంతంలో ట్రాఫిక్‌ను పునరుద్దరించే చర్యలు చేపట్టారు. ఈ వంతెన వద్ద రహదారి ఓ పక్క దెబ్బతిని మరోక పక్క వంతెనకు మార్జిన్‌లో ఫెన్సింగ్ గోడ కూడా దెబ్బతిని పోయింది. వంతెన మార్జిన్‌లో సైడు కాలువలు చిన్నపాటి చెరువును మించిపోయింది. దీని వల్ల రాత్రి వేళలో మరింత ప్రమాదకరంగా మారింది. ఆర్‌అండ్‌బి అధికారులు ఇకనైనా స్పందించి దెబ్బతిన్న వంతెనకు మరమ్మత్తులు నిర్వహించి ప్రమాదాలు నివారించాల్సిందిగా పలువురు వాహనదారులు కోరుతున్నారు.

# సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట సంజీవని - గూడూరి ఎరిక్షన్‌బాబు

**యర్రగొండపాలెం,ఆగష్టు28,ప్రభాతవార్త**



సీఎం సహాయనిధి నిరుపేదల పాలిట సంజీవని అని యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం లబ్దిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య కారాణాలతో హాస్పటల్‌లో చేయించుకోని,ఆర్థిక స్తోమత లేక చికిత్స చేయించుకోలేని పరిస్థిల్లో సీఎం సహాయనిధి పేదలకు బాసటగా నిలుస్తుందన్నారు.ఈ సందర్భంగా21మందిరూ8,94,513,ముగ్గరికిఎల్‌ఓసిలుల ద్వారా9,00,000,మొత్తం 1794,513,ల చెక్కులను లబ్దిదారులకి పంపిణీచేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ చేకూరి సుబ్బారావు,నాయకులు పాల్గొన్నారు.

# ప్రతిరైతు, కౌలురైతు ఈ పంట నమోదు చేసుకోవాలి : ఏవో బుజ్జిభాయి

**మార్కాపురం రూరల్, ఆగష్టు 28 ,ప్రభాతవార్త**



మండలంలోని ఇడుపూరు, బోడపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారిణి బుజ్జిబాయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో బుజ్జిబాయ్ మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవడం వలన ప్రకృతి వైపరిత్యాల వలనకలిగేటటువంటి పంటనష్టపరిహారం, వేసినటు వంటి పంటను మద్దతు ధరకు అమ్ముకోవడానికి పంటల భీమా వర్తిస్తుందని తెలిపారు. అదేవిధంగా కౌలుకు వేసుకుంటున్నటువంటి ప్రతి కౌలు రైతు కూడా ఈ పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. అలాగే ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పంటలు భీమా పథకాన్ని ఆగస్టు 30వ తేదీతో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బుజ్జిభాయ్, విఏఏలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరులకు వామపక్షాల ఆధ్వర్యంలో నివాళులు

**- పొదిలిలో నిరసన**

**కొనకనమిట్ల, ఆగష్టు 28, ప్రభాతవార్త**



హైదరాబాద్‌లోని బషీరాబాగ్ విద్యుత్ ఛార్జీల తగ్గించాలని ధర్నాకు దిగిన వారిపై పోలీసులు కాల్పులు చేశారు. 2000 సంవత్సరం ఆగష్టు 28వ తేదీన జరిగినఈ కాల్పుల్లో ముగ్గురు అమరుల య్యారు. పొదిలి విశ్వనాథపురం కాలేజీ రోడ్డులో గురువారం రాత్రి వాపమక్షాల నాయకులు నిరసన తెలిపారు.విద్యుత్ అమరవీరులకు సంఘీభావంగా నినాదాలు చేశారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని, వాటిని రద్దు చేసే వరకు ఉద్యమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామ పక్షాల నాయకులు పి.బాలనరసయ్య, ఏ.శ్రీను, ఎన్.వెంకటేశ్వరరెడ్డి, పీవీ కొండయ్య, జి.యేసు రత్నం, జేవీవీ నాయకుల దేవ ప్రసాద్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు ఎస్‌కే కరిముల్లా, ఎస్‌కే భాష, యోగయ్య, ఎస్‌కే మస్తాన్‌వలి, క్షేత్ర సహాయకులు సంఘం మాజీ నాయకులు దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

# బొజ్జ గణపయ్యా.. నమోస్తుతే !

**- వాడవాడలా కొలువుదీరిన గణనాథుల ప్రతిమలు - ఉత్సాహంగా వినాయక చవితి**

**తాళ్లూరు, ఆగష్టు 28, ప్రభాతవార్త**



వినాయక చవితి పండుగను మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో వినాయక చవితి పర్వదినాన్ని పురష్కరించుకుని పలు ప్రాంతాల్లో గణేష్ ప్రతిమలు ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం వేకువజాము నుంచే వివిధ గ్రామాల పరిధిలోని మండపాలు వద్ద ఆదిదేవునికి తమ విఘ్నాలు తొలిగి శుభాలు చేకూరాలంటూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటిలో చిన్న వినాయకుని ప్రతిమను తెచ్చుకుని 21 రకాలపత్రికలు,కాయలు, పుస్తకాలు, నైవేద్యం సమర్పించారు. గురువారం ఉదయాన్నే చిన్నారులు వినాయక స్వామిని గ్రామం సమీపంలో ఉన్న కాల్వలు, చెరువులు, కుంటలలో నిమజ్జనం చేశారు. మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై ఎస్.మల్లిఖార్జునరావు సిబ్బందితో ఎప్పటికప్పుడు పరిశీలించి సమీక్షిస్తున్నారు. కమిటీ సభ్యులకు శాంతి భద్రతలపై అవగాహన కల్పించారు.

# 'నోబెల్' కోసం ట్రంప్ స్వయంగా లాబీయింగ్!

## ఆయనను శాంతి దూతగా చిత్రించేందుకు నడుం బిగించిన కేబినెట్ సభ్యులు



**వాషింగ్టన్, ఆగస్టు 28:** ప్రతిష్ఠాత్మక నోబెల్ శాంతి బహుమతి కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన కేబినెట్‌సభ్యులు మునుపెన్నడూ లేని విధంగా తీవ్రంగా ప్రయత్నిస్తుండటం ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. బహుమతి కోసం ఏకంగా అధ్యక్షుడే రంగంలోకి దిగి బహిరంగంగా లాబీయింగ్ చేయడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అక్టోబర్‌లో విజేతను ప్రకటించేందుకు నోబెల్ కమిటీ చర్చలు జరుపుతున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.
ట్రంప్‌ను ఒక శాంతి దూతగా చిత్రీకరించేందుకు ఆయన కేబినెట్ సభ్యులు నడుం బిగించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ మాట్లాడుతూ నోబెల్ బహుమతికి మీరే అత్యంత అర్హులైన అభ్యర్థిఅని ట్రంప్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మరోవైపు, లేబర్‌సెక్రటరీ లోరి ఛావేజ్ డి రేమర్ తన కార్యాలయంలో ట్రంప్ భారీ ఫ్లెక్సీని ఏర్పాటుచేసి ఆయనను అమెరికా కార్మికుల కోసం వచ్చిన పరివర్తనాత్మక అధ్యక్షుడని కొనియాడారు. ట్రంప్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించిందని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ పేర్కొన్నారు. ఈ ప్రశంసల వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ లాబీయింగ్ మరో స్థాయికి చేరింది అనడానికి ట్రంప్‌స్వయంగా చేసిన ఫోన్ నిదర్శనం. గతనెలలో ఆయన నార్వే ఆర్థిక మంత్రికి ఫోన్ చేసి టారిఫ్ చర్చల మధ్యలో నోబెల్ నామినేషన్ గురించి నేరుగా ప్రస్తావించినట్లు నార్వేజియన్ మీడియా కథనాలు వెల్లడించాయి. మరోవైపు, ట్రంప్ తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ ఘాటుగా స్పందిస్తూ అమెరికన్ పౌరులపై మెరైన్లను ప్రయోగించిన వ్యక్తికి శాంతి బహుమతి ఇవ్వడం సరికాదు. ఆయన దేశానికి శాంతిని కాదు, యుద్ధ వాతావరణాన్ని తెచ్చారని ఆరోపించారు. ఇజ్రాయెల్ జర్నలిస్ట్ గిడియాన్ లేవీ మరో అడుగు ముందుకేసి ట్రంప్ స్థానం నోబెల్ అవార్డు వేదికపై కాదు, అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులోనని ఎద్దేవాచేశారు. ఈ విమర్శలకు బలం చేకూరుస్తూ, నార్వే నోబెల్ కమిటీలోని ఐదుగురిలో ముగ్గురు సభ్యులు ట్రంప్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ట్రంప్ తన రెండవ సారిపదవీకాలంలో అమెరికాలో ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారు, మీడియాపై వందకు పైగా దాడులు చేశారని కమిటీచైర్మన్ జోర్గెన్ ఫ్రైడ్నెస్ పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్‌కు శాంతి బహుమతి దక్కే అవకాశాలు దాదాపు లేనట్లేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఒక బహుమతి కోసం అధ్యక్ష పదవిలో ఉన్న వ్యక్తి, ఆయన కేబినెట్ ఇంత బహిరంగంగా లాబీయింగ్ చేయడం మాత్రం చరిత్రలో నిలిచిపోతుందని వారు వ్యాఖ్యానిస్తున్నారు.



# భారత్ సరే అంటే 25 శాతం సుంకాలే!

## రష్యానుంచి చమురు కొనుగోలును నిలిపివేయాలంటున్న అమెరికా

**వాషింగ్టన్, ఆగస్టు 28:** రష్యానుంచి ముడిచమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు సుంకాల మోత మోగిస్తున్న అమెరికా తన అక్కసు వెళ్లగక్కింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగేందుకు ఇండియానే కారణమని శ్వేతసౌధం సలహాదారు పీటర్ నవారో విమర్శించారు. దీనిని 'మోడీ యుద్ధంగా' అభివర్ణించారు. రాయితీపై భారత్ ముడిచమురు కొనుగోలు చేయడమే మాస్కో దూకుడుకు ఆజ్యం పోసిందని ఆయన విమర్శించారు. భారత్ చర్యల వల్ల అమెరికా పన్ను చెల్లింపుదారులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలును భారత్ నిలిపివేస్తే.. అమెరికా విధిస్తున్న సుంకాలను 25శాతం తగ్గించుకోవచ్చని చెప్పారు. భారత్‌పై అమెరికా విధించిన 50 శాతం సుంకాలు బుధవారం నుంచి అమలులోకి వచ్చిన నేపథ్యంలో బ్లూమ్‌బెర్గ్ టెలివిజన్‌తో పీటర్ నవారో మాట్లాడారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం గురించి ప్రస్తావిస్తూ.. ఇరు దేశాల మధ్య ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే.. భారత్ కూడా అందుకు సహకరించాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఒకవేళ రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును నిలిపివేస్తే.. 25 శాతం సుంకాలను పునరుద్ధరిస్తారా? అని ప్రశ్నించగా.. భారత్ ఆ దిశగా చర్యలు తీసుకున్న తర్వాతి రోజు నుంచే 25 శాతం సుంకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. భారత్ తీరు ఆశ్చర్యంగా ఉందని, ప్రధాని మోడీ వంటి పరిణతి చెందిన నాయకుడు ఎందుకలా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు.
ఉక్రెయిన్‌తో యుద్ధానికి రష్యాకు భారత్ పరోక్షంగా సాయం చేస్తోందని పీటర్ ఆరోపించారు. రాయితీపైపెద్ద మొత్తంలో ఇండియా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ మొత్తాన్ని మాస్కో ఉక్రెయిన్‌ను అణిచివేసేందుకు ఉపయోగిస్తోందని విమర్శించారు. పీటర్ భారత్‌పై అక్కసు వెళ్లగక్కడం ఇదే తొలిసారి కాదు. రష్యా ముడి చమురును శుద్ధి చేస్తూ న్యూఢిల్లీ రిఫైనరీ భారీ లాభాలను ఆర్జించిందని గతవారం నవారో విమర్శించారు. భారత్ అమెరికాకు విక్రయిస్తున్న వస్తువుల ద్వారావచ్చిన సొమ్మును రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు వినియోగిస్తోందని తద్వారా భారీ లాభాలు ఆర్జిస్తోందని ఆరోపించారు. రష్యా ఆ సొమ్మును ఉక్రెయిన్ వినాశనానికి వాడుతోందని దుయ్యబట్టారు.

## 17వ బిడ్డకు జన్మనిచ్చిన రాజస్థాన్ మహిళ

**జైపూర్, ఆగస్టు 28:** ఒక మహిళ 55 ఏళ్ల వయస్సులో 17వ బిడ్డకు జన్మనిచ్చింది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆడ బిడ్డను ప్రసవించింది. ఆమెకు 17వ కాన్పు అని తెలుసుకుని డాక్టర్లు షాకయ్యారు. అయితే 17 మంది సంతానంలో పుట్టిన వెంటనే ఐదుగురు పిల్లలు మరణించారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. లీలావాస్ గ్రామానికి చెందిన కవారా రామ్ భార్య అయిన 55 ఏళ్ల రేఖ బుధవారం జాడోల్ బ్లాక్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 17వ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆనందంలో మునిగిపోయారు. కాగా, కవారా, రేఖ దంపతులు ఇప్పటి వరకు 17 మంది పిల్లలను కన్నారు. అయితే నలుగురు మగ, ఒక ఆడ బిడ్డపుట్టిన వెంటనేమరణించారు. ప్రస్తుతం ఈ దంపతులకు 12 మంది పిల్లలు ఉన్నారు. ఏడుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. 11 మందికి పెళ్లిళ్ల కావడంతోపాటు ఒక్కొక్కరికి ఇద్దరు నుంచి ముగ్గురు పిల్లలు ఉన్నారు. దీంతో 17వ బిడ్డకు రేఖ జన్మనివ్వకముందే ఆమెకు మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు.

# కీవ్‌పై 598 డ్రోన్లతో విరుచుకుపడిన రష్యా



**కీవ్, ఆగస్టు 28:** ఉక్రెయిన్‌పై రష్యా దాడులు ఆగడం లేదు. ఆ రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిర్చేందుకు ఓ వైపు అమెరికా ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ఫలితం పెద్దగా కనిపించడం లేదు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై గురువారం రష్యా డ్రోన్లతో విరుచుకుపడింది. ఏకంగా 598 డ్రోన్లు, 31 తేలికపాటి క్షిపణులను ప్రయోగించినట్లు ఉక్రెయిన్ ఎయిర్ ఫోర్స్ వర్గాలు వెల్లడించాయి. ఈ దాడుల్లో 12మంది ప్రాణాలు కోల్పోగా.. 48 మందికి గాయాలైనట్లు ఉక్రెయిన్ పేర్కొంది. మృతుల్లో 2, 14, 17 యేళ్ల వయసున్న ముగ్గురు చిన్నారులుకూడా ఉన్నట్లు తెలుస్తోంది. మూడేళ్లుగా కొనసాగుతున్న ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర ప్రయతానలు చేస్తున్నారు. ఇరు దేశాల అధ్యక్షులతో మంతనాలు సాగిస్తున్నారు. ఇరు దేశాల మధ్య శాంతి ఒప్పందం దిశగా అడుగులు పడుతున్న క్రమంలో ఇటీవల రష్యా చేపట్టిన అతిపెద్ద దాడి ఇదే. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు ఉక్రెయిన్ వర్గాలు తెలిపాయి. తాజా ఘటనను ఆదేశ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు. చర్చలకు రాకుండా రష్యా బాలిస్టిక్ క్షిపణులను వినియోగిస్తోందని మండిపడ్డారు. 'శాంతిని కోరుకునే యావత్ ప్రపంచం తాజా ఘటనపై స్పందించారు. గతంలో చాలామంది శాంతి మంత్రం జపించారు. ఇప్పుడు మాత్రం మిన్నకుండిపోతున్నారు.' అంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.
కీవ్ నగరంలోని దాదాపు 20 ప్రాంతాల్లో డ్రోన్ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. సుమారు 100 భవనాలు పూర్తిగా లేదా పాక్షికంగా డెబ్బతిన్నట్లు సమాచారం. మరోవైపు 563 డ్రోన్లను, 26 క్షిపణులను విజయవంతంగా నేల కూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్‌ఫోర్స్ వెల్లడించింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల పెంపు సహా, మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటారని ఉక్రెయిన్ భావిస్తోంది. ఇదే విషయాన్ని జెలెన్‌స్కీ కూడా ప్రస్తావించారు. 'యుద్ధాన్ని ముగించేందుకు ఇచ్చిన అన్ని గడువులను రష్యా ఇప్పటికే అతిక్రమించింది. ఇరు దేశాల మధ్య శాంతి కుదిర్చేందుకు చేసిన దౌత్య ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి' అని అన్నారు. జెలెన్‌స్కీతో ప్రత్యక్షంగా శాంతి చర్చలు జరిపేందుకు అమెరికా చేసిన ప్రతిపాదనను పుతిన్ తిరస్కరించడంపై ఇటీవల ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ప్రత్యక్ష చర్చలకు షెడ్యూలు ఖరారు కాకపోతే రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని గత శుక్రవారం ట్రంప్ వ్యాఖ్యానించారు.
మరోవైపు గురువారం రాత్రి ఉక్రెయిన్‌కు చెందిన 102 డ్రోన్లను నేల కూల్చినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. రష్యాలోని నైరుతి భాగమే లక్ష్యంగా ఉక్రెయిన్ డ్రోన్ దాడులకు దిగుతున్నట్లు పేర్కొంది. క్రాస్‌నోడార్ ప్రాంతంలోని అఫిప్‌స్కీ చమురుశుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడికారణంగా మంటలు చెలరేగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమర రీజియన్‌లోని మరో చమురు శుద్ధి కేంద్రంపైనా ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసినట్లు తెలుస్తోంది. రష్యా ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీసేందుకు..చమురుశుద్ధి కేంద్రాలనే ఉక్రెయిన్ ప్రధానంగా ఎంచుకుంటోంది.

## స్కూటీపై పడిన కంటైనర్.. ముగ్గురు మృతి

**అహ్మదాబాద్, ఆగస్టు 28:** హైవేపై వేగంగా వెళ్తున్న కంటైనర్ ట్రాలీ అదుపుతప్పి అటుగా వెళ్తున్న స్కూటర్‌పై పడింది. దీంతో స్కూటర్‌పై ఉన్న ముగ్గురు యువకులు దానికింద నలిగి నుజ్జయి మరణించారు. గుజరాత్‌లోని కచ్‌జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గురువారం మధ్యాహ్నం ముంద్రా-అంజార్ హైవేలోని ఖేడోయ్ గ్రామం సమీపంలో వేగంగా వెళ్తున్న కంటైనర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీ వాహనంనుంచి ఊడిన కంటైనర్ అటుగావెళ్తున్న యాక్టివా స్కూటర్‌పై పడింది. దానిపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు భారీ కంటైనర్ కింద నలిగి నుజ్జునుజ్జయి మరణించారు. కాగా, ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. క్రేన్‌ను రప్పించి కంటైనర్‌ను తొలగించారు. దాని కింద పడి నలిగి మరణించిన ఇద్దరిని నాయిక్తి, అభిషేక్‌గా గుర్తించారు.

## బీహార్ మంత్రిని వెంటాడిన గామస్తులు!

**పాట్నా, ఆగస్టు 28:** మంత్రి తీరుపై జనం ఆగ్రహించారు. గ్రామ సందర్శనకు వచ్చిన ఆయనపై దాడికి ప్రయత్నించారు. తప్పించుకుని పారిపోయిన మంత్రిని కిలోమీటరు దూరం వరకు వెంబడించి తరిమారు.ఎన్డీయే పాలిత బీహార్‌లో ఈ సంఘటన జరిగింది. గతవారం రోడ్డు ప్రమాదంలో 9 మంది వ్యక్తులు మరణించారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రావణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి బుధవారం ఉదయం జోగిపూర్ మలవాన్ గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపేందుకు వారి ఇళ్ల వద్దకు వెళ్లారు. కాగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. మంత్రి శ్రావణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేను వారు చుట్టుముట్టారు. గ్రామాన్ని ఆలస్యంగా సందర్శించడం, బాధిత కుటుంబాలపట్ల సానుభూతి చూపకపోవడం,ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడంపై జనం ఆగ్రహించారు. అధికారజెడియూనేతలపై దాడికి ప్రయత్నించారు. జనందాడినుంచి మంత్రి తప్పించుకోగా ఆయన బాడిగార్డు గాయపడ్డాడు. అనంతరం మంత్రి శ్రావణ్ కుమార్ తన కాన్వాయ్ వరకు పరుగెత్తారు. వాహనాల్లో పారిపోతున్న మంత్రి, ఎమ్మెల్యేను కిలోమీటరు దూరం వరకు గ్రామస్తులు వెంబడించి తరిమారు. అప్రమత్తమైన పోలీసులు జనాన్ని చెదరగొట్టారు. భద్రతను కట్టుదిట్టం చేశారు.

# గల్వాన్ తర్వాత తొలిసారి జిన్‌పింగ్, మోడీ ద్వైపాక్షిక భేటీ!



**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** భారత్, చైనా సంబంధాలలో ఒక కీలక పరిణామం చోటుచేసుకోనుంది. సరిహద్దుల్లోని గల్వాన్ లోయలో 2020లో జరిగిన ఘర్షణల అనంతరం, ఏడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొలిసారిగా చైనాలో పర్యటించనున్నారు. చైనాలోని టియాంజిన్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీఓ) శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ఆయన చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశంలో పాల్గొంటారు. ఆదివారం ఈ ద్వైపాక్షిక భేటీ జరగనుంది. జపాన్‌లో తన రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ నేరుగా చైనాకు వెళ్లనున్నారు. అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు మోడీ ఈ సదస్సుకు హాజరవుతున్నారు. గత నాలుగేళ్లుగా వాస్తవాధీన రేఖ (ఎల్ఏసి) వెంబడి నెలకొన్న ప్రతిష్టంభనకు తెరదించుతూ, పెట్రోలింగ్ నిర్వహించడంపై ఇరు దేశాలు ఇటీవలే ఒక ఒప్పందానికి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సానుకూల వాతావరణంలో ఈ పర్యటన జరగనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. గతేడాది రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో కూడా ఇరువురు నేతలు సమావేశమయ్యారు. ఈ నెల 19న చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయి, ఎస్సీఓ సదస్సుకు రావాల్సిందిగా జిన్‌పింగ్ పంపిన ఆహ్వాన పత్రాన్ని స్వయంగా అందజేశారు.
ఈ సమావేశం అనంతరం ప్రధాని మోడీ స్పందిస్తూ, గతేడాది అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భేటీ అయినప్పటి నుంచి ఇరు దేశాల ప్రయోజనాలకు, సున్నితత్వాలకు పరస్పరం గౌరవం ఇచ్చుకుంటూ సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయి. టియాంజిన్‌లో జరగబోయే సమావేశం కోసం ఎదురుచూస్తున్నానని 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్‌చేశారు. ప్రధాని మోడీ పర్యటన ఇరు దేశాల సంబంధాల మెరుగుదలకు, అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందని భారత్‌లో చైనా రాయబారి జూఫెయిహాంగ్ ఈ నెల 21న ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. ఈ పర్యటనను విజయవంతం చేయడానికి ఇరు దేశాల బృందాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతతను కాపాడటం అత్యంత ముఖ్యమని, సరిహద్దు సమస్యకు న్యాయబద్ధమైన, పరస్పరం ఆమోదయోగ్యమైన పరిష్కారానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోడీ స్పష్టం చేసినట్లు పిఎంఓ వెల్లడించింది.

# సంక్షిప్తంగా..

## నేపాల్‌లో పెరుగుతున్న కలరా కేసులు



**ఖాట్మండు:** నేపాల్‌లోని పార్సా జిల్లాలో కలరా వ్యాధి వ్యాపిస్తున్నది. వారం నుంచి ఆ కేసులు ఎక్కువయ్యాయి. ఇప్పటి వరకు ముగ్గురు మృతిచెందారు. సుమారు 300 మంది అతిసారంతో అస్పత్రి పాలయ్యారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నది. శుక్రవారం నుంచి బిర్‌కుంజ్ మెట్రోపాలిటన్ సిటీ ఆస్పత్రిలో డయేరియా వ్యాధి లక్షణాలతో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ర్యాపిడ్ టెస్టుల ద్వారా కలరా వ్యాపిస్తున్నట్లు గుర్తించారు. యాంటీజెన్ పరీక్షలో విబ్రియో కలరా 01 పాజిటివ్‌గా వస్తున్నారు. కాఠ్మాండులోని సెంట్రల్ ల్యాబ్ కూడా ఈ వ్యాధిని ధ్రువీకరించింది. కలరాకు చెందిన సీరో టైప్ బ్యాక్టీరియా వల్ల బంగ్లాదేశ్‌లోనూ తీవ్ర స్థాయి పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్నట్లు బిర్‌గుంజ్ ఆస్పత్రి డాక్టర్లు అంచనా వేశారు. బిర్‌గుంజ్‌లోని కొన్ని వార్డుల్లో కేసులు అధికంగా ఉన్నాయి. కొందరు కిడ్నీ సంబంధిత వ్యాధికి గురవుతున్నట్లు తెలుస్తోంది.

## అమెరికా ఉత్పత్తుల విక్రయాలపై పంజాబ్ వర్సిటీ బ్యాన్!

**అమృత్‌సర్, ఆగస్టు 28:** అమెరికా విధించిన భారీ దిగుమతి సుంకాలకు వ్యతిరేకంగా పంజాబ్‌కు చెందిన ఓ ప్రముఖ విశ్వవిద్యాలయం సంచలన నిర్ణయం తీసుకుంది. తమ క్యాంపస్‌లో కోకాకోలా, పెప్సీ వంటి అమెరికన్ శీతల పానీయాల అమ్మకాలను తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకపక్ష వైఖరికి నిరసనగా దీనిని స్వదేశీ 2.0 ఉద్యమంగా అభివర్ణించింది. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందన్న కారణంతో భారతీయ వస్తువులపై అమెరికా ఏకంగా 50 శాతం సుంకాలను విధించింది. పెంచిన ఈ సుంకాలు నిన్నటి నుంచి అమల్లోకి వచ్చాయి. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పియూ) ఈ నిరసనకు పిలుపునిచ్చింది. దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ వర్సిటీలలో ఒకటైన ఎల్‌పియూ తీసుకున్న ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వర్సిటీ ఛాన్సలర్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎంపీ అశోక్ కుమార్ మిట్టల్ స్పందించారు. అమెరికా చర్యను ఆర్థిక దౌర్జన్యంగా ఆయన అభివర్ణించారు.

## కిడ్నాప్ కేసులో కేరళ నటికి ఊరట!

**తిరువనంతపురం, ఆగస్టు 28:** కిడ్నాప్, దాడి కేసులో ప్రముఖ నటి లక్ష్మీ మీనన్‌కు కేరళ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఓ ఐటీ ఉద్యోగిని అపహరించి, దాడి చేశారన్న ఆరోపణలపై ఆమెతో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 17 వరకు ఆమెను అరెస్ట్ చేయవద్దని పోలీసులను ఆదేశిస్తూ ఉన్నత న్యాయస్థానం గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కొచ్చిలోని వెలాసిటీ అనే పబ్‌లో లక్ష్మీమీనన్ స్నేహితులకు, ఓ ఐటీ ఉద్యోగికి మధ్య వాగ్వివాదం జరిగింది. అనంతరం పబ్ నుంచి బయటకు వచ్చిన ఆ ఉద్యోగి కారును రైల్వే బ్రిడ్జి సమీపంలో అడ్డగించి, వాహనంలో నుంచి బలవంతంగా బయటకు లాగారని బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనను దుర్భాషలాడుతూ వారి కారులోకి ఎక్కించుకుని, దాడికి యత్నించి, ఆ తర్వాత అర్ధరాత్రి వదిలిపెట్టారని ఆరోపించాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు లక్ష్మీమీనన్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అదే సమయంలో ఈ గొడవకు సంబంధించిందంటూ ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

## బిక్షాటనను నిషేధించిన మిజోరం

**ఐజ్వాల్, ఆగస్టు 28:** మిజోరం రాష్ట్రాన్ని యాచకులు లేని ప్రాంతంగా మార్చే దిశగా అక్కడి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భిక్షాటనను పూర్తిగా నిషేధిస్తూ రూపొందించిన మిజోరం యాచక నిషేధ బిల్లు, 2025ను అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేవలం నిషేధించడమే కాకుండా, యాచకులకు పునరావాసం కల్పించడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో త్వరలో ప్రారంభం కానున్న సైరంగ్‌సిహ్ము రైల్వే లైన్ ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. సెప్టెంబర్ 13న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రైలు మార్గాన్ని ప్రారంభించనున్నారు. కొత్త రైల్వే లైన్ అందుబాటులోకి వస్తే ఇతర రాష్ట్రాల నుంచి యాచకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ముందస్తు చర్యగా ఈ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ కొత్త చట్టం ప్రకారం, ప్రభుత్వం ఒక రిలీఫ్ బోర్డును, ఒక రిసీవింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తుంది. భిక్షాటన చేస్తూ పట్టుబడిన వారిని ఈ కేంద్రంలో తాత్కాలికంగా ఉంచి, 24 గంటల్లోగా వారి స్వస్థలాలకు లేదా వారి కుటుంబ సభ్యుల వద్దకు పంపిస్తారు. పునరావాసం కల్పించి, రాష్ట్రాన్ని యాచక రహితంగా మార్చడమే తమ లక్ష్యమని వివరించారు.

## విదేశీ విద్యార్థులకు నాలుగేళ్లవరకే అనుమతి!

### స్టూడెంట్ వీసాలపై ఆంక్షలు పెంచిన అమెరికా

**వాషింగ్టన్, ఆగస్టు 28:** అమెరికాలో చదువుకుంటున్న, ఉన్నత చదువుల కోసం వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న విద్యార్థులకు ట్రంప్ సర్కారు మరో షాక్ ఇచ్చింది. ఇప్పటికే వీసాలపై పలు ఆంక్షలు అమలు చేస్తున్న అమెరికా తాజాగా మరో కీలక సవరణకు ప్రతిపాదనలు చేసింది. విదేశీ విద్యార్థులు తమ దేశంలో ఎక్కువ కాలం ఉండిపోకుండా కట్టడి చేసేందుకు ప్రయత్నం చేస్తోంది. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు, మీడియా ప్రతినిధులకు జారీచేసే వీసాలకు పరిమిత కాల గడువు విధిస్తూ ప్రతిపాదనలను సిద్ధం చేసింది. స్టూడెంట్ వీసాపై వచ్చిన వారు నాలుగేళ్లకు మించి అమెరికాలో ఉండకుండా నిబంధనలకు సవరణ చేయనుంది. ప్రస్తుతం ఎఫ్1, జే-1 వీసాలకున్న 'డ్యూరేషన్ ఆఫ్ స్టే' వెసులుబాటును కుదించనున్నట్లు సమాచారం. ఈ ఫ్లెక్సిబుల్ స్టూడెంట్‌వీసాలకు కూడా గడువు విధించేలా 'పరిమిత కాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరు చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం ప్రతిపాదించింది. విదేశీ విద్యార్థులకు డ్యూరేషన్ ఆఫ్ స్టే వెసులుబాటు వల్ల భద్రతాపరమైన ఇబ్బందులు, అమెరికన్ల ప్రయోజనాలకు విఘాతం కలుగుతుందని పేర్కొంది.

# భారత్‌పట్ల ట్రంప్ వైఖరిపై డెమొక్రాట్ల ఫైర్!

**వాషింగ్టన్, ఆగస్టు 28:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలపై స్వదేశంలోనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న చైనా వంటి దేశాన్ని వదిలేసి, కేవలం భారత్‌ను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడంపై డెమొక్రాటిక్ పార్టీకి చెందిన హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీ తీవ్రంగామండిపడింది. ట్రంప్‌నిర్ణయాలు అమెరికా ప్రయోజనాలకు, భారత్‌తో దశాబ్దాలుగా నిర్మించుకున్న సంబంధాలకు హానికరమని ఆరోపించింది. భారత దిగుమతులపై ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లు అమెరికన్లనే నష్టపరుస్తున్నాయని, రెండు దశాబ్దాలుగా ఇరు దేశాలు నిర్మించుకున్న బలమైన సంబంధాలను దెబ్బతీస్తున్నాయని డెమొక్రాట్లు ఆరోపించారు. ఇదంతా చూస్తుంటే అసలు సమస్య ఉక్రెయిన్ కాదేమో అనిపిస్తోందంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వేదికగా ఒక ప్రకటనలో విమర్శించారు. రష్యా నుంచి అత్యధికంగా ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్న చైనాను వదిలేసి, కేవలం భారత్‌పైనే దృష్టి పెట్టడం గందరగోళ విధానమని వారు వెల్లడించారు. చైనా ఇప్పటికీ రాయితీధరలకు రష్యా చమురును కొనుగోలు చేస్తూనే ఉందని, కానీ ఆ దేశంపై ఎలాంటి చర్యలు లేవని వారు గుర్తుచేశారు. రష్యా చమురు వాణిజ్యానికి ముడిపెడుతూ ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై అదనంగా 25 శాతం సుంకాలను విధించడంతో మొత్తం టారిఫ్‌లు 50 శాతానికి చేరాయి.
ఈ నిర్ణయంతో సుమారు 48.2 బిలియన్‌డాలర్ల విలువైన భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందని మోదీ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ చర్య వల్ల అమెరికాకుజరిగే ఎగుమతులు వాణిజ్యపరంగా లాభదాయకం కావని, ఇది దేశంలో ఉద్యోగ నష్టాలకు, ఆర్థిక వృద్ధి మందగమనానికి దారి తీయవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్ వస్తువుల వంటి కొన్ని కీలక రంగాలకు ఈ అదనపు సుంకాల నుంచి అమెరికా మినహాయింపు ఇవ్వడం భారత్‌కు కొంత ఊరటనిచ్చేఅంశం. గత కొన్నేళ్లుగా భారత్‌అమెరికా వాణిజ్య సంబంధాలు విస్తరిస్తున్నప్పటికీ, మార్కెట్ యాక్సెస్ వంటి అంశాలపై వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా వ్యవసాయ, డెయిరీ రంగాల్లో తమకు మరింత ప్రాధాన్యత కల్పించాలని అమెరికా డిమాండ్ చేస్తుండటంతో వాణిజ్య ఒప్పంద చర్చలు నిలిచిపోయాయి.

# ఓట్లను దొంగిలిస్తే బీహార్ ప్రజలు సహించబోరు

## 'ఓటర్ అధికార్ యాత్ర'లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ



**పాట్నా, ఆగస్టు 28:** 'ఓట్ చోర్ - గద్దీ ఛోడ్' అనే నినాదంతో 'ఓటర్ అధికార్‌యాత్ర' చేపట్టిన కాంగ్రెస్‌అగ్రనేత రాహుల్ గాంధీ బిజెపి, ఎన్నికల సంఘంపై విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. తమ ఓట్లను దొంగిలిస్తే బీహార్ ప్రజలు సహించబోరన్నారు. ఓటర్ల జాబితా నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 65 లక్షల మంది ఓటర్ల పేర్లను తొలగించారని ఆక్షేపించారు. అందులో ఎక్కువ మంది బడుగు బలహీన వర్గాల వారే ఉన్నారని అన్నారు. సీతామఢీలో నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రలో ఆయన మాట్లాడుతూ 'ఓట్ చోరీ' గురించి రానున్న రోజుల్లో మరిన్ని ఆధారాలు బయటపెడతానని అన్నారు. ఎన్నికల సంఘం, బిజెపి కుమ్మక్కైఓట్లను దొంగిలించాయి. గతంలో మహారాష్ట్ర, హర్యానా, కర్ణాటకలో ఇదే పంథా కొనసాగించారు. ఇప్పుడు బీహార్ వంతు. కానీ, ఇక్కడి ప్రజలు దీన్ని సహించరు అని అన్నారు. యాత్రలో భాగంగా స్థానిక సీతాదేవి ఆలయాన్ని రాహుల్ సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం దొంగిలించిన ఓట్లతో ఏర్పడిందంటూ రాహుల్ విమర్శించారు. ప్రధాన మంత్రి కూడా ఓట్ల తస్కరణకు పాల్పడ్డారని ఆరోపించారు.

# బసవ ఎక్స్‌ప్రెస్‌కు శాశ్వత పరిష్కారం చూపని డిఆర్ఎస్‌బ

## - బ్రేకింగ్ సమస్యతో గంటలకొద్ది ఆలస్యం
## - ప్రశ్నల వర్షం కురిపిస్తున్న ప్రయాణికులు

**గుంతకల్లు రైల్వే, ఆగస్టు 28,ప్రభాతవార్త:** రాయలసీమ జిల్లాల మీదుగా మైసూరు–బాగల్‌కోట్–మైసూరు మధ్య తిరిగే బసవ ఎక్స్‌ప్రెస్‌లో ఏర్పడుతున్న బ్రేక్ ప్రెషర్ డ్రాపింగ్ సమస్య నాలుగు వారాలుగా ప్రయాణికులకు, రైల్వే యంత్రాంగానికి ఆందోళనలను గురిచేస్తోంది. రైల్వే శాఖ ఇంతవరకు యాంత్రిక లోపాన్ని పరిష్కరించకుండా కనీసం గుర్తించకపోవడాన్ని ప్రయాణిఇకులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఈ నెల 5న మైసూరు నుండి బాగల్‌కోట్‌కు బయలుదేరిన నెంబర్ 17307బసవ ఎక్ స్ప్రెస్‌కు మాండ్యా, మద్దూరు స్టేషన్‌ల మధ్య రైలుకు చెందిన బ్రేక్ ప్రెషర్ డ్రాపింగ్ సమస్య తొలిసారిగా ఆటంకం వెలుగులోకి వచ్చింది. నాటి నుంచి ఈ రైలుకు అడపాదడపా ఈ యాంత్రిక సమస్యవాటిల్లుతూనే ఉంది. తాజాగా ఈ నెల 26న మంగళవారం రాత్రి బసవ ఎక్స్‌ప్రెస్ అనంతపురం రైల్వే స్టేషన్‌లో మొరాయించడంతో రెండు గంటలపాటు అనంతపురంలోనే నిలిచిపోయింది. బసవ ఎక్స్‌ప్రెస్ 22బోగీలతో తిరుగుతుంది. ప్రాథమిక నిర్వహణ(ప్రైమరీ మెయింటైనెన్స్) మైసూరు కోచింగ్ డిపో,కాగా సెకండరీ మెయింటైనెన్స్‌ను బాగల్‌కోట్ సి అండ్‌డబ్ల్యూ డిపోలు నిర్వహిస్తున్నాయి. ఈ రైలుకు రెండు ఫార్మేషన్ రేక్స్ వినియోగిస్తున్నారు. ఒక రేక్‌ను ఐసిఎఫ్‌కు చెందిన బోగీలు సర్దుబాటు చేసి నడిపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కానీ ప్రయాణీకులకు, రైల్వే సిబ్బందికి అంతుబట్టని సమస్యగా మారిన బసవ ఎక్స్‌ప్రెస్ ఫార్మేషన్ రేక్‌ను లక్నోలోని రైల్వే జాతీయ పరిశోధన సంస్థ అయిన ఆర్‌డిఎస్‌ఓ హుబ్లీ కోచింగ్ డిపోలో అనువణువునా క్షుణ్ణంగా పరిశీలించి రెండో బోగిలలో సమస్యను గుర్తించి మరమత్తుల నిర్వహణ నిమిత్తం హుబ్లీ కోచింగ్ డిపోలోనే ఉంచి,మిగిలిన బోగీలతో కూడిన రేక్‌ను నడిపేందుకు అనుమతించినట్లు రైల్వే వర్గాలు చెబుతున్నాయి. అయినా బసవ ఎక్స్‌ప్రెస్‌ను బ్రేకింగ్ సిస్టమ్ సమస్యలు పునరావృతం అవుతున్నాయి. యాంత్రిక విభాగంలో నిష్ణాతులైన ఆర్‌డిఎస్ ఓ మెకానికల్ ఇంజనీయర్ల నిపుణుల బృందం ఏం గుర్తించింది, ఏం నిర్ధారించింది, సమస్య పరిష్కారానికి ఏం సలహా సూచనలు చేసిందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. యాంత్రిక సమస్యతో రైలు గంటల కొద్ది ఆలస్యంగా నిలిపోవడం, అదృష్టవశాత్తు ప్రయాణికుల ప్రాణాలకు ఎలాంటి సమస్య ఏర్పడకుండా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా లోకోపైలట్లు,గార్డులు,సిఅండ్‌డబ్ల్యూ సిబ్బంది ఎప్పటికప్పుడు సకాలంలో స్పందించి సమయస్ఫూర్తితో వ్యవహరించి రైలును ఎలాగోలా నెట్టుకొస్తున్నారు.

# సిఎం చేస్తున్న అభివృద్ధి కృషికి దేవుని ఆశీస్సులు కోరాను :మంత్రి కొల్లురవీంద్ర



**తిరుమల,ఆగస్టు 28 ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రమ,చేస్తున్న కృషికి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆశీస్సు లు ఉండాలని వేడుకున్నట్లు రాష్ట్రమంత్రి కొల్లురవీంద్ర తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చామని, ,ఇంకా పేదప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెంద డానికి అవసరమైన మౌళిక సదు పాయాల కల్పనపై సిఎం పట్టుదలతో అమలుచేసేందుకు చూస్తున్నారన్నారు. గురువారం ఉదయం రవీంద్ర విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



:వినాయక ఉత్సవ పందిరిలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరు లక్ష్మీశ

# రాష్ట్రంలో వాడ,వాడల గణపతి ఉత్సవాలు

**విజయవాడ,ఆగస్టు27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రవ్యాప్తంగా ఊరూరా, వాడవాడలా గణనాథులు అందంగా విభిన్న రూపాల్లో కొలువుదీరారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు వినాయకుని సేవలో తరించారు. గుంటూరు, విజయవాడలో భారీ వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. 16 టన్నుల మట్టితో: విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీనటరాజస్వామి ఆలయం, చిన్న రాజగోపురం ముందు కొలువైన గణపతి స్వామి వార్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డూండీ గణేష్ సేవ సమితీ ఆధ్వర్యంలో 72 అడుగుల భారీ గణనాథుడిని విజయవాడ సితార సెంటర్‌లో ఏర్పాటు చేశారు. ఎంపీ కేశినేని చిన్ని కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజను నిర్వహించారు. వినాయకుని అనుగ్రహంతో మంచి కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలని మైసూర్ దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. విజయవాడ పటమట దత్తపీఠంలో సామూహిక వినాయక వ్రతాలు నిర్వహించారు. గుంటూరులో 99 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గంగా నది తీరం నుంచి తెచ్చిన 16 టన్నుల మట్టితో ఈ విగ్రహాన్ని రూపొందించారు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పట్టు వస్త్రాలను సమర్పించారు. తర్వాత వినాయక స్వామి వ్రతకల్పంలో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వినాయకుడిని కర్నూలులో వేడుకున్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో సుప్రసిద్ధ శ్రీ దశభుజ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. 14 వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయంలో వినాయకుడు 15 అడుగుల ఎత్తు, 12 అడుగుల వెడల్పు, 10 చేతులు కలిగిన ఒకే రాతిలో చెక్కబడి ఉంటది. 1100 ఏళ్ల చరిత కలిగిన స్వామివారు: విశాఖ ఎంపీ సిటీ అతి పెద్ద గేటెడ్ కమ్యూనిటీలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకున్న స్థానికులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీకాకుళం విజయగణపతి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. దేవాలయంలో రంగు రంగుల పూలతో అందంగా అలంకరించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి స్వామివారి ఆలయంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

# రాజ్యాంగంలో మీడియా స్వేచ్ఛ అనేది ఎక్కడా లేదు

## - రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్




**విజయవాడ,ఆగస్టు28,ప్రభాతవార్తప్రతినిధి:** భారత రాజ్యాంగంలో మీడియా స్వేచ్ఛ అనేది ఎక్కడా లేదని.. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో ఇష్టం వచ్చినట్లుగా అబద్ధాలు ప్రచారం చేయడం సరికాదని ఏపీ మీడియా( ప్రెస్) అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ వ్యాఖ్యానించారు. సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో అమరావతిపై అబద్ధపు ప్రచారం, భావ ప్రకటన స్వేచ్ఛ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఎంతోమంది కన్నీరు పెట్టారన్నారు. ఆంధ్ర ప్రాంత ప్రజల కోసం ఒక రాజధానిగా అమరావతిని ఆనాటి ప్రభుత్వం ప్రకటించిందని, రాజకీయంగా అప్పుడు అందరూ ఆమోదం తెలిపారని గుర్తు చేశారు. ప్రజల సహకారంతో వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పారు. అయితే ప్రభుత్వం మారగానే అమరావతికి గ్రహణం పట్టిందన్నారు. రాజధానిని పూర్తిగా చంపేలా కుట్రలు చేశారని తెలిపారు. రాజధాని కోసం త్యాగాలు చేసిన రైతులను అవమానించారని, అమరావతిపై బురద జల్లడమే కాకుండా కుట్రలు చేశారని మండిపడ్డారు. మూడు రాజధానుల పేరుతో పక్కా ప్లాన్‌తో అమరావతి లేకుండా చేయాలని చూశారన్నారు. ఈ క్రమంలోనే అమరావతి ముంపు ప్రాంతం అని ప్రచారం చేయించారని చెప్పారు. ఇన్ సైడ్ ట్రేడింగ్ అని ప్రచారం చేయగా.. అదేం లేదని హైకోర్టు తీర్పు ఇచ్చిందని ఆలపాటి సురేష్ అన్నారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని గుర్తు చేశారు. అయితే మళ్లీ ఇప్పుడు అమరావతి మునిగిపోతుందంటూ అసత్య ప్రచారం మొదలైందన్నారు. సోషల్ మీడియాతో పాటూ ఒకవింగ్ ప్రధాన మీడియాలో అమరావతి చెరువు అంటూ కథనాలు రాశారన్నారు. రాజధాని ప్రాంతంలో వందల ఏళ్లుగా ప్రజలు నివాసాలు ఉంటున్నారని తెలిపారు. మొన్న వచ్చిన వరదలకే మునిగిపోయిందని రాశారని.. దీనిపై ప్రశ్నిస్తే.. భావ ప్రకటన స్వేచ్ఛ మాకు లేదా అని అంటున్నారని చెప్పారు. నిజాన్ని వక్రీకరించి.. దుర్మార్గంతో అబద్ధాలు ప్రచారం చేయడం.. భావ ప్రకటన స్వేచ్ఛ కిందకు వస్తుందా.. అంటూ నిలదీశారు. నిజాన్ని కాదని అబద్ధాలు చెప్పే హక్కు ఎవరికీ ఉండదని పేర్కొన్నారు. హక్కుల గురించి మాట్లాడేవారికి నిజాలు చూపే ధైర్యం ఉండాలంటూ ఆలపాటి సురేష్ అన్నారు. రాజ్యాంగం పేరుతో భావ ప్రకటనా స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కొన్ని భావస్వేచ్ఛ హక్కుల ద్వారా వచ్చిన హక్కులే మీడియాకు కూడా వర్తిస్తున్నాయని, ఎవరైనా రాజ్యాంగ వ్యవస్థ లకు కట్టుబడే పని చేయాలని గుర్తు చేశారు. మీడియా సమాజ శ్రేయస్సు, సమాజ హితం కోసం పని చేయాలని హితవుపలికారు. అమరావతిని ఎదగకుండా చేసే కుట్ర జరుగుతుందన్నారు. అందుకే పదే పదే అబద్ధాలు ప్రచారం చేస్తూ అమరావతిపై విషం చిమ్ముతున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టీ. సునీల్ చౌదరి మాట్లాడుతూభారత రాజ్యాంగం ఇచ్చిన భావప్రకటన స్వేచ్ఛతో పాటు దానికి సంబంధించిన బాధ్యతలను కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు.

# పోలీస్ కస్టడీకి నిడిగుంట అరుణ



**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 28 ప్రభాతవార్త :** ఒంగోలు జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న లేడీ డాన్ నిడిగుంట అరుణను కోర్టు ఉత్తర్వుల మేరకు గురువారం కోవూరు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఈ మేరకు మూడు రోజుల పాటు అరుణను కోవూరు పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులు కీలక సమాచారం చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ముఖ్యంగా రౌడీ షీటర్ జీవిత ఖైదు అనుభవిస్తున్న శ్రీకాంత్ పెరోల్ ఘటనలో అరుణ కీలకంగా పనిచేయడం విధితమే. ఈ మేరకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అరుణ దగ్గర పూర్తిస్థాయిలో సమాచారం రాబట్టేందుకు కోవూరు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ మూడు రోజుల పాటు శ్రీకాంత్ పెరోల్‌కు సంబంధించిన కీలక సాక్ష్యాన్ని సేకరించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

# కాణిపాకంలో త్వరలో వేదపాఠశాల ప్రారంభం

## - రాష్ట్రంలో 300 ఆలయాలకు పాలక మండలి ఏర్పాటు : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**కాణిపాకం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** రాషంలోని వైధిక యూనిర్సిటీ అనుమతులు తీసుకుని కాణిపాకం దేవస్థానంలో వేదపాఠశాలను ప్రారంభిస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వినాయకచవితి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి స్వామివారి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం సుమారు 4 కోట్లు రూపాయలతో అధునాతనంగా నిర్మించిన అన్నప్రసాద వితరణ భవన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కూటమి ప్రభుత్వం సనాతన ఆచారాలకు, సనాతన ధర్మానికి ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. ఈమేరకు వైదిక యూనివర్సిటీ అనుమతులు తీసుకుని కాణిపాకంలో త్వరలో వేదపాఠశాల ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే రాష్ట్రంలో 600 ఆలయాలకు పాలకమండళ్ళను నియమించడం జరిగిందన్నారు. మిగిలిన మరో 300 ఆలయాలకు కూడా పాలక మండలిల ఏర్పాటు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలైన కాణిపాకం,శ్రీకాళహస్తి, శ్రీశైలం, అన్నవరం, దుర్గగుడి, ద్వారకా తిరుమల, సింహాచలం ఆలయాలకు పాలకమండలిల ఏర్పాటుకు సీఎం ఆదేశాల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలో ఈఆలయాలకు పాలకమండలిలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే దేవాదాయశాఖలో ఖాళీగా వున్న 500 పోస్టులను త్వరలో భర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాష్ట్రంలోని 5,250 ఆలయాలకు ధూపదీప వైవేద్యం కోసం ప్రతి నెలా 10 వేల రూపాయలు వంతును నిధులను ఆలయాలకు చెల్లిస్తున్నట్లు మంత్రి రామనారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో జరిగే నిత్యకైంకర్యాలు, పూజాధి కార్యక్రమాలు ఆగమ శాస్త్రం ప్రకారమే జరగాలని, ఇందులో పాలకమండలిలు, అధికార యంత్రాంగం, ప్రభుత ం కాని జోక్యం చేసుకోకూడదని ప్రభుత్వం జీఓ విడుదల చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా రాష్ట్రం సర్వతోముఖాభివృది సాధించే విధంగా ఆశీర్వాదం అందించాలని స్వామివారికి తాము వేడుకున్నట్లు మంత్రి ఆనం తెలిపారు. ఈవిలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, దేవాదాయశాఖ కమీషనర్ రామచంద్రమోహన్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల

# దుర్గమ్మ ఆలయంలో వేడుకగా వినాయక చవితి ఉత్సవాలు



**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 28, ప్రభాతవార్త** దుర్గమ్మవారి ఆలయంలో బుధవారం వినాయకచవితి ఉత్సవాలను వేడుకగా నిర్వహించారు. శ్రీ నటరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో వున్న శ్రీ గణపతి స్వామి వారి ఆలయం నందు, కొండపైన చిన్న రాజగోపురం వద్ద వేంచేసియున్న శ్రీ మహాగణపతి స్వామివారికి (మృత్తికా గణపతిని ఇక్కడ ఏర్పాటు), చేసి ఉత్సవాలు ప్రారంభించారు. 27న ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, కలశస్థాపన, శ్రీ గణపతి హోమం, కథా శ్రవణం కార్యక్రమాలను చిన్నరాజగోపురం వద్ద నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరపగా ఇఓ వికె శీనానాయక్ పాల్గొన్నారు. 28 ఉదయం 8 గంటలకు శ్రీ గణపతి హోమం సాయంత్రం 4 గంటలకు ఆవాహన దేవతా హోమాలు, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరిపించారు. 29 ఉదయం 9.30 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 5 గంటలకు మృత్తిగా గణపతి స్వామివార్లను నిమజ్జనం నిర్వహిస్తామని భక్తులు పాల్గొని శ్రీ స్వామివార్ల కృపకు పాత్రులవ్వాలన్నారు. దుర్గమ్మ ఆలయంలో నిర్వహించబోయే దసరా ఉత్సవాలకుసంబంధించిన పనులను గురువారం ఇఓ వికె శీనానాయక్ ప్రారంభించారు. దుర్గాఘాట్ వద్ద నుండి అండర్‌గ్రౌండ్ బ్రిడ్జివద్ద నూతన వాటర్ ప్రూఫ్ రేకుల షెడ్డును నిర్మించారు. దీంతో భక్తులు దుర్గాఘాట్ నుండి కేశఖండనశాలకు సులువుగా చేరుకొనే వసతి కలిగింది.

# రూ.4 కోట్లు నూతన అన్నదాన భవన్ ప్రారంభం

**కాణిపాకం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా అధునాతనంగా నిర్మించిన అన్నదాన భవన్‌ను మంత్రి ఆనం రామరామనారాయణ రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వినాయకచవితి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి స్వామివారి పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం సుమారు 4 కోట్లు రూపాయలతో అధునాతనంగా నిర్మించిన అన్నప్రసాద వితరణ భవనాన్ని రాష్ట్ర దేవాదాయ,ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, దేవాదాయశాఖ కమీషనర్ రామచంద్రమోహన్, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్‌మోహన్‌లతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి నూతన అన్నదాన భవన్‌లోనే అధికారులు, ఎమ్మెల్యేలతో కలసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని అలయాల్లో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# కాణిపాకంలో వైభవంగా ధ్వజారోహణం

**కాణిపాకం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ధ్వజారోహణం కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఆలయంలో 21 రోజులుపాటు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఇందులో భాగంగా తొమ్మిది రోజులు పాటు జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ధ్వజారోహణం, అంకురార్పణ జరిగింది. ఈమేరకు ఉదయం స్వాతినక్షత్రం, శుభ తులాలగ్నం నందు ఉదయం 9.30 గంటల నుండి 10.10 గంటల మధ్య ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు బ్రహ్మదిదేవతలను ఆహ్వానించేందుకు ధ్వజారోహణం చేయడం ఆనవాయితీ. దుష్ట శకునాలు తగలకుండా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి అంకురార్పణ చేస్తారు. ఉదయం ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి అర్చకస్వాములు ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం ప్రధాన ఆలయంలలోని నూతన బంగారు ధ్వజస్థంభం వద్ద విఘ్నేశ్వరపూజ, అనుజ్ఞ, స్థలశుద్ధి, పుణ్యాహావాచనం, వాస్తుశాంతి, నవసంధిబలి, కలశపూజ, మూషికయాగం, ధ్వజపటపూజ, న్యాయాభిషేకం, భావనాభిషేకం నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా జరగడానికి, ఉత్సవాలకు బ్రహ్మాది దేవతలను ఆహ్వానిస్తూ బంగారు ధ్వజస్థంభంపై మూషికపటాన్ని ఎగురవేశారు. అనంతరం బంగారు ధ్వజస్థంభానికి పాలు, పెరుగు వంటి పలు రకాల సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం వేదపండితులు చతుర్వేద పారాయణం చేసి మరోమారు ధూపదీపనైవేద్యాలను సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో అంకురార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈమేరకు ఆర్చకులు గ్రామ సమీపంలో పుట్ట మన్ను సేకరించి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రధాన ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో అంకురార్పణ గావించారు. ఈ యాగశాలలో నవరాత్రి దీక్షాహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా అర్చక స్వాములు అష్టోత్తర కలశాలను (108) ఏర్పాటు చేసి పూజలు చేసి కలశస్థాపన, అగ్నిప్రతిష్టహోమం నిర్వహించారు.

అనంతరం బ్రహ్మోత్సవాలను దిగ్విజయంగా నిర్వహించడానికి కంకణబద్ధులై ఆలయ ఈఓ పెంచల కిషోర్, అర్చకులు ఆచార్య రక్షాబంధనాన్ని ధరించారు.

# ఎపి - ఒరిస్సామధ్య స్తంభించిన రవాణా

## చింతూరు ఏజెన్సీలో అధికారుల హై అలర్ట్ - భద్రాచలం వద్ద మళ్లీ పెరుగుతున్న గోదావరి



చింతూరు వద్ద శబరి నది ఉగ్రరూపం

**చింతూరు ఆగష్టు 27 ప్రభాతవార్త** గత మూడురోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న కుంభ వృష్టితో చింతూరు వద్ద శబరి నది ఉగ్రరైపం భయపెడుతుంది.గురువారం ఉదయం ఆరుగంటల చింతూరు వద్ద 38.5అడుగులు ఉన్న శబరి నది నీటి మట్టం సాయంత్రానికి కాస్త తగ్గి 36.5అడుగులకు చేరింది.భద్రాచలం వద్ద గోదావరి నది నీటి మట్టం క్రమ క్రమంగా పెరుగుతుంది.గురువారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరి నది నీటి మట్టం 38.3అడుగులు ఉండగా తెల్లవారే కల్ల భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం 48 అడుగులు దాటవచ్చని ప్రచారం జరుగుతుంది. శబరి నది వరద స్ధాయి భయపెడుతుంటంతో [illegible] అప్రమత్తమయ్యారు.ఎపి–ఒరిస్సాలను కలిపే జాతీయ రహదారి యన్.హెచ్.326 వరద నీటిలో మునిగిపోయింది.రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు [illegible] నిలిచిపోయాయి.చింతూరు [illegible] నిమ్మలగూడెం–కుయుగూరు గ్రామాల మధ్య జాతీయ రహదారి ఎన్.హెచ్.326పై లారీ [illegible] మునిగిపోయింది.శబరి ఎగువ ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజాము నుండి రాత్రి 8గంటల వరకు,గురువారం కూడా ఎడతెరిపి లేకుండా కుంభ వృష్టి కురిసింది.ఇప్పటికే శబరి నది ఎగువ ప్రాంతాల్లో ఉన్న ఒరిస్సా తీరానికి ఆనుకోని వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఎర్పడింది.దాంతో ఒరిస్సా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి.తెలంగాణాలోని దాదాపు అన్ని జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీచేసింది.భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం కేవలం పెరుగుతుండటంతో శబరి పరివాహ ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉంది.శబరినదిలో ప్రమాదకరస్ధాయిలో వరదనీరు వచ్చిచేరుతుండటంతొ అదే స్ధాయిలో గోదావరిలో వరదనీరు పెరుగుతుండటంతో ప్రమాదకర పరిస్ధితి నెలకొంది.అయితె మహారాష్ట్రతో పాటు గోదావరి ఎగువ ప్రాంతాల్లో కుంభ వృష్టి కారణంగా గోదావరి ఉపనదులు పొంగి ప్రవహిస్తున్నాయి.ఛత్తీస్‌ఘడ్‌లో ఇంద్రావది నది ప్రమాదకర స్ధాయిలో జగ్దల్‌పూర్ వద్ద 5.40మీటర్లు కాగా ప్రస్తుతం 5.20 నుంచి కాస్త తగ్గుముఖం పట్టినట్టు స్ధానికులు తెలిపారు.అయితె శబరి నది ఉగ్రరూపంతో చింతూరు నుంచి వి.ఆర్.పురం మండలాన్ని కలిపే రహదారి మొత్తం నీటమునిగిపోయింది.దాదాపు వంద గ్రామాలకు రహదారి సౌకర్యం లేకుండా పోయింది.శబరి నదికి ఉపనది అయిన సీలేరు నదిపై ఉన్న దాదాపు ఆరు భారీ ప్రాజెక్టుల్లో పెద్దగా నీటి నిలువలు లేవని,ప్రస్తుతానికి ప్రమాదం ఏమి లేదని అధికారులు సూచిస్తున్నారు.అయినా గురువారం శబరి నది వరద స్ధాయిని పరిశీలిస్తున్న అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,అవసరమైతె సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్ళలని ఉదయం నుంచి మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నారు.2006లో కూడా ఇదే స్ధాయిలో శబరి నదికి వరదపోటు రావటంతో ప్రజలు సామాన్లు తరలించే అవకాశం లేకుండా పోవటంతో అప్పట్లో ప్రజలు తీవ్ర నష్టాన్ని చవిచూశారు.అలాంటి పరిస్ధితి పునఃరావృతం అవుతుందేమో అనే భయం ఈ ప్రాంత ప్రజలను భయపెడుతుంది.అయితె 5రోజుల పాటు దాదాపు తెలంగాణా,మహారాష్ట్రా, ఛత్తీస్‌ఘడ్,ఒరిస్సా,ఎ పిలకు భారీ వర్ష సూచనను వాతావరణ శాఖ ఇప్పటికే జారీ చేసింది.గోదావరి ఎగువ ప్రాంతాల నుంచి దిగువ ప్రాంతానిక వరద చేరటానికి రెండు మూడు రోజులు పట్టే అవకాశం ఉండటంతో వరద ప్రమాదం ప్రస్తుతానికి ఉండక పోవచ్చని ముంపు ప్రాంతాల ప్రజలు అంచనా వేస్తున్నారు.

# భారీ వర్షాలపై తెలంగాణ మాజీ సిఎం కెసిఆర్ ఆందోళన

## సహాయకచర్యలు చేపట్టాలని కెటిఆర్‌కు ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 28:** రాష్ట్రంలో అతి భారీ వర్ష సూచన తెలంగాణలో కురుస్తున్న కుండపోత వర్షాలు, వరదల కారణంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని పార్టీ శ్రేణులను ఆదేశిస్తూ, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కీలక సూచనలు చేశారు. వరద తీవ్రత ఎక్కువగా ఉన్న పలు జిల్లాల పార్టీ నేతలతో ఆయన స్వయంగా ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అండగా నిలిచి, అవసరమైన సహాయాన్ని అందించేందుకు పార్టీ శ్రేణులను వెంటనే రంగంలోకి దించాలని కేటీఆర్‌కు స్పష్టం చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, వరంగల్, ఖమ్మం సహా అనేక జిల్లాల్లో వరదల కారణంగా నివాస ప్రాంతాలు నీట మునగడం, రహదారులు తెగిపోయి రవాణా వ్యవస్థ స్తంభించడంపై ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాజెక్టులు, చెరువుల నుంచి నీరు పోటెత్తడంతో వందలాది ఎకరాల్లో పంటలు నాశనమై ఇసుక మేటలు వేశాయని, ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు, రాష్ట్రంలో నేడు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.



గురువారం మూసీ రివర్ డెవలప్‌మెంట్‌పై జూబ్లీహిల్స్ నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

# వందేళ్ల అవసరాల దృష్ట్యా మూసీ పరీవాహక అభివృద్ధి

## గాంధీసరోవర్ అభివృద్ధిపై పలు డిజైన్లను పరిశీలించిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 28:** గేట్ వే ఆఫ్ హైదరాబాద్, గాంధీ సరోవర్ అభివృద్ధితోపాటు జంక్షన్ల ఏర్పాటు, రోడ్ల అభివృద్ధిపై అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలుసూచనలు చేశారు. సిగ్నల్‌రహిత జంక్షన్లను ఏర్పాటు చేయాలని వచ్చే వందేళ్ల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మూసీనది పరీవాహక అభివృద్ధి జరగాలని చెప్పారు. మూసీరివర్ డెవలప్‌మెంట్‌పై జూబ్లీహిల్స్ నివాసంలో ఉన్నతా ధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష చేశారు. ఈ సందర్భంగా గాంధీ సరోవర్ అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను సిఎం పరిశీలించారు. అభివృద్ధి పర్యావరణ హితంగా ఉండేలా ప్రణాళికలు ఉండాలని సూచించారు. మీరాలం చెరువు అభివృద్ధి, ఐకానిక్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రణాళికలను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వీలైనంత త్వరగా డీపీఆర్ సిద్ధంచేసి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పరిశ్రమల శాఖ ప్రిన్సి పల్ సెక్రటరీ జయేశ్‌రంజన్, సిఎం సెక్రటరీ మాణిక్‌రాజ్, సెక్రటరీ (హెచ్‌ఎండీఏ ఏరియా) ఇలంబర్తి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, ఎఫ్‌సిడిఎ కమిషనర్ కె. శశాంక, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి ఎండి అశోక్‌రెడ్డి, ఎంఆర్‌డిసిఎల్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, జెఎండి పి.గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# వ్యవసాయ అధికారుల పొలం బాట

## డిజిటల్ సర్వే ప్రారంభం, అక్టోబరుకల్లా పూర్తి

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** వ్యవసాయ శాఖాధికారులు పొలం బాట పట్టనున్నారు. వానాకాలం సీజన్‌లో రైతులు ఎంత విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగు చేశారనే విషయమై డిజిటల్ సర్వే చేయనున్నారు. దీనికి సంబంధించి ఈ నెల గురువారం నుంచి సర్వే ఆరంభించారు. ప్రస్తుత వానాకాలం సీజనుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సర్వేతోపాటు కేంద్ర ప్రభుత్వం కూడా డిజిటల్ క్రాప్ సర్వే చేయిస్తున్నది. డిజిటల్ క్రాప్ సర్వే చేయాలంటే తప్పనిసరిగా క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. పొలాల వద్దకు వెళ్లి పంటలను రైతుతో కలిసి ఫొటోలు తీసి రైతు వివరాలు, సర్వే నంబర్, పట్టాదారు పాసు పుస్తకం నంబర్, సాగు చేస్తున్న పంట, విస్తీర్ణం వివరాలు నమోదు చేసి అప్‌లోడ్ చేయాలి. ఆ తర్వాత సర్వే వివరాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. పంటల సాగు వివరాలు నమోదు చేయడం వల్ల రైతులకు ప్రభుత్వం అందించే వ్యవసాయ పథకాలు, పంట ఉత్పత్తుల విక్రయాల వివరాలతో పాటు, కేంద్రం అమలు చేసే రైతు పథకాలు దుర్వినియోగం కాకుండా అర్హులైన వారికి అందించే వీలుంటుంది. డిజిటల్ క్రాప్ సర్వేలో ఒక రైతు తాను పండించిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఎంత విస్తీర్ణంలో సన్నరకం వరి పంట వేశారో, తద్వారా ఎంత దిగుబడి వస్తుందో, అంతకు మాత్రమే బోనస్ చెల్లిస్తారు. అలాగే పంటల సాగు విస్తీర్ణాన్ని బట్టి పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకునేందుకు దోహద పడనున్నది. అక్టోబర్ నెలాఖరు వరకు సర్వేను పూర్తి చేయనున్నారు.

# వర్ధమాన్ మహిళ కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్‌గా మహేందర్‌కుమార్‌జైన్ గోలేచా ఏకగ్రీవం



మహేందర్ కుమార్‌జైన్ గోలేచా

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** వర్ధమాన్ మహిళ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ ఛైర్మన్‌గా మహేందర్ కుమార్‌జైన్ గోలేచా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన బోర్డు సమావేశంలో ఆయననకు ఏకగ్రీవంగా ఎనుకున్నారు. 1987 నుంచి చార్టర్డ్ అకౌం ట్‌లో ఉన్న అనుభవం ఉన్న ఆయన 2015 నుంచి బోర్డులో డైరెక్టర్‌గా సేవ లందించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా బోర్డు ఆఫ్ మేనేజ్ మెంట్ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

## భారీ వర్షాలు, వరదల నష్టాలపై

# ప్రాథమిక నివేదికను సమర్పించండి

## వివిధ శాఖల కార్యదర్శులతో సిఎస్ రామకృష్ణారావు సిఎస్ టెలీకాన్ఫరెన్స్

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. రాష్ట్రంలో గత కొద్దీ రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలవలన జరిగిన నష్టాలపై వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో నేడు సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు రాహుల్ బొజ్జ, రఘునందన్ రావు, శ్రీధర్ , పోలీస్ శాఖ డిజిపి అడిషనల్ డిజి మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధానంగా నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాలు అధికంగా నష్టాన్ని చవి చూశాయని, వీటితో పాటు ఇతర జిల్లాల్లో కూడా గణనీయమైన నష్టం వాటిల్లిందని అన్నారు.

ఈ నష్టాలకు సంబంధించి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ఈ ప్రాథమిక నివేదికలతో పాటు జరిగిన నష్టాలను తెలియచేసే ఫోటోలు,వీడియో క్లిప్పింగులు, పత్రిక క్లిప్పింగులు కూడా జతపర్చాలని సిఎస్ పేర్కొన్నారు. వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు నష్టాలపై పంపిన ఈ ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖకు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని రామకృష్ణారావు ఆదేశించారు. వర్షాలు మరికొన్ని రోజులు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తతతో ఉండాలని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు నిబంధనలను అనుసరించి ఎక్స్‌గ్రేషియాను అందచేయాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూర్తి స్థాయిలో సమీక్షి ంచనున్నందున సంబంధిత శాఖలన్ని వివరాలతో, తీసుకున్న చర్యల నివేదికలతో సిద్ధంగా ఉండాలని కోరారు.

# తగ్గిన విద్యుత్.. గరిష్ట అంచనా 277 గిగావాట్లు

## సీజనులో 242 గిగావాట్ల డిమాండ్

## గత యేడాది కంటే తగ్గిన 8 గిగావాట్లు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ డిమాండ్ భారీగా తగ్గిపోయింది. ప్రస్తుత 2025-26 సంవత్సరానికి అంచనా వేసిన డిమాండ్ కంటే తక్కువగా రికార్డు అయింది. ప్రస్తుత సీజనులో 277 గిగావాట్ల గరిష్ట స్థాయికి విద్యుత్ డిమాండ్ చేరుకుంటుందని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. అయితే అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ వినియోగంలో తగ్గుదల చోటు చేసుకుంది. వచ్చే నెల సెప్టెంబర్ నాటికి గరిష్టంగా 277 గిగావాట్ల మేర విద్యుత్ వినియోగం జరుగుతుందని అంచనా వేసిన మంత్రిత్వ శాఖ అందుకు అనుగుణంగా స్వల్పకాలిక, దృక్పథ ప్రణాళికలను రూపొందించింది. అయితే ఈ అంచనా కంటే తక్కువగా 242 గిగావాట్ల మేర విద్యుత్ డిమాండ్ రికార్డయింది. గత ఏడాది ఇదే కాలానికి 250 గిగావాట్ల చొప్పున విద్యుత్ వినియోగం జరిగి. అది ఆల్ టైమ్ హైగా కేంద్రం గుర్తించింది. ఈ లెక్కన ప్రస్తుత సంవత్సరం అంచనా వేసిన విద్యుత్ కాదుకదా, గత ఏడాది డిమాండ్ కంటే 8 గిగావాట్ల విద్యుత్ తక్కువగా నమోదు కావడం విశేషం. అంతకు ముందు ఏడాది 2023 సెప్టెంబర్ వరకూ 243.27 గిగావాట్ల విద్యుత్ వినియోగం జరిగింది. ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్, జూలైతో పాటు, ఈ నెలలో ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కాగా ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 427 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగిన కేంద్రాలు ఉండగా, దాన్ని 2030 నాటికి 900 గిగావాట్ల ఉత్పత్తి సామర్థ్యానికి పెంచేందుకు ప్రతిపాదనలు చేస్తోంది. వీటితో పాటు, 500 గిగావాట్ల నాన్ ఫాసిల్ విద్యుత్ సామర్థ్యాన్ని వ్యవస్థాపించే దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటికే గత నెలాఖరు నాటికి 187.5 గిగావాట్ల మేర నాన్ ఫాసిల్ ఇంధన వనరుల నుండి విద్యుత్ ఉత్పత్తి సాధించింది. ఇదే సమయంలో విద్యుత్ రంగాన్ని సంస్కరించే లక్ష్యంతో గ్రీన్ హైడ్రోజన్ తయారీ వంటి ఇటెన్సివ్ పరిశ్రమలకు ఇంధన భద్రతను పెంచే లక్ష్యంతో కొత్త నిబంధనలు అమల్లోకి తెస్తోంది. అలాగే విద్యుత్ మెరుగుదలను పెంపొందించే విస్తృత వ్యూహంలో భాగంగా విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలను తగ్గించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

# భారీ వర్షాల వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బందులు రాకుండా చర్యలు

## నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

## మంత్రి రాజనర్సింహ ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజారో గ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభావిత జిల్లాల వైద్యాధికారులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ గురువారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో టెలిఫోన్‌లో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాలలో వర్షాలు అధికంగా కురుస్తున్న మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి, సిరిసిల్లా, సిద్దిపేటలతో పాటు ఇతర జిల్లాలలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అధికారులను అదేశించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను సురక్షి త ప్రాంతాలకు తరలించేందుకు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. స్నేక్ బైట్‌లు, సీజనల్ వ్యాధులు విస్తరించకుండా అవసరమైన మందులు అందుబాటులో ఉంచు కోవాలని మంత్రి అధికారులను అదేశించారు. వచ్చే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి అదేశించారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, ఫార్మా సిస్టులు, అసుపత్రి సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి అదేశించారు. జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తంగా మారిన నేఫథ్యంలో ప్రజలకు తక్షణ వైద్య సాయం అందించటంపై వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిరంతరం జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను అదేశించారు. లోతట్టు ప్రాంతాలు, వర్ష ప్రభావానికి గురైన ప్రాంతాలలో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, అంటు వ్యాధులు ప్రభలకుండా మెరుగైన పారిశుధ్య చర్యలు తీసుకోవటానికి పురపాలక, పంచాయితీరాజ్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి రాజనర్సింహ అధికారులను అదేశించారు. రెవిన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయితీ, డిజాస్టర్ మెనేజ్మేంట్ అధికారులతో సమన్వయం చేసుకొని అధిక వర్షా ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని

## రాష్ట్రంలో భారీ వర్షాలపై

# అప్రమత్తంగా ఉండాలి

## పోలీసులు సహకరించాలి

## 2,000 మందిని రక్షించాం: డిజిపి జితేందర్

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కురుస్తున్న భారీ కుండపోత వర్షాలపై పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నట్లు డిజిపి జితేందర్ అన్నారు.వరదల సహాయక చర్యలకై డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. సుమారు 10మంది మృతి చెందినట్లు భావిస్తున్నాం. అయితే ఇంకా పక్కా సమాచారం లేదు. ప్రజందరూ సురక్షి తంగా ఉండాలని పేర్కొన్నారు. అయి



తే ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఆర్మీసాయంతో ఇప్పటికి రెండు వేలమందిని కాపాడామని పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెండు వేలమంది సిబ్బందితో ఎస్డీఆర్‌ఎఫ్ ఏర్పాటు చేసి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన్నట్లు వివరించారు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి చర్యలు తీసుకుంటుందన్నారు. ఓవైపు గణేష్ ఉత్సవాలు ఉన్నప్పటికీ వరదలపై పోలీస్ శాఖ పోరాటం సాగిస్తుందని చెప్పారు. సహయక చర్యలకై డిజిపి కార్యాలయంలో అత్యవసర బృందా లను సిద్ధంగా ఉన్నట్లు, ఎలాంటి విపత్తు వచ్చిన ఎదుర్కొంటాం. ఎక్కడ కూడా ప్రజల ప్రాణాలు పోకుండా రెస్క్యూ చేస్తున్నామని వెల్లడించారు. గత ఏడాది నుంచి ఎస్డీఆర్‌ఎఫ్ మంచి ఫలితాలు ఇచ్చిందని, అన్ని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలిస్తూ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షి స్తున్నామని జితేందర్ తెలిపారు.

# వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటాం

## జిల్లాకు రూ. కోటి వరద సహాయం

## మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 28 ప్రభాతవార్త :** వరద బాధితులను అన్ని విధాల ఆదుకుం టామని వరద సహాయక చర్యలపై ఇప్పటికే కోటి రూపాయలు మంజూరు చేశామని అత్యధిక నిధుల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ప్రత్యేక అధికారి డాక్టర్ హరీష్, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్, ఇతర శాఖల జిల్లా అధికారులతో మెదక్ జిల్లా భారీ వర్షాలు వరదలు సహాయక చర్యలపై సమీక్షి ంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒడిశాలో ఏర్పడిన ఉపరితల ద్రోని వలన మెదక్ జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాలు కురుస్తున్నాయన్నారు. 40 యేళ్లలో మెదక్ జిల్లాలో ఇంత మేరకు అత్యధిక భారీ వర్షపాతం చూడలేదన్నారు.

పునరావాస కేంద్రాల్లో వరద బాధి తులకు జిల్లా యంత్రాంగం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు.

వరద నీరుచేరి బిల్డింగ్‌పైకి చేరుకున్న ప్రజలను హెలికాప్టర్ ద్వారా తరలించాలని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యుడు మైనంపల్లి రోహిత్‌రావు విజ్ఞప్తి చేసినప్పటికీ వాతావరణ ప్రతికూల ప్రభావంతో హెలికాప్టర్ వెళ్లలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. విపత్తు నిర్వహణ బృందం సహాయక చర్యలు నిమగ్నమై వారిని పునరావస కేంద్రాలకు తరలిం చామన్నారు. అనంతరం ఇరిగేషన్ వ్యవసాయ శాఖ, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బి శాఖలవారీగా వరద నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ ప్రకృతి విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి జిల్లా పాలన యంత్రాంగం అప్రమత్తంగా ఉంద న్నారు. మెదక్ జిల్లా భారీ వర్షాలు వరద ఉధృతిపై హవేలి ఘనపూర్ మండ లం జలదిగ్బంధంలో చిక్కుకుందని అత్యధికంగా 300 మిల్లీమీటర్లు మీటర్ల వర్షపాతం నమోదయిందని తెలిపారు. రామాయం పేటలో వరద ఉధృతి వలన మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసం కాగా వెంటనే పునరుద్ధరణ చామన్నారు. అనంతరం మంత్రి



వరదప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి

పునరావాస కేంద్రాలలో ప్రజల సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు, హెల్త్ క్యాంపును సందర్శించి ఎటు వంటి అనారోగ్య పరిస్థితి తలెత్తకుండా చికిత్సలు అందించా లన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహదినంగా నిరసన

## తెలంగాణ ఎంప్లాయిస్ జెఎసి

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్ అధికారులు, కార్మిక పెన్షనర్స్ అందరూ కలిసి సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినం నిర్వహించాలని నిర్ణయించారు. సెప్టెంబరు 1న పాత పెన్షన్ సాధన సభను నిర్వహించాలని తెలంగాణ ఎంప్లాయిస్ జెఏసి నిర్ణయించింది.

గత 20 సంవత్సరాలుగా ఉద్యోగ వర్గాన్ని నాశనం చేస్తూ వారిని పారిశ్రామికవేత్తలకు పెట్టుబడిదారులుగా మార్చి ఉద్యోగుల భవిష్యత్తును దళారీ మార్కెట్‌కి తాకట్టు పెట్టిన సిపిఎస్,యుపిఎస్ స్కీములను అంతమొందించి, పాత పెన్షన్ పునరుద్ధరణపై ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయుటకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో భాగంగా 15 లక్షల ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, గెజిటెడ్ అధికారుల పెన్షనర్ల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నేతృత్వంలో సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినంగా ప్రకటిస్తూ, 'పాత పెన్షన్ సాధన సభ' నిర్వహించనున్నారు. పాత పెన్షన్ సాధన కోసం నల్లబ్యాడ్జీలు ధరించి హైదరాబాదులోని ఆర్‌టిసి కళాభవనంలో సభను నిర్వహించనున్నారు.

# వినాయకసాగర్‌లోనే 6న గణేశ విగ్రహాల నిమజ్జనం

**హైదరాబాద్ (గోషామహల్), ఆగస్టు 28, ప్రభాతవార్త:** వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవార ం భాగ్యనగర్ గణేశఉత్సవ సమితి ఆధ్వ ర్యంలో సిద్ధియంబర్‌బజార్‌లోని బహెతిభవన్‌లో వినాయకపూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో హర్యానా మాజీ గవర్నర్ దత్తాత్రేయ, ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, ప్రధానకార్యదర్శి డాక్టర్ రవినూత శశిధర్, సలహాదారులు నర్సింగ్ పూరియా, మాజీ కార్పొరేటర్, ఉపాధ్యక్షులు మెట్టు వైకుంఠం, రామరాజు, కె.మహేందర్, గోవింద్‌రాఠి, శ్రీరామ్‌వ్యాస్, ఉత్సవ సమితి ప్రతినిధులతో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ హిందువులలో వస్తున్న ఐక్యత, ధర్మరక్షణ కోసం ఉపయోగపడాలని అందుకోసం ప్రతి హిందువు కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధానకార్యదర్శి డాక్టర్ రవి నూతల శశిధర్ మాట్లాడుతూ వచ్చే నెల 6న వినాయకసాగర్‌లోనే నిమజ్జన కొనసాగుతుందన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలన్నారు. స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. విదేశీ వస్తువులను బహిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో 24 నియో జకవర్గాల గణేశ ఉత్సవ సమితి ప్రతినిధులు తదితరులు విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ పాల్గొన్నారు.

# రాజ్యాంగ రక్షణ కోసమే ఉపరాష్ట్రపతి ఎన్నికలు

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రజాస్వామ్య పరిరక్షకుడు


## సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** ఉపరాష్ట్రపతి ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షకులకు, రాజ్యాంగ వ్యతి రేకులకు మధ్య జరుగుతున్న పోరు అని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రజాస్వామ్య పరిరక్షకుడని కొనియాడారు. ఢిల్లీలోని ఏపీ భవన్ వద్ద నారాయణ మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల కూటమి నుంచి ఉపరాష్ట్ర పతి అభ్యర్థిగా ఎంపిక చేసిన జస్టిస్ సుదర్శన్ రెడ్డి కింది స్థాయి నుండి సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా, అభ్యుదయ వాదిగా, రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా పేరు గడించిన వ్యక్తి అని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేరును ప్రతిపాదించిన వెంటనే ఎన్డీఏ కూటమిలో తీవ్రమైనటువంటి భయం, వణుకు నెలకొందన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని మావోయిస్టు అంటూ వ్యాఖ్యానించడాన్ని నారాయణ తప్పు పట్టారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి పట్ల బిజెపిలోని భయాన్ని వ్యక్తం చేస్తున్నదని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో సుదర్శన్ రెడ్డిని అంతమొందిస్తారా అంటూ అమిత్ షా వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఇప్పటిదాకా ఉపరాష్ట్ర పతిగా ఉన్న జగదీప్ ధనకర్ ఏమైపోయారో, అసలు ఉన్నారో లేరో కూడా అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బిజెపికి వ్యతిరేకంగా ఉన్నందునే జగదీప్ ధన్కర్‌ను అర్ధాంతరంగా ఆ పదవి నుండి వైదొలిగేలా చేశారని విమర్శించారు. ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో విపక్ష పార్టీలన్నీ కలిసి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించామని, ఆయన అభ్యర్థిత్వానికి భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని స్పష్టం చేశారు. సుదర్శన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఇండియా కూటమికి దూరంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వాగతించిందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పనిచేసే ఆయన్ని గెలిపించుకోవడం చాలా అవసరమన్నారు. ఏపీలో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు ప్రతిపక్షనేత జగన్ ఈ విషయంలో ఆలోచించాలని, తెలుగువాడైన సుదర్శన రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు.

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ సుదర్శన్ రెడ్డి కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలిపిన అభ్యర్థి అంటూ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. తెలుగువాడైన జస్టిస్ సుదర్శనరెడ్డికి తెలుగు రాష్ట్రాల్లోని అన్నీ పార్టీలు తమ రాజకీయాలను పక్కన పెట్టి మద్దతు ఇవ్వాలని కోరారు.ఈ ఎన్నికల్లో బిజెపిని ఓడించడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఉందన్నారు.

# భారీ వర్షాలపై కేంద్రం ఆరా



## కాంగ్రెస్‌కు రాష్ట్రంలో దిక్కూ, మొక్కూ లేని పరిస్థితి

## అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో దిక్కూ, మొక్కూ లేని పరిస్థితి కనిపిస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో భారీ వర్షాలతో ఒకవైపున ప్రకృతి వైపరీత్యం కారణంగా కాలువలు పొంగిపోతున్నాయి, వాగులు నిండిపోతున్నాయి, చెరువులు పూర్తి స్థాయికి చేరుకున్నాయి. మరొకవైపు అనేక నగరాల్లో మోకాళ్ల లోతు నీళ్లు నిల్వ ఉండటం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కార్యకర్తలను, ప్రజా ప్రతినిధులను అప్ర మత్తం చేశారు. సహాయక చర్యల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పిలుపునిచ్చారు. ఎప్పటి కప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులపై బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాష్ట్ర మంత్రులతో, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడితో చర్చలు జరిపారు. బిజెపి కార్యకర్తల యంత్రాంగాన్ని కూడా అప్రమత్తం చేసి సహాయక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. కాంగ్రెస్ అధిష్టానం హైదరాబాద్ – ఢిల్లీ మధ్య ముఖ్యమంత్రిని ఫుట్‌బాల్‌లా తిప్పుతుందన్నారు. ఇది కొత్త విషయం కాదు. గతంలో ఆంధ్రప్రదేశ్, ఇప్పుడు తెలంగాణ – రెండింటిలోనూ ముఖ్యమంత్రులను ఫుట్‌బాల్‌లా ఆడుకోవడం తరచుగా చూసిన సంగతే.ప్రస్తుతం ఈ ముఖ్యమంత్రి కూడా అదే పరిస్థితికిలోనై హైదరాబాద్ – ఢిల్లీకి చక్కర్లు కొడుతూ, రాజకీయంగా నలిగిపోతున్నారు. ఇది కాంగ్రెస్‌లోని అంతర్గత విభజనకు, రేవంత్ రెడ్డి పరిస్థితికి నిదర్శనం. కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డిని బీహార్ ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని, తెలంగాణ నుంచి బీహార్ ట్యాక్స్ వసూలు చేయాలని చూస్తుందన్నారు. ఆయనను ఒక పావులా తిప్పుతూ వ్యవహరిస్తున్నారు.ఒకవైపున ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆస్తి, ప్రాణ నష్టాలు ఎదురవుతున్న సమయంలో కాంగ్రెస్ నేతలు మాత్రం ఓటు చోరీ గురించి కొత్తగా మాట్లాడుతున్నారు. కానీ అసలు ఓటు చోరీ ఎవరు చేస్తున్నారో ప్రజలకు బాగా తెలుసు.కొత్తగా పిసిసి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ కుమార్ గౌడ్ ఎప్పుడూ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవలేని నాయకుడు. ఒకసారి కూడా ధైర్యంగా పోటీ చేయని ఆయనను కేవలం అధిష్ఠానం నిర్ణయంతో పదవిలోకి తీసుకురావడం జరిగిందన్నారు.



బస్తీబాటలో పాల్గొన్న తెలంగాణ సదరన్ డిస్కం సిఎండి ముషార్రఫ్ ఫరూఖీ

# విద్యుత్ సమస్యల పరిష్కారంతోపాటు ప్రమాదాల నివారణకు చర్యలు

## సదరన్ డిస్కం సిఎండి ముషారఫ్ ఫరూఖీ

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాతవార్త:** తెలంగాణ సదరన్ డిస్కం సిఎండి ముషర్రఫ్ ఫరూకీ బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా వైట్‌ఫీల్డ్ సెక్షన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ వడ్డేర బస్తీని సందర్శించారు. స్థానిక ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి విద్యుత్ సంబంధిత సమస్యలను ఆరాతీశారు. విద్యుత్ ప్రమాదాల నివారణకుగాను అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారికి మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు సీఎండీ తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం వహించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆపరేషన్స్ నర్సింలు, సిఇ పాండ్యా నాయక్, ఎస్ఇ చంద్రశేఖర్, డిఇ శ్యాంకుమార్, ఎడిఇ కమలాకర్, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

29-08pg10exHMNWJQEB 12 ONG_29-08pg10exHMNWJQEB.qxd 8/28/2025 11:35 PM Page 1



# ఆసియా కప్‌లో బ్యాట్స్‌మెన్ దండయాత్ర




## రికార్డులు బద్దలు కొట్టిన టీమ్స్

**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్‌లో పరుగుల వర్షం కురుస్తుండటం సర్వసాధారణం. ఏసియా కప్ టీ20 టోర్నీలోనూ బ్యాట్స్‌మెన్ తమ సత్తా చాటుతూ తమ టీమ్‌లకు భారీ స్కోర్‌లు అందిస్తున్నారు. ఏసియా కప్ టీ20 చరిత్రలో 2022లో నమోదైన టాప్5 భారీ స్కోర్లలో భారత్ రికార్డు సృష్టించింది. ఆఫ్ఘానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ సాధించిన స్కోరు ఏసియా కప్ టీ20 చరిత్రలో అత్యధిక స్కోరుగా నిలిచింది. కేవలం రెండు వికెట్లు కోల్పోయి 20 ఓవర్లలో 212 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అద్భుతమైన సెంచరీ సాధించి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ భారీ లక్ష్యం ముందు ఆఫ్ఘానిస్తాన్ జట్టు పూర్తిగా చేతులెత్తేసింది. అలాగే షార్జాలో పాకిస్తాన్ కూడా హాంకాంగ్‌పై భారీ స్కోరు సాధించింది. ఈ పోరులో పాకిస్తాన్ కేవలం 2 వికెట్లు నష్టపోయి 193 పరుగులు చేసింది. కెప్టెన్ బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్ భాగస్వామ్యంతో పాకిస్తాన్ 193 పరుగుల భారీ లక్ష్యం నిర్మించింది. ఈ స్కోరు హాంకాంగ్‌కు చాలా కష్టమైంది. పాకిస్తాన్ సునాయాసంగా గెలిచి తమ బలాన్ని నిరూపించుకుంది. ఇది పాకిస్తాన్ జట్టుకు ఏసియా కప్ టీ20 చరిత్రలో అత్యధిక స్కోరుగా నమోదైంది. ఇక భారత్, హాంకాంగ్ మధ్య 2022లో దుబాయ్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో అత్యధిక స్కోరు 192/2. ఆసియా కప్‌లో అత్యధిక స్కోరు చేసిన ఈ జాబితాలో భారత జట్టు మరోసారి చేరింది. 2022లో హాంకాంగ్‌పై భారత జట్టు మరోసారి అద్భుత ప్రదర్శన చేసింది. సూర్యకుమార్ యాదవ్, విరాట్ కోహ్లీ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత్ 20 ఓవర్లలో 192 పరుగులు చేసింది. ఇది ఏసియా కప్ టీ20 చరిత్రలో మూడవ అత్యధిక స్కోరుగా రికార్డయింది. ఇక అదే ఏడాది దుబాయ్ వేదికగా శ్రీలంక, బంగ్లాదేశ్ జరిగిన మ్యాచ్ చాలా ఉత్కంఠగా సాగింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన శ్రీలంక కేవలం 19.2 ఓవర్లలోనే 8 వికెట్లు కోల్పోయి 184 పరుగుల లక్ష్యాన్ని చేధించింది. శ్రీలంక బ్యాట్స్‌మెన్ ఓపికతో ఆడుతూనే దూకుడు ప్రదర్శించి ఈ విజయం సాధించారు. అత్యధిక స్కోరు సాధించిన జట్లలో టాప్ 5లో బంగ్లాదేశ్-శ్రీలంక ఉంది. అదే ఏడాది దుబాయ్ వేదికగా జరిగిన అదే మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ కూడా అద్భుతంగా ఆడింది. వారు 20 ఓవర్లలో 183 పరుగులు చేశారు. కానీ, శ్రీలంక చివరి ఓవర్లలో విజృంభించి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్ ఏసియా కప్‌లో అత్యంత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లలో ఒకటిగా నిలిచింది.

### బాక్సింగ్ టోర్నమెంట్‌లో..

## మెరిసిన భారత్ బాక్సర్లు

# ధృవ్, ఉదయ్

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ యూత్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత జూనియర్ బాలురు తమ సత్తాను చాటారు. చైనాలోని జిన్జియాంగ్‌లో జరుగుతున్న 3వ "బెల్ట్ అండ్ రోడ్" ఇంటర్నేషనల్ యూత్ బాక్సింగ్ గాలా-అండర్



17/19/23 టోర్నమెంట్‌లో రెండో రోజు గురువారం జరిగిన నాలుగు బౌట్లలో భారత యువ బౌలర్లు క్లీన్ స్వీప్ చేయడం ఈ రోజు హైలైట్. ఉజ్బెకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మరియు అజర్‌బైజాన్ నుండి వచ్చిన ప్రత్యర్థులను భారత యువ బౌలర్లు ఓడించారు. ధ్రువ్ ఖర్బ్ ఉజ్బెకిస్తాన్‌కు చెందిన యార్కింజోనోవ్ అబ్దుగానిపై 5:0 తేడాతో ఆధిపత్య విజయం సాధించాడు. ఉదయ్ సింగ్ కూడా అదే బాటలో నడిచాడు, ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన హబీబీ మొహమ్మద్ జాకిపై మరో క్లినికల్ 5:0 తేడాతో గెలుపొందాడు. అజర్‌బైజాన్‌కు చెందిన మెహతీవ్ తునార్‌పై నాకౌట్ విజయంతో ఉధమ్ సింగ్ రాఘవ్ అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఆశిష్ ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన సలాంగి ఫర్హాద్‌పై 5:0 తేడాతో ఆధిక్యం సంపాదించాడు. ఈ ఎడిషన్‌లో భారత్ 59 మంది సభ్యుల బృందాన్ని రంగంలోకి దించింది. ఇందులో 20 మంది బాలురు మరియు 20 మంది బాలికలు ఉన్నారు.

### ఉమెన్ ఛాంపియన్‌షిప్‌లో..

# టీమిండియా డబుల్ గోల్ఫ్

### 5-0తో భూటాన్ చిత్తు




**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్17 మహిళల ఛాంపియన్‌షిప్-2025లో తమ నాలుగో మ్యాచ్‌లో టీమిండియా భూటాన్‌ను 5-0 తేడాతో ఓడించింది. థింపులోని చాంగ్లిమితాంగ్ స్టేడియంలో గురువారం ఆట ప్రారంభమయ్యే సమయానికి యంగ్ టైగ్రెస్సెస్ 3-0 ఆధిక్యంలో ఉంది. నాలుగు రోజుల వ్యవధిలో ఇరు జట్ల మధ్య ఇది రెండవ మ్యాచ్.

మొదటిది భారత్ 8-0 తేడాతో విజయం సాధించింది. గత ఆటలో హ్యాట్రిక్ సాధించిన అనుష్క కుమారి రెండుసార్లు గోల్స్ చేసి, ఐదవ గోల్స్‌కు సహాయం చేసింది. టోర్నమెంట్ లో ఇప్పటివరకు ఆమె వ్యక్తిగత గోల్స్ సంఖ్యను ఏడుకు చేర్చి గోల్డెన్ బూట్ రేసులో అగ్రస్థానంలో నిలిచింది. ఇతర గోల్స్‌ను శ్వేతా రాణి (24 నిముషం), జులన్ నోంగ్మైథెమ్ (77 నిముషం), నీరా చాను లాంగ్జామ్ (90+5 నిముషం) సాధించారు. ఈ అద్భుతమైన విజయంతో భారత్ ఆడిన నాలుగు మ్యాచ్‌లలో నాలుగింటిలోనూ విజయాలు సాధించింది, 22 గోల్స్ మాత్రమే వదులుకోకుండా గోల్స్ చేసింది.

దీంతో తొమ్మిది పాయింట్లతో రెండవ స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ కంటే 12 పాయింట్లతో భారత్ ఇప్పుడు గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంది. నేపాల్ మూడు పాయింట్లతో రెండవ స్థానంలో ఉండగా, భూటాన్ ఇంకా ఒక్క పాయింట్ కూడా సాధించలేదు. మూడు మ్యాచ్‌ల్లో 13 గోల్స్ చేసిన తర్వాత భూటాన్ లోపాలను పూడ్చుకోవాలని తీవ్రంగా ప్రయత్నించింది. కానీ 16వ నిమిషంలో అనుష్క ఫ్రీకిక్‌తో తప్పును సరిదిద్దుకుంది. చివరికి 77వ నిమిషంలో నాల్గవ గోల్ వచ్చింది.

### ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్..

# అనిష్‌కు రజతం

**న్యూఢిల్లీ:** ఆసియా షూటింగ్ ఛాంపియన్ షిప్‌లో భారత్ జట్టు రజతం గెలుచు కుంది. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో గురువారం జరిగిన 16వ ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ ఈవెంట్‌లో అనిష్ భన్వాలా రజతంతో సరిపెట్టుకున్నాడు.



ఫైనల్‌లో ఎక్కువ భాగం ఫీల్డ్‌ను నడిపించి ఆరుగురు ఫైనలిస్టులలో అగ్రస్థానంలో నిలిచి 35 హిట్‌లతో రజతం గెలుచుకున్నాడు. ఫైనల్‌లో మరో భారతీయుడు ఆదర్శ్ సింగ్, కొరియాకు చెందిన సియోయాంగ్ యూన్‌పై షూట్‌ఆఫ్ తర్వాత 15 హిట్‌లు సాధించి మొత్తం మీద ఐదవ స్థానంలో నిలిచాడు. చైనాకు చెందిన లియాన్‌బోఫాన్ సు (36 హిట్స్) స్వర్ణం గెలుచుకోగా, కొరియాకు చెందిన జేక్యూన్ లీ (23 హిట్స్) కాంస్యంతో సరిపెట్టుకున్నాడు. 2023లో అనిష్ ఇదే ఈవెంట్‌లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. ఫైనల్స్ సగం దశలో, అనిష్ 18 హిట్‌లతో అగ్రస్థానంలో ఉండగా, ఆదర్శ్ సింగ్ 13 హిట్‌లతో నాల్గవ స్థానంలో ఉన్నాడు. ఆదర్శ్ సింగ్ (585), అనిష్ (583), నీరజ్ కుమార్ (570)లతో కూడిన భారత త్రయం 1738 పాయింట్లతో జట్టు విభాగంలో రజతం గెలుచుకుంది. కొరియా 1748 పాయింట్లతో స్వర్ణం గెలుచుకోగా, చైనా 1733 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది.

## షియోమికి యాపిల్ శాంసంగ్ నోటీసులు!

**శాన్‌ఫ్రాన్సిస్కో, ఆగస్టు 28:** చైనా స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షియోమీకి టెక్ దిగ్గజాలైన యాపిల్, శాంసంగ్ గట్టి షాక్ ఇచ్చాయి. తమ ప్రీమియం ఫోన్లను లక్ష్యంగా చేసుకుని, వాటిని పోలుస్తూ షియోమీ ప్రకటనలపై ఈ రెండు కంపెనీలు వేర్వేరుగా లీగల్ నోటీసులు జారీ చేశాయి. తమ బ్రాండ్ ప్రతిష్ఠకు నష్టం కలిగించేలా ఉన్న ఈ చర్యలు వెంటనే నిలిపి వేయాలని ఆ నోటీసుల్లో స్పష్టం చేశాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో షియోమీ తన ఫ్లాగ్‌షిప్ మోడల్ షియోమీ 15 అల్ట్రాను ప్రమోట్ చేస్తూ కొన్ని వాణిజ్య ప్రకటనలు చేసింది. ముఖ్యంగా ఏప్రిల్ ఫూల్స్ డే రోజున వార్తాపత్రికల్లో పూర్తి పేజీ యాడ్స్ ఇచ్చి, యాపిల్ ఐఫోన్ 16 ప్రో మాక్స్ కెమెరా తమ ఫోన్ ముందు సరిపోదంటూ ఎగతాళి చేసింది. అంతకుముందు మార్చిలో జరిగిన ఇండియా లాంచ్‌లో కూడా ఐఫోన్ కెమెరాను "క్యూట్" అంటూ వ్యాఖ్యానించింది. శాంసంగ్ ప్రీమియం ఫోన్లను ఉద్దేశించి కూడా ఇలాంటి ప్రచారమే చేసింది. ఈ తరహా ప్రకటనలు వ్యాపార పోటీ పరిధిని దాటి, తమ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా ఉన్నాయని యాపిల్, శాంసంగ్ ఆరోపిస్తున్నాయి. పోటీదారుల పేర్లను నేరుగా ప్రస్తావిస్తూ, వారి ఉత్పత్తులను కించపరిచేలా ప్రచారం చేయడాన్ని 'యాంబుష్ మార్కెటింగ్' అంటారు. ఈ విధానంపైనే ఆ రెండు కంపెనీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. "సాధారణంగా స్పెసిఫికేషన్లను పోల్చుకోవచ్చు. కానీ, ప్రత్యర్థి కంపెనీ పేరును నేరుగా వాడకూడదు. దానికి బదులుగా పోటీదారుల ఫోన్లు అని చెప్పాలి" అని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఒక వ్యక్తి తెలిపారు. భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో బడ్జెట్ బ్రాండ్‌గా పేరున్న షియోమీ, ఇటీవలి కాలంలో ప్రీమియం సెగ్మెంట్‌లో పట్టు సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఐడీసీ నివేదిక ప్రకారం, 2025 రెండో త్రైమాసికంలో భారత మార్కెట్లో శాంసంగ్ 14.5 వాటాతో అగ్రస్థానంలో ఉండగా, షియోమీ 9.6, యాపిల్ 7.5%తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈనేపథ్యంలో ప్రీమియం మార్కెట్లో తన వాటాను పెంచుకోవడానికే షియోమీ ఈ దూకుడు ప్రచార వ్యూహాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.







## జన్‌ధన్ డిపాజిట్లు రూ.2.68 లక్షలకోట్లు!

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. గత 11 ఏళ్లలో ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 56 కోట్లకు పైగా బ్యాంకు ఖాతాలు తెరిచినట్లు, వాటిలో జమ అయిన మొత్తం డిపాజిట్లు రూ.2.68 లక్షల కోట్లకు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం ద్వారా తెరిచిన ఖాతాల్లో 67 శాతానికి పైగా గ్రామీణ, పాక్షిక పట్టణ ప్రాంతాల్లోనే ఉండటం విశేషం. అంతేకాకుండా మొత్తం ఖాతాదారుల్లో 56 శాతం మహిళలే ఉండటం ఈ పథకం విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రయోజనాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయడానికి (డీబీటీ), రుణ సౌకర్యాలు, సామాజిక భద్రత కల్పించడానికి జన్‌ధన్ యోజన ఒక ప్రధాన మాధ్యమంగా మారిందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ పథకం కింద ఇప్పటివరకు 38 కోట్ల రూపే కార్డులను జారీ చేశారని, ఇవి దేశంలో డిజిటల్ లావాదేవీల పెరుగుదలకు కీలక పాత్ర పోషించాయని ప్రభుత్వం పేర్కొంది. 201718 ఆర్థిక సంవత్సరంలో పీఓఎస్, ఈకామర్స్ ద్వారా 67 కోట్ల రూపే కార్డు లావాదేవీలు జరగగా, 2024-25 నాటికి ఆ సంఖ్య 93.85 కోట్లకు పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి కుటుంబానికి బ్యాంకు ఖాతా, ప్రతి వయోజనుడికి బీమా, పింఛను సౌకర్యం ఉండాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. జన్‌ధన్ పథకం పరిధిని మరింత విస్తరించేందుకు సెప్టెంబర్ 30 వరకు ఈకార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన వివరించారు. దేశంలోని 2.7 లక్షల గ్రామ పంచాయతీల్లో కనీసం ఒక క్యాంపు అయినా ఏర్పాటు చేస్తాం. అర్హులైన వారు జన్‌ధన్ ఖాతాలు తెరవడం, జన్ సురక్ష పథకాల్లో చేరడం, కేవైసీ అప్‌డేట్ చేసుకోవడం వంటివి ఈ క్యాంపుల్లో పూర్తి చేయవచ్చని మంత్రి తెలిపారు. ఇప్పటికే బ్యాంకు ఖాతాల విషయంలో దాదాపు సంతృప్త స్థాయికి చేరుకున్నామని, బీమా, పింఛను కవరేజీ కూడా నిరంతరం పెరుగుతోందని ఆయన అన్నారు. గడచిన 11 ఏళ్లలో జన్‌ధన్ ఖాతాల సంఖ్య మూడు రెట్లు పెరగగా, డిపాజిట్లు సుమారు 12 రెట్లు పెరగడం గమనార్హం.

## ట్యారిఫ్ అమలుతో మళ్లీ నష్టాల్లోకి సూచీలు!




**ముంబయి, ఆగస్టు 28:** భారత ఉత్పత్తులపై 50 శాతం సుంకాలు అమల్లోకి రావడంతో మంగళవారం భారీ నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు గురువారం కూడా అదే తరహాలో పయనించాయి. వరుసగా రెండో రోజూ కూడా నష్టాలను మూటగట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపర్లు కూడా అమ్మకాలకు దిగుతుండడం మదుపర్లను మరింత కలవరపెడుతోంది. మంగళవారం విదేశీ మదుపర్లు 6, 516 కోట్లు విలువైన షేర్లును విక్రయించారు. గత మూడుసెషన్లలోకూడా ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపించారు. ఆ ప్రభావంతో గురువారంకూడా సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలను చవిచూశాయి మంగళవారం ముగింపు 80,786 పాయింట్లతో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ రోజుంతా నష్టాల్లోనే కదలాడింది. మధ్యాహ్నం తర్వాత ఆ నష్టాలు మరింత పెరిగాయి. గురువారం సెన్సెక్స్ 80, 013-80,775 శ్రేణి మధ్యలో కదలాడింది. చివరకు సెన్సెక్స్ 705 పాయింట్ల నష్టంతో 80, 080 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 211 పాయింట్ల నష్టంతో 24, 500 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో కల్యాణ్ జువెల్లర్స్, యూనో మిండా, జిందాల్ స్టెయిన్‌లెస్, టైటాన్ కంపెనీ, పెట్రోనాట్ ఎల్ఎన్‌జీ షేర్లు లాభాలను ఆర్జించాయి. అదానీ టోటల్ గ్యాస్, ఆదిత్య బిర్లా ఫ్యాషన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్స్, పూనావాలా ఫిన్‌కార్ప్, సీఈఎస్‌సీ షేర్లు నష్టాల బాటలో నడిచాయి.

# 50% ట్యారిఫ్‌లు భారత్‌కు మేలుకొలుపు!

### ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్‌రాజన్




**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్, అమెరికా ప్రభుత్వం భారత్‌పై విధించిన 50 శాతం టారిఫ్‌లపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చర్య భారత్‌కు ఒక మేల్కొలుపు లాంటిదని, ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయనడానికి ఇదే నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పరిణామం మన కళ్లు తెరిపించాలి. మనం ఏ ఒక్క దేశంపై అతిగా ఆధారపడకూడదు. తూర్పు దేశాలు, ఐరోపా, ఆఫ్రికా వైపు కూడా దృష్టి సారించాలి. అమెరికాతో వాణిజ్యం కొనసాగిస్తూనే, మన యువతకు ఉద్యోగాలు కల్పించడానికి అవసరమైన 8 నుండి 8.5 శాతం వృద్ధిని సాధించేందుకు సంస్కరణలను వేగవంతం చేయాలని రఘురామ్ రాజన్ సూచించారు. ఇతర ఆసియా దేశాలతో పోలిస్తే భారత్ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోందని ఆయన వివరించారు. ఇతర ఆసియా దేశాలకు చాలా తక్కువ బేస్ టారిఫ్‌లు ఉండగా, భారత్‌కు మాత్రం 25 శాతం బేస్ టారిఫ్ నిర్ణయించారు. ఇది మనకు నష్టదాయకమైన అంశం. దీనిని బట్టే ఇరు దేశాల మధ్య సంబంధాలు ఎంతగా క్షీణించాయో అర్థం చేసుకోవచ్చని రాజన్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆలోచనా విధానాన్ని విశ్లేషిస్తూ, వాణిజ్య లోటు ఉంటే, ఇతర దేశాలు అమెరికాను మోసం చేస్తున్నాయని ఆయన భావిస్తారు. తక్కువ ధరలకు వస్తువులు పంపడం వల్ల అమెరికా వినియోగదారులకు మేలు జరుగుతుందనే విషయాన్ని ఆయన పరిగణనలోకి తీసుకోరని అన్నారు. టారిఫ్‌ల విషయంలో ట్రంప్ ప్రభుత్వం ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌ను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకుందని ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆయన స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ దేశాలపై ఎలాంటి చర్యలు తీసుకోని అమెరికా, కేవలం భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడంపై రాజన్ ప్రశ్నలు లేవనెత్తారు. రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను కొనసాగించడం వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం అనేది మనం ఆలోచించుకోవాలి. రిఫైనరీలు లాభాలు గడిస్తున్నా, ఎగుమతిదారులు మాత్రం ఈ టారిఫ్‌లతో తీవ్రంగా దెబ్బతింటున్నారు. ప్రయోజనం కంటే నష్టమే ఎక్కువగా ఉంటే, ఈ కొనుగోళ్లపై పునరాలోచించాలని ఆయన సూచించారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో ఏ ఒక్క దేశంపైనా అతిగా ఆధారపడటం ప్రమాదకరమని రాజన్ హితవు పలికారు. అమెరికా, చైనా, జపాన్ లేదా యూరప్.. ఇలా అన్ని దేశాలతోనూ సమానంగా వాణిజ్య సంబంధాలు నెరపడం ద్వారా మన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలని తెలిపారు. రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందంటూ వైట్‌హౌస్ సలహాదారు పీటర్ నవర్రో చేసిన ఆరోపణలను కూడా ఆయన తోసిపుచ్చారు. ఈ టారిఫ్‌ల వల్ల దేశంలోని చిన్న ఎగుమతిదారుల జీవితాలు అతలాకుతలమవుతాయని రాజన్ హెచ్చరించారు. ముఖ్యంగా రొయ్యల రైతులు, టెక్స్‌టైల్ పరిశ్రమపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందన్నారు. దీనివల్ల కేవలం మన ఎగుమతిదారులే కాకుండా, 50 శాతం అధిక ధరలు చెల్లించాల్సి రావడంతో అమెరికన్ వినియోగదారులు కూడా నష్టపోతారని విశ్లేషించారు. వాణిజ్య లోటును దోపిడీగా భావించడం, విదేశీ విధానంలో కక్ష సాధింపులకు పాల్పడటం వంటి కారణాలతోనే అమెరికా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, అమెరికా ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని, దేశ ప్రజల ప్రయోజనాల కోసం రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగిస్తామని భారత ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. తమ విషయంలో కఠినంగా వ్యవహరిస్తూ, ఇతర దేశాల విషయంలో ఉదాసీనంగా ఉండటాన్ని వివక్షగా పేర్కొంది.




# పింఛన్‌దార్ల కోసం మరింత మెరుగైన సేవలు

### ఇపిఎఫ్ఒ 3.0 వెర్షన్‌ను అప్‌గ్రేట్ చేసిన ఇపిఎఫ్ఒ

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** పెన్షనర్లు తమ పింఛన్ ఖాతాలను మరింత సులువు గాయాక్సెస్‌చేసుకునేందుకు పిఎఫ్ విభాగం మార్పులుచేస్తోంది. కొత్తగా ఇపిఎఫ్ఒ 3.0ను తీసుకువస్తోంది.దీనిని మరికొన్ని రోజుల్లో విడుదల చేయనున్నారు. ముందుగా ఇపిఎఫ్ఒ 2.0 వర్షన్ వస్తుంది. దానికి మోడర్న్ టచ్ ఇస్తూ, మరింత వేగవంతంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేస్తున్నారు. ఈ ఏడాదిలోనే ఇది కూడా రానుంది. ఇన్ఫోసిస్, విప్రో, టిసిఎస్ లాంటి ప్రముఖ ఐటీ సంస్థలు దీన్ని అభివృద్ధి చేస్తున్నాయి. కొత్త పిఎఫ్ 3.0లో సులువుగా విత్‌డ్రా చేసుకునే సౌకర్యం లభిస్తుంది. ఇపిఎఫ్ఒ 3.0తో మీరు మీ పిఎఫ్ డబ్బు పేమెంట్ గేట్‌వే ద్వారా కూడా విత్‌డ్రా చేసుకోవచ్చు. అందుకోసం మీరు యుఎఎన్ (యూనివర్సల్ అకౌంట్ నెంబర్) యాక్టివేట్ చేసుకొని, మీ ఆధార్, బ్యాంక్ ఖాతాతో లింక్ చేసుకుని ఉండాలి. ఆ తర్వాత మీ కార్డుతో యుపిఐకి వెళ్లి, అవసరమైన మేరకు డబ్బు తీసుకోవచ్చు. ఇది ప్రత్యేకంగా అత్యవసర సమయాల్లో చాలా ఉపయోగపడుతుంది.ఇపిఎఫ్ఒ 3.0ద్వారా కూడా విత్‌డ్రా చేసుకోవచ్చు. డిజిటల్ యుగానికి తగ్గట్లు యుపిఐ పేమెంట్ గేట్‌వే ద్వారా కూడా పిఎఫ్ మనీ తీసుకోవచ్చు. ఇకపై మీ ఫోన్‌పే, గూగుల్‌పే,పేటిఎం లాంటి యాప్స్ ద్వారా కూడా మీ పిఎఫ్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు. దీంతోపాటు మీ పేరు, డేట్ ఆఫ్ బర్త్ మార్చుకోవాలని చూసినా, బ్యాంక్ డీటెయిల్స్ అప్‌డేట్ చేసుకోవాలన్నా ఈజీ అవుతుంది. ఇకపై ఇలాంటి మార్పులకోసం పింఛను ఆఫీసుకు వెళ్లాల్సిన పని లేదు. ఇపిఎఫ్ఒ3.0తో వెరిఫై చేసి ఆన్లైన్లోనే మార్చుకోవచ్చు. ఒక వ్యక్తి మృతి చెందినప్పుడు, కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడతారు. కానీ, కొత్త పిఎఫ్ 3.0లో ఈ క్లెయిమ్స్ ప్రాసెస్ విధానాన్ని చాలా ఈజీగా మార్చారు. మైనర్ల కోసం గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ అవసరం లేదు. అవసరమైన డాక్యుమెంట్స్ మాత్రమే ఉంటే చాలు. క్లెయిమ్ త్వరగా సెటిల్ అయిపోతుంది. ఇది వారి కుటుంబాలకు ఆర్థికంగా ఉపయోగపడుతుంది. ఇపిఎఫ్ఒ 3.0లో కొత్తగా డిజైన్ చేసిన మొబైల్ ఫ్రెండ్లీ ప్లాట్‌ఫామ్ ఉంటుంది. మీరు ఎప్పుడైనా మీ పిఎఫ్ స్టేటస్, కాంట్రిబ్యూషన్స్, క్లెయిమ్స్ ట్రాక్ చేసుకోవచ్చు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps